
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 227

మంగళవారం 8-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




మరో ప్రపంచకప్ వచ్చేసింది!

20 నుంచి ఫుట్‌బాల్ విశ్వసమరం.. బరిలో దిగనున్న 32 జట్లు - 12లో



10 నెలల గరిష్టం పైకి సూచీలు

మళ్లీ 61 వేలు దాటిన సెన్సెక్స్ 18,200 స్థాయి పైకి నిఫ్టీ - 13లో



'మోర్బీ'పై సుమోటోగా విచారణ

135 మంది ప్రాణాలను బలిగొన్న మోర్బీ వంతెన దుర్ఘటనను గుజరాత్ హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది.

వివరాలు 6లో



రేప్ కేసులో ఉరిశిక్షలు రద్దు

ఢిల్లీలో 2012లో జరిగిన గ్యాంగ్ రేప్, హత్య కేసులో ఉరిశిక్ష పడిన ముగ్గురూ నిర్దోషులేనని సుప్రీంకోర్టు పేర్కొంది.

వివరాలు 6లో



వాగ్దానాలు కొంతవరకు నెరవేర్చా

ఇచ్చిన వాగ్దానాలను కొంత వరకు నెరవేర్చ గలిగానని ఢిల్లీలో జరిగిన వీడ్కోలు సభలో సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ చెప్పారు.

వివరాలు 6లో



హేమంత్‌కు సుప్రీంలో ఊరట

మైనింగ్ లీజు కేసులో రాష్ట్ర ప్రభుత్వ అప్పీళ్లను స్వీకరించడంతో జార్ఖండ్ సీఎం హేమంత్‌కు సుప్రీంలో ఊరట లభించింది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

16 నుంచి అయ్యప్ప దర్శనం



శబరిమల అయ్యప్పస్వామి దర్శనాలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది జనవరి 18వ తేదీ వరకు ఈ విడత దర్శనాలు కొనసాగుతాయి. కేరళలోని శబరిమల అయ్యప్ప దర్శనానికి రాష్ట్రం నుంచి ఈసారి 5 లక్షలకు పైగా భక్తులు తరలివెళ్తారని అంచనా.

వివరాలు 5లో ▸

వ్యవసాయ డ్రోన్ పైలెట్ శిక్షణకు గ్రీన్‌సిగ్నల్



వ్యవసాయ, సంప్రదాయ డ్రోన్ పైలెట్ శిక్షణ ఇచ్చేందుకు ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి డీజీసీఏ అనుమతి ఇచ్చింది. దేశంలోనే తొలిసారి వర్సిటీకి లైసెన్సు జారీచేస్తూ డీజీసీఏ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జితేందర్ లౌరా ఉత్తర్వులిచ్చారు.

వివరాలు 3లో ▸

కలెక్టర్‌పై రెచ్చిపోయిన జేసీ ప్రభాకర్‌రెడ్డి



తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌పై రెచ్చిపోయారు. అనంతపురంలో 'స్పందన' కార్యక్రమానికి వచ్చిన ఆయన కలెక్టర్ నాగలక్ష్మిపై అరుపులు, కేకలతో ఊగిపోతూ తీవ్ర అలజడి సృష్టించారు. ఆమె ముందే పేపర్లు విసిరేశారు.

వివరాలు 5లో ▸

అమెరికాలో నేడే 'మధ్యంతరం'



అగ్రరాజ్యం అమెరికాలో మధ్యంతర (మిడ్ టర్మ్) ఎన్నికలకు రంగం సిద్ధమయ్యింది. మంగళవారం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో వెలువడే ఫలితాలు ప్రస్తుత అధ్యక్షుడి మిగిలిన రెండేళ్ల పదవీ కాలంపై ప్రభావం చూపనున్నాయి.

వివరాలు 6లో ▸

రైతన్నకు 'మద్దతు'

ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి రాకూడదు: సీఎం

- ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర పూర్తిగా తొలగించాలి
- అన్నదాతలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా ధాన్యం సేకరణ
- ఈ – క్రాప్ డేటా ఆధారంగా పారదర్శకంగా కొనుగోళ్లు
- రబీలో తోడుగా నిలవాలి.. ఏది కావాలన్నా వెంటనే అందించాలి
- వచ్చే రెండేళ్లలో ప్రతీ ఆర్బీకేలో డ్రోన్ ఉండేలా ప్రణాళిక
- వ్యవసాయ రంగంలో డ్రోన్ల రాకతో ఎరువుల వృథాకు చెక్
- నానో ఫెర్టిలైజర్స్ వాడకంతో మొక్కలకు సమర్థంగా పోషకాలు
- మార్చికి ఆర్బీకేల్లో ప్లాంట్ డాక్టర్ సేవలు ప్రారంభం
- పొలంబడుల్లో వర్సిటీ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్
- 29న సున్నా వడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ జమకు ఏర్పాట్లు



చిరస్మరణీయుడు శ్రీ మేకపాటి గౌతమ్‌రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్. చిత్రంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, రచయిత డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

2లో

సాక్షి, అమరావతి: రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతన్నలకు ఏ లోటూ రానివ్వకుండా అన్ని విధాలా తోడుగా నిలవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇన్‌పుట్స్ సహా అన్నీ సకాలంలో అందించాలని స్పష్టం చేశారు. విత్తనాల నుంచి ఎరువుల వరకు సాగు ఉత్పాదకాలన్నీ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచి సాగు మెళకువలు, సూచనలు అందించాలన్నారు. ఈ దఫా రబీలో 22.92 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కానున్నట్లు అంచనా వేస్తున్నామని, బోర్ల కింద ప్రత్యామ్నాయ పంటలు సాగును ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించి

మిగతా 2వ పేజీలో ▶

> రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంటలు అమ్ముకునే పరిస్థితి రాకూడదు. ఒక్క ధాన్యమే కాదు.. ఇతర వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యాన పంటలకూ కనీస మద్దతు ధర లభించేలా అధికారులు సవాల్‌గా తీసుకుని పనిచేయాలి. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర ఏమాత్రం ఉండకూడదు. ఈ - క్రాప్ వంద శాతం పూర్తి కావాల్సిందే. రైతుల ఈ-కేవైసీ 93 శాతం పూర్తి కాగా మిగిలిన 7 శాతం రైతులకు ఎస్‌ఎంఎస్‌ల ద్వారా ఈ-క్రాప్ వివరాలు పంపించాలి. ఈ - క్రాప్ డేటా ఆధారంగా గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా ధాన్యం సేకరణ పారదర్శకంగా చేపట్టాలి. వ్యవసాయ, పౌరసరఫరా శాఖలు సమన్వయంతో పని చేయాలి.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఈడబ్ల్యూఎస్ కోటా చెల్లుతుంది

ఆ రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధమే

చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

- 3:2 మెజారిటీతో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు
- సమర్థించిన జస్టిస్ మహేశ్వరి, త్రివేదీ, పార్దీవాలా
- వ్యతిరేకించిన సీజేఐ లలిత్, జస్టిస్ రవీంద్రభట్
- రిజర్వేషన్లను సమీక్షించాలన్న న్యాయమూర్తులు

6లో





ఎస్.రవీంద్ర భట్

> ఆర్థిక ప్రమాణాలపై రిజర్వేషన్ ప్రవేశపెట్టడం అనుమతించదగినదే. కానీ ఎస్సీ,ఎస్టీ, ఓబీసీల్లో వెనకబడిన తరగతుల వారు ప్రయోజనాలు పొందుతున్నారనే కారణంతో వారిని మినహాయించడం ఏకపక్షం. 103వ రాజ్యాంగ సవరణ చట్టంలోని సెక్షన్ 3 రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తోంది. కనుక అది రాజ్యాంగ విరుద్ధం. అందుకే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కొట్టేస్తున్నాం.
>
> - సీజేఐ జస్టిస్ లలిత్, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్



> 103వ రాజ్యాంగ సవరణను కొట్టేయలేం. అది చెల్లుబాటవుతుంది. ఈడబ్ల్యూఎస్ వర్గం లబ్ధి కోసం పార్లమెంటు తీసుకున్న సకారాత్మక చర్యగా దాన్ని చూడాలి. అయితే రిజర్వేషన్లకు కాలపరిమితి ఉండాలి. పార్లమెంటు, శాసనసభల్లో ఎస్సీ, ఎస్టీ ప్రాతినిధ్య గడువుకు కాలపరిమితి ఉంది. పార్లమెంటులో ఆంగ్లో ఇండియన్ల రిజర్వేషన్లకు తెర పడింది. స్వాతంత్ర్య అమృతోత్సవాల వేళ సమాజ విస్తృత ప్రయోజనాల కోసం రిజర్వేషన్ల వ్యవస్థను పునఃపరిశీలించాలి.
>
> - జస్టిస్ బేలా ఎం త్రివేదీ

ఏపీ సీడ్స్‌కు గ్లోబల్ అగ్రి అవార్డు

దేశంలోనే తొలిసారిగా గ్రామ స్థాయిలో విత్తన సరఫరా

- మూడేళ్లలో 50.95 లక్షల రైతులకు 34.97 లక్షల క్వింటాళ్ల విత్తనాల పంపిణీ
- ఏపీ సీడ్స్‌కు ఇండియా అగ్రి బిజినెస్ అవార్డు ప్రకటించిన ఐసీఎఫ్‌ఏ
- గతేడాది 'సిల్వర్ స్కోచ్', 'గవర్నెన్స్ నౌ' అవార్డులు
- ఏపీ సీడ్స్‌ను అభినందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా మూడేళ్లుగా గ్రామ స్థాయిలోనే రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్)కు మరో ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డు దక్కింది. వ్యవసాయ రంగంలో అత్యుత్తమ విధానాలు పాటిస్తూ ఉత్పత్తి, ఉపకరణాలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్, అదనపు విలువ జోడింపు, మౌలిక సదుపాయాలు, ఎగుమతుల్లో విశేష ప్రతిభ కనబర్చిన సంస్థలకు ఇండియన్ ఛాంబర్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐసీఎఫ్‌ఏ) ఏటా ఇండియా అగ్రి బిజినెస్ అవార్డులను ప్రదానం చేస్తోంది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విత్తన పంపిణీ కేటగిరీలో ఏపీ సీడ్స్‌కు 'గ్లోబల్ అగ్రి అవార్డు–2022'ను ప్రకటించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను పంపిణీ చేయడంలో ఏపీ సీడ్స్ కీలకపాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలోనే కోవిడ్ విపత్కర పరిస్థితులకు ఎదురొడ్డి మరీ రైతులకు సేవలందించిన ప్రభుత్వరంగ సంస్థగా ఏపీ సీడ్స్‌కు గుర్తింపు లభించింది. గతేడాది స్కోచ్ సంస్థ సిల్వర్ స్కోచ్ అవార్డు అందించగా.. గవర్నెన్స్ నౌ అనే అంతర్జాతీయ సంస్థ జాతీయ స్థాయిలో పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ (పీఎస్‌యూ) కేటగిరీలో గవర్నెన్స్ నౌ నేషనల్ అవార్డుకు

మిగతా 2వ పేజీలో ▶



ప్రధాని విశాఖ పర్యటన ఖరారు

- 11న రాత్రి 7.25కు విశాఖకు చేరుకోనున్న ప్రధాని మోదీ
- 12వ తేదీ ఉ.10.30 గంటలకు ఏయూలో సభకు హాజరు
- రూ. 10,742 కోట్లతో ఐదు ప్రాజెక్టులకు శంకుస్థాపన.. రెండు జాతికి అంకితం
- అదేరోజు మధ్యాహ్నం విశాఖ నుంచి తిరుగు ప్రయాణం

2లో

ఏపీఎండీసీ పునర్వ్యవస్థీకరణ

- మరింత బలోపేతానికి సీఎం జగన్ నిర్ణయం
- అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీతో ఒప్పందం

2లో

ఎయిమ్స్‌లోనూ ఆరోగ్యశ్రీ సేవలు

- త్వరలో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు.. ఇప్పటికే రూ.55 కోట్లతో ఎయిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన
- ఎయిమ్స్‌ను సందర్శించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ఎయిమ్స్ వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

సాక్షి, అమరావతి/మంగళగిరి: మంగళగిరిలోని ప్రతిష్టాత్మక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకొస్తున్నట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు. ఎయిమ్స్‌ను సోమవారం మంత్రి సందర్శించి వైద్య విభాగాలు, మౌలిక వసతులను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులతో ముచ్చటించారు. ఎయిమ్స్ అధికారులతో కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేకంగా భేటీ అయి పలు విషయాలపై చర్చించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మెంటల్ హెల్త్, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అంశాల్లో ఎయిమ్స్‌తో ఏపీ ప్రభుత్వం ఎంవోయూలు చేసుకుంటుందని, తద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని విద్యార్థులకు ఆయా అంశాల్లో ఎయిమ్స్ నుంచి అత్యుత్తమ శిక్షణ లభిస్తుందని తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ పాలియేటివ్ కేర్‌గా ఎయిమ్స్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన తోడ్పాటు, సాయాన్ని అందించనున్నట్టు చెప్పారు.

రూ.55 కోట్లతో మౌలిక వసతుల కల్పన

ముఖ్యమంత్రి నిర్ణయానికి అనుగుణంగా ఎయిమ్స్‌కు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆత్మకూరు రిజర్వాయర్ నుంచి రూ.7.74 కోట్లతో పైపు లైన్ పనులు సోమవారం నుంచే ప్రారంభించినట్టు మంత్రి రజిని తెలిపారు. తాత్కాలికంగా మంగళగిరి–తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ నుంచి రోజుకు 3.5 లక్షల లీటర్ల నీటిని ఉచితంగా సరఫరా చేస్తున్నామని, మరో లక్ష లీటర్ల నీటిని అత్యవసర సమయాల్లో వాడుకునేందుకు వీలుగా నిత్యం అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. సంస్థ విస్తరణలో భాగంగా

మిగతా 2వ పేజీలో ▶



ప్రభుత్వానికి ఏం సంబంధం?



- రెండు ప్రైవేట్ కంపెనీల మధ్య జరిగిన ఒప్పందంపై నీచపు రాతలేల?
- రేడియంట్ డెవలపర్స్‌కు విశాఖలో భూమి కేటాయించింది టీడీపీయేగా?
- నాటి టీడీపీ ప్రభుత్వం జీఓ నంబరు 77తో 50 ఎకరాలు కేటాయించింది.. వాళ్లు వీఎంఆర్‌డీఏకు డబ్బులు చెల్లించింది కూడా బాబు హయాంలోనే
- ఆ భూమి పూర్తిగా వాళ్లు కొనుక్కున్నాకనే మాతో డెవలప్‌మెంట్ ఒప్పందం.. మాకు ఆ కంపెనీ 30 ఏళ్లుగా తెలుసు.. అందుకే జాయింట్ డెవలప్‌మెంట్
- టీడీపీ, 'ఈనాడు', ఎల్లో మీడియాపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఫైర్

3లో

చిరుధాన్యాలతోనే విరుగుడు



సంపూర్ణ ఆరోగ్యానికి వాటి వినియోగం తక్షణం పెంచాలి

- వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా తృణధాన్యాలను ప్రోత్సహించాలి
- దేశంలో రక్తహీనత, ఊబకాయం, క్యాన్సర్లకు అవే పరిష్కారం.. వాటి తలసరి వినియోగం 32.9 కేజీల నుంచి 4.2 కేజీలకు తగ్గింది
- వరి, గోధుమల కన్నా చిరుధాన్యాలకే మద్దతు ధర ఎక్కువ.. అయితే ఆ రైతులకు ఆదాయం తక్కువ
- ప్రభుత్వాలు నగదు రాయితీలు ఇవ్వాలి
- నాబార్డు అధ్యయన నివేదికలో వెల్లడి

14లో

■ దేశ ప్రజల సంపూర్ణారోగ్యానికి చిరుధాన్యాల వినియోగాన్ని తక్షణం పెంచాల్సిన ఆవశ్యకత ఉందని నాబార్డు అధ్యయన నివేదిక స్పష్టంచేసింది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలపై ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నప్పటికీ ఆ స్థాయిలో వినియోగం పెరగడంలేదని, సరఫరా చేయడం సాధ్యంకావడంలేదని నివేదిక తెలిపింది. 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా జరుపుకోవాలని ప్రపంచమంతా సిద్ధమవుతోందని, భారత్ కూడా తృణ ధాన్యాలను ప్రోత్సహించాలని ఆ నివేదిక పేర్కొంది.

ఉన్నత విద్యపైనా విషమే..



- టీడీపీ సర్కార్ తప్పిదాలను కప్పిపుచ్చిన 'ఈనాడు'
- పోస్టుల భర్తీకి న్యాయపరమైన ఇబ్బందులు
- గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ఈ సమస్య
- సెర్చ్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఆర్జీయూకేటీ వీసీ నియామకం
- వర్సిటీల నిధులను టీడీపీ ప్రభుత్వమే మళ్లించింది
- పీజీ కోర్సుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విజిలెన్స్ విచారణ జరుగుతోంది
- పచ్చ పత్రిక రోత రాతలపై ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. కె.హేమచంద్రారెడ్డి ఘాటు కౌంటర్

2లో

క్లుప్తంగా

'చిరస్మరణీయుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్

సాక్షి, అమరావతి : దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రజా, రాజకీయ జీవితాన్ని విశ్లేషిస్తూ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రచయిత, జర్నలిస్ట్ విజయార్కె రాసిన.. 'చిరస్మరణీయుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి' పుస్తకాన్ని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను సీఎం గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, పిల్లుట్ల రఘు, మోచర్ల నారాయణరావు, వీర్ల పార్థసారథి పాల్గొన్నారు.

వైఎస్సార్ షాదీ తోఫాకు దూదేకులు అర్హులే

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ షాదీ తోఫా పథకానికి ముస్లిం దూదేకులు, మెహతార్ ముస్లింలు అర్హులేనని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ స్పష్టం చేశారు. వైఎస్సార్ షాదీ తోఫా విషయమై జిల్లా స్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయని ముస్లిం దూదేకుల పొలిటికల్ జేఏసీ పేర్కొన్న నేపథ్యంలో.. వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని ఇంతియాజ్ స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల మైనారిటీ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీకి రెవెన్యూ లోటు నిధుల విడుదల



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ సహా మొత్తం 14 రాష్ట్రాలకు రెవెన్యూ లోటు నిధులను కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం విడుదల చేసింది. నవంబర్ వాటా కింద మొత్తం రూ.7,183.42 కోట్లు విడుదల చేయగా, అందులో ఏపీ వాటా కింద రూ.879.08 కోట్లు విడుదలయ్యాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మొత్తం రూ.57,467.33 కోట్లు విడుదల చేయగా, అందులో ఏపీకి రూ.7,032.67 కోట్లు దక్కాయని ఆర్థిక శాఖ వెల్లడించింది.

నోటిఫైడ్ వ్యాధులుగా టైఫాయిడ్, చికున్ గున్యా

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం టైఫాయిడ్, చికున్ గున్యాను నోటిఫైడ్ వ్యాధులుగా ప్రకటించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎపిడమిక్ డిసీజెస్ టైఫాయిడ్, చికున్ గున్యా నిబంధనలు–2022 పేరిట మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇకపై ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాధి నిర్ధారణ, చికిత్స తదితర కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశించారు. అనుమానిత, నిర్ధారిత కేసుల వివరాలను ఎప్పటికప్పుడు వైద్య శాఖకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వ్యక్తులు, సంస్థలు ఐపీసీ 188 సెక్షన్ ప్రకారం శిక్షార్హులన్నారు. 2030 వరకూ ఈ ఉత్తర్వులు చెల్లుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఏడు యూడీఏల పరిధి పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఏడు పట్టణాభివృద్ధి సంస్థల (యూడీఏల) పరిధిని పెంచింది. పుట్టపర్తి, నెల్లూరు, అనంతపురం, ఒంగోలు, ఏలూరు, కర్నూలు, శ్రీకాకుళం యూడీఏల పరిధి పెరిగింది. కొత్తగా మొత్తం 69 మండలాల్లోని 1,339 గ్రామాల పరిధిలో ఉన్న 16,406 చ.కి.మీ. విస్తీర్ణాన్ని ఈ యూడీఏల పరిధిలోకి తెచ్చారు. ఈమేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

53 మంది డీఎస్పీల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 53 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులిచ్చారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సమావేశంలో డీఎస్పీల రికార్డులు, సర్వీసు వివరాలను పరిశీలించి వాటి ఆధారంగా బదిలీలు, కొందరి పోస్టింగ్‌లకు సిఫారసు చేయగా.. ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

విరాళాల సేకరణలో తానా రికార్డు

సాక్షి, అమరావతి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 23వ మహాసభల సన్నాహక కార్యక్రమ విందులో అక్కడి తెలుగు వారు భారీగా విరాళాలు ప్రకటించారు. తానా అధ్యక్షుడు అంజయ్యచౌదరి లావు, కన్వీనర్ పొట్లూరి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన విరాళాల సేకరణ విందులో రూ.48 కోట్ల (6 మిలియన్ల డాలర్లు) విరాళాలు ప్రకటించారు. తానా 45 ఏళ్ల చరిత్రలో మహాసభల విరాళాల సేకరణలో ఇది సరికొత్త రికార్డుగా చెబుతున్నారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్ల తర్వాత ఫిలడెల్ఫియా నగరంలో వచ్చే ఏడాది జూలై 7 నుంచి 9 వరకు జరగనున్న తానా మహాసభల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా పెన్సిల్వేనియాలోని ఫ్యూజ్ బాంక్వెట్ హాల్‌లో ఈ విందు జరిగింది.

ఏపీఎండీసీ పునర్వ్యవస్థీకరణ

మరింత బలోపేతానికి సీఎం జగన్ నిర్ణయం

- అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీతో ఒప్పందం
- ఏపీఎండీసీ పనితీరుపై 3 నెలల్లో ఒక నివేదిక ఇవ్వనున్న అస్కీ
- లక్ష్యాల సాధన, కెరీర్ ప్రోగ్రెషన్ ప్రణాళికపై విధి విధానాల రూపకల్పన
- ఇప్పటికే సీఎం నిర్ణయాలతో బలమైన సంస్థగా ఏపీఎండీసీ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు
- అస్కీ సహకారంతో మరింత అభివృద్ధి



ఒప్పందం చేసుకుంటున్న గనుల శాఖాధికారులు, అస్కీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ను మరింత బలోపేతం చేసేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కీ) సహకారంతో ఈ సంస్థను పునర్వ్యవస్థీకరించనున్నారు. ఇందుకోసం అస్కీతో ఏపీఎండీసీ ఒప్పందం చేసుకుంది. సోమవారం గనుల శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఏపీఎండీసీ వీసీ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి, సలహాదారు డీఎల్ఆర్ ప్రసాద్ హైదరాబాద్‌లోని అస్కీ కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం పునర్వ్యవస్థీకరణ ఒప్పందంపై ఏపీఎండీసీ తరఫున వీజీ వెంకటరెడ్డి, అస్కీ నుంచి రిజిస్ట్రార్ ఓపీ సింగ్, ప్రొఫెసర్ హర్ష శర్మ సంతకాలు చేశారు. ఏపీఎండీసీ నిర్వహణ సామర్థ్యం, ఉద్యోగుల నైపుణ్యాలను మరింత పెంచాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల ప్రకారం ఈ ఒప్పందం జరిగిందని వెంకటరెడ్డి తెలిపారు. ఒప్పందంలో భాగంగా అస్కీ ఏపీఎండీసీ పనితీరును అధ్యయనం చేసి 3 నెలల్లో ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి. కార్పొరేట్ సంస్థలకు దీటుగా వార్షిక లక్ష్యాల సాధన, అధికారులు, ఉద్యోగుల పనితీరు, కెరీర్ ప్రోగ్రెషన్ ప్రణాళికను అమలు చేయడంపై విధి విధానాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

సీఎం జగన్ నిర్ణయాలతో ఇప్పటికే బలమైన సంస్థగా ఏపీఎండీసీ

సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాలతో ఏపీఎండీసీ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ వేదికలపై బలమైన సంస్థగా ఎదిగింది. పారదర్శక విధానాలు అవలంబిస్తూ, జాతీయ స్థాయిలో కోల్ ఇండియా, సింగరేణి వంటి సంస్థలతో పోటీ పడి వాణిజ్య సరళిలో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించిన ప్రభుత్వ రంగ సంస్థగా అరుదైన గుర్తింపును అందుకుంది. బెరైటీస్ ఉత్పత్తి, విక్రయాల్లో మిడిల్ ఈస్ట్ దేశాల్లోనే అతిపెద్ద ఎగుమతిదారుగా అవతరించింది. గ్రానైట్, బాల్ క్లే, కాల్సైట్, సిలికాశాండ్ వంటి ఖనిజాల ఉత్పత్తిలోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని సుల్యారీలో బొగ్గు గనులను నిర్వహిస్తోంది. త్వరలో జార్ఖండ్‌లోని బ్రహ్మదియాలో కోకింగ్ కోల్ ఉత్పత్తికి సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థ పురోగతిని శాస్త్రీయంగా మదింపు చేసి, అధికారులు, ఉద్యోగుల వృత్తి నైపుణ్యాలు, మార్కెటింగ్ వ్యూహాలు, జాతీయ – అంతర్జాతీయ దృక్పథం, మార్కెటింగ్ ఎత్తుగడలను సరైన విధానంలో అనుసరించేందుకు అస్కీ సహకారం తీసుకోనుంది. ఏపీఎండీసీ పునర్వ్యవస్థీకరణతో సంస్థ రూపురేఖలు మారతాయని, సంస్థాగత సామర్థ్యం గణనీయంగా మెరుగుపడుతుందని వీసీ, ఎండీ వెంకటరెడ్డి తెలిపారు.

ప్రధాని విశాఖ పర్యటన ఖరారు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/ఏయూ క్యాంపస్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన ఖరారయ్యింది. ఈ సందర్భంగా మొత్తం రూ.10,742 కోట్లు విలువ చేసే ఐదు నూతన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన రెండు ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితం చేస్తారు. ఇందుకోసం ప్రధాని ఈ నెల 11వ తేదీన విశాఖపట్నానికి చేరుకుంటారు. ఆ రోజు సా.5.30 గంటలకు మధురై విమానాశ్రయం నుంచి బయల్దేరి రాత్రి 7.25 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఆ తర్వాత చోళ షూట్‌కు చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. ఇక 12వ తేదీ ఉ.10.10 గంటలకు చోళ షూట్ నుంచి ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో జరగనున్న బహిరంగ సభకు బయల్దేరుతారు. 10.30 గంటలకు రోడ్డు మార్గంలో అక్కడకు చేరుకుని 11.45 వరకు జరిగే బహిరంగ సభలో ఈ ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తారు. అనంతరం 12 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని 12.05 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు తిరుగు ప్రయాణం అవుతారు.

సిద్ధమవుతున్న సభావేదిక

మరోవైపు.. 12వ తేదీన జరిగే బహిరంగ సభకు ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రధాన వేదికను రేయింబవళ్లు తీర్చిదిద్దుతున్నారు. రెండు భారీ జర్మన్ టెంట్ల ఏర్పాటు ఇప్పటికే పూర్తికావొచ్చింది. ఇక మద్దిలపాలెం గేట్ నుంచి ఏయూలోకి ప్రధాన మంత్రి ప్రయాణించే మార్గంలో రహదారికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటుచేస్తున్నారు. దారిపొడవునా, ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మైదానం చుట్టూ వీటిని ఏర్పాటుచేశారు. ఈ మొత్తం ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

బాంబు స్క్వాడ్ విస్తృత తనిఖీలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు, బాంబు స్క్వాడ్ అణువణువూ తనిఖీ చేస్తున్నారు. గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రముఖులు పాల్గొననుండడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రధాన వేదికకు ఎదురుగా భారీగా ఫ్లెక్సీలనూ ఏర్పాటుచేస్తున్నారు.

ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన, జాతికి అంకితం చేసే ప్రాజెక్టులు..

శంకుస్థాపన ప్రాజెక్టులు	వ్యయం (రూ. కోట్లలో)
విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ	152
ఆరులైన్ల రాయ్‌పూర్–విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్	3,778
కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు ప్రత్యేక రహదారి	566
విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ	460
శ్రీకాకుళం–అంగుల్ గెయిల్ పైపులైన్	2,658
జాతికి అంకితం చేసే ప్రాజెక్టులు	
పాతపట్నం–నరసన్నపేట రెండులైన్ల రహదారి	211
ఓఎన్‌జీసీ–యూ ఫీల్డ్ అభివృద్ధి ప్రాజెక్టు	2,917
మొత్తం	రూ.10,742 కోట్లు

ఉన్నత విద్యపైనా విషమే..

పచ్చ పత్రిక రోత రాతలపై ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. కె.హేమచంద్రారెడ్డి ఘాటు కౌంటర్



సాక్షి, అమరావతి: విద్యారంగంపై ఈనాడు మరోసారి విషం చిమ్మింది. ఉన్నత విద్యారంగంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దేశంలోనే అగ్రగామిగా ఉండేలా తీర్చిదిద్దుతుంటే ఆ పత్రిక మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య కథనాలు వండుతోంది. పాఠశాల విద్యపై ఇప్పటికే విషం కక్కిన ఆ పత్రిక తాజాగా ఉన్నత విద్యపైనా అదే తీరుతో రోత రాతలు రాసింది. గత ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చి వాటిని ప్రస్తుత ప్రభుత్వానికి ఆపాదించేందుకు అక్షరం అక్షరంలోనూ ప్రయత్నించింది. యూనివర్సిటీల్లో నియామకాలు, ట్రిపుల్ ఐటీలకు భవనాల నిర్మాణం, ఫీజు రీయింబర్స్‌మెంటు, అక్రిడిటేషన్ సహా పలు అంశాలపై 'మాటల్లోనే మహర్దశ' అంటూ అవాస్తవాలు ప్రచారం చేసింది. వీటన్నింటిపై ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. కె.హేమచంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొ.రామ్మోహనరావు, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఒక్కో అంశాన్ని వివరిస్తూ వాటివెనకున్న నిజాలను వెల్లడించారు. ఆయన ఏమన్నారంటే..

కోర్టు కేసులవల్లే రిక్రూట్‌మెంట్ జాప్యం

గత మూడున్నరేళ్లుగా వర్సిటీల్లో రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించడంలేదని ఈనాడు కథనం రాసింది. నిజానికి.. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ కోసం హడావుడిగా నిబంధనలు ఉల్లంఘిస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో హైకోర్టులో 70కి పైగా కేసులు దాఖలయ్యాయి. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ కేసుల్లోని వాస్తవాలను తెలియజేసి ప్రభుత్వ అభిప్రాయాలను గట్టిగా వినిపించడానికి కమిటీని ఏర్పాటుచేసింది. ఫలితంగా జారీ చేసిన నోటిఫికేషన్లన్నింటినీ రద్దుచేస్తూ కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. ఆ తీర్పు ఫలితంగా ఫిబ్రవరి 2022లో ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌లో వర్సిటీ ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంటును కూడా చేర్చింది. అయితే, సింగిల్ జడ్జి తీర్పుపై అనేక రిట్ అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిపైనా ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేసింది. కేసు విచారణలో ఉన్నందున పోస్టుల భర్తీకి ముందుకెళ్లలేకపోతోంది తప్ప ఇందులో ప్రభుత్వ వైఫల్యం ఏమీలేదు. ఇప్పటికే ప్రభుత్వం రెండువేల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 1000 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను గుర్తించింది.

ఆర్జీయూకేటీ వీసీ నియామకంపై..

ఇక ఆర్జీయూకేటీ వీసీ నియామకానికి 2020 జనవరిలో నోటిఫికేషన్ ఇవ్వగా 20 దరఖాస్తులొచ్చాయి. వీటిలో సరైన వారులేరు. వాస్తవానికి ఆర్జీయూకేటీ చట్టం ప్రకారం చాన్సలర్‌కు సహాయంగా ఉండడానికే వీసీ పరిమితం. ఎలాంటి అధికారం లేనందుకే సరైన వారు దరఖాస్తుచేయడంలేదు. చట్టాన్ని సవరించేందుకు వర్సిటీ చర్యలు చేపట్టింది. మళ్లీ 2022 జూన్ 6న నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దాదాపు 60 దరఖాస్తులొచ్చాయి. సెర్చ్ కమిటీ సమావేశం ఈనెల 18న జరుగుతుంది. కమిటీ సిఫార్సుల ప్రకారం వీసీని నియమిస్తారు.

అక్రిడిటేషన్‌పైనా తప్పుడు వార్తలే..

ఆర్జీయూకేటీని 2008లో పెడితే 2020వరకు యూజీసీ 12బీ గుర్తింపు కూడా రాలేదు. గత ప్రభుత్వం దీనిపై కనీస చర్యలూ తీసుకోలేదు. ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుని 12బీ గుర్తింపు సాధించింది. న్యాక్ అక్రిడిటేషన్ రావాలంటే ఇది అవసరం. ఇప్పుడు న్యాక్ అక్రిడిటేషన్ కోసం చర్యలు చేపట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కాలేజీలన్నింటికీ న్యాక్ గుర్తింపు ఉండాలని జీఓ కూడా ఇచ్చారు. గతంలో 213 కాలేజీలకు మాత్రమే న్యాక్ అక్రిడిటేషన్ ఉండగా ఇప్పుడు 275 కాలేజీలు పొందాయి. ఇక రాష్ట్ర వర్సిటీల్లో గత ప్రభుత్వ హయాంలో ఆరింటికి అసలు న్యాక్ అక్రిడిటేషనే లేదు. ఇప్పుడు అన్నింటికీ ఆ గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

వర్సిటీల నిధులపైనా అసత్యాలు

వర్సిటీల నిధులను ప్రభుత్వం లాగేసుకుంటోందని ఈనాడు కథనం అల్లడం హాస్యాస్పదం. ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో తమ మిగులు నిధులను జమచేయాలని ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను కోరింది. దీనికోసం వారికి నెలవారీ 6.20 శాతం వడ్డీ కూడా ఇస్తోంది. నిజానికి.. గత ప్రభుత్వం ఆర్జీయూకేటీ నుంచి రూ.180 కోట్లు, ఆంధ్రా వర్సిటీ నుంచి రూ.150 కోట్లు 'పసుపు కుంకుమ' కోసం దారిమళ్లించింది. దీన్ని ప్రభుత్వం యూనివర్సిటీల నిధులను స్వాహా చేయడం అంటారు. అలాగే, బడ్జెట్ తగ్గించామన్నదీ అవాస్తవం. గతంలో ఏ మేరకు బడ్జెట్ ఉందో అంతే మొత్తాన్ని ఇప్పుడూ ప్రభుత్వం ఇస్తోంది. అయితే, సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు ప్రభుత్వం ఇవ్వదు.

పీజీ కోర్సుల్లో అక్రమాలకు తెరదించేలా చర్యలు

పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వడం లేదన్న అంశంలోనూ తప్పుదోవ పట్టించేలా వార్త రాశారు. గతంలో ప్రైవేట్ కాలేజీలు ఫీజు రీయింబర్స్‌మెంటు కోసం దొంగ చేరికలతో అక్రమాలకు పాల్పడేవి. ఇలా రూ.450 కోట్లు స్వాహా చేసేవి. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. వర్సిటీలు కూడా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. విచారణ నివేదికలు రాగానే ఫీజు రీయింబర్స్‌మెంటుపై చర్యలుంటాయి.

గత ప్రభుత్వ లోపాల వల్లే ఆ ట్రిపుల్ ఐటీల్లో సమస్య

శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను గత టీడీపీ ప్రభుత్వం 2016లో ప్రారంభించి ఒక్క పోస్టూ ఇవ్వలేదు. భవన నిర్మాణమూ చేపట్టలేదు. పైగా 2018లో ఎన్నికలకు ముందు అనుమతుల్లేకుండా రూ.450 కోట్లతో ఒంగోలు భవనాల పనులకు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి శంకుస్థాపన చేసింది. ఆ తరువాత వాటిని నిలిపివేశారు. ఈ ప్రాంతంపై కోర్టు కేసులు ఉండడంతో వెనుకబడిన ప్రాంతం అయిన కనిగిరి మండలం బల్లిపల్లిలో నిర్మాణానికి అనుమతులిచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చాక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీని ట్వంటీయత్ సెంచరీ గురుకులంతో పాటు మరో సంస్థ భవనాలను కేటాయించి విద్యా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. వచ్చే ఏడాదికి పూర్తిగా శ్రీకాకుళానికి కొత్త క్యాంపస్ సిద్ధమవుతుంది. శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు 420 టీచింగ్, 178 నాన్‌టీచింగ్ పోస్టులను 2020లో ప్రభుత్వం మంజూరు చేసినా న్యాయపరమైన సమస్యల కారణంగా అవీ ముందుకు సాగలేదు.

ఫీజు రీయింబర్స్‌మెంటుపైనా రోత రాతలు

2020–21 నాల్గో త్రైమాసికం ఫీజు రీయింబర్స్‌మెంటు కోత పెట్టారని అసత్యాలు రాశారు. అప్పట్లో కోవిడ్‌తో కాలేజీలు మూడు నెలలకు మించి జరగలేదు. కాలేజీలకు నిర్వహణ వ్యయం చాలా తగ్గింది. పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి ఉంటే ప్రభుత్వం ఫీజులను 70 శాతమే వసూలు చేసుకోవాలని జీవో ఇచ్చింది. అతదే రీతిలో 2020–21కి నాలుగో త్రైమాసిక ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కోరవద్దని విద్యార్థుల నుండి వసూలుచేయవద్దని విద్యామంత్రి అన్ని ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలకూ లేఖ రాశారు. కాలేజీలు కూడా ఇందుకు అంగీకారాన్ని తెలిపాయి. అసలు గత ప్రభుత్వం మూడేళ్లపాటు ఫీజు రీయింబర్స్ ఇవ్వకపోవడం ఈనాడుకు కనిపించలేదు. అప్పటి బకాయిలనూ ప్రస్తుత ప్రభుత్వం దాదాపు రూ.1,800 కోట్లు విడుదలచేసింది. టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.35 వేలే ఇచ్చేది. కానీ, జగన్ సర్కార్ పూర్తి ఫీజుతో పాటు వసతి భోజనాలకు, వసతి దీవెన కింద ఏటా రూ.20వేలు అందిస్తోంది.

మీడియా రాజకీయాలు దురదృష్టకరం : ఆలూరు

ప్రభుత్వ విద్యాసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని మీడియా సంస్థలు రాజకీయాలు చేస్తున్నాయని, ఇది దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఏపీలోని పరిస్థితిని ప్రజలందరూ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. మంచిని కూడా చెడుగా చూపుతున్నారని.. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెడితే ప్రతిపక్షం, ఈ మీడియా స్పందించిన విధానాన్ని ఆయన గుర్తుచేశారు. ఇలా వ్యతిరేకించినందుకు ఆ పార్టీలకు, వారికి వంతపాడుతున్న మీడియాకు ప్రజలు ఇప్పటికే తగిన రీతిలో గుణపాఠం చెప్పారన్నారు.

ఏపీ సీడ్స్‌కు గ్లోబల్ అగ్రి అవార్డు

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపిక చేసింది. తాజాగా ఏపీ సీడ్స్‌ను గ్లోబల్ అగ్రి అవార్డు వరించింది. ఈ అవార్డును ఈ నెల 9న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. ప్రతిష్టాత్మక అవార్డును పొందిన ఏపీ సీడ్స్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. విత్తన పంపిణీలో ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.

మూడేళ్లలో 35 లక్షల క్వింటాళ్లు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు మూడేళ్లలో 50.95 లక్షల మంది రైతులకు 34.97 లక్షల క్వింటాళ్ల నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను ఆర్బీకేల ద్వారా ఏపీ సీడ్స్ పంపిణీ చేసింది. రైతుల నుంచి సేకరించిన వరి, అపరాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు, కూరగాయలు, పశుగ్రాసం, పచ్చిరొట్ట విత్తనాలను ఏపీ సీడ్స్ సొంతంగా ప్రాసెస్ చేసి సబ్సిడీపై అందిస్తోంది. వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా ప్రతి సీజన్‌లోనూ 20వేల శాంపిల్స్ పరీక్షించి, వాటి నాణ్యతను ధ్రువీకరించిన తర్వాతే సీజన్‌కు ముందుగా ఆర్బీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతోంది.

మూడేళ్ల సేవలకు గుర్తింపుగా..



మూడేళ్లుగా ఏపీ సీడ్స్ రైతులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగానే ఈ అవార్డు దక్కింది. ఇది నిజంగా అరుదైన గౌరవం. గతంలో విత్తనాల కోసం రోజులు, నెలల తరబడి రైతులు ఎదురుచూసేవారు. ప్రస్తుతం బుక్ చేసుకున్న వెంటనే పంపిణీ చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రైతులకు ఏపీ సీడ్స్ చేస్తున్న సేవలకు గత ఏడాది సిల్వర్ స్కోచ్, గవర్నెన్స్ నౌ అవార్డులు దక్కాయి. తాజాగా మరో ప్రతిష్టాత్మక అవార్డు రావడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ గెద్దం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ సీడ్స్

రైతన్నకు 'మద్దతు'



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

పొలంబడుల్లో విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్

అత్యుత్తమ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో చేపట్టిన పొలంబడి కార్యక్రమాలను మరింత సమర్థంగా నిర్వహించాలి. పొలంబడి నిర్వహణలో మనం ఆదర్శంగా నిలిచాం. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులను భాగస్వాములను చేసేలా అప్రెంటిస్‌షిప్ కోసం ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే శ్రీకారం చుట్టాలి. వీటి ద్వారా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలి. వారి నుంచి సలహాలు తీసుకోవాలి.

రెండేళ్లలో ప్రతి ఆర్బీకేలో డ్రోన్

ప్రతి ఆర్బీకేలోనూ డ్రోన్ సేవలు అందుబాటులోకి రావాలి. వచ్చే రెండేళ్లలో అన్ని ఆర్బీకేల్లో డ్రోన్లు ఉండేలా కార్యాచరణ రూపొందించాలి. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంతో నానో ఫెర్టిలైజర్స్ వాడకంపై అవగాహన పెరుగుతుంది. ఎరువుల వృథాను నివారించడంతోపాటు మొక్కలకు మరింత మెరుగ్గా పోషకాలు అందుతాయి. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల ద్వారా సమకూర్చిన వ్యవసాయ యంత్రసామగ్రి రైతులకు అందుబాటులో ఉంచాలి. వీటి సేవలు రైతులందరికీ అందుబాటులోకి తేవాలి.

మార్చికి ఆర్బీకేల్లో ప్లాంట్ డాక్టర్లు

వచ్చే మార్చి కల్లా ఆర్బీకేల స్థాయిలో ప్లాంట్ డాక్టర్ సేవలను అందుబాటులోకి తేవాలి. ఇందుకు సంబంధించిన ప్లాంట్ డాక్టర్ కిట్స్ ప్రతీ ఆర్బీకేలో అందుబాటులో ఉంచాలి. భూసార పరీక్షలు నిర్వహించే పరికరాలను ఆర్బీకేల్లో సిద్ధం చేయాలి. వచ్చే మార్చిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. భూసార పరీక్షలు నిర్వహించి ప్రతి రైతుకు సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయడం ద్వారా ఏ పంటలకు ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలో స్పష్టత వస్తుంది. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. నాణ్యమైన దిగుబడులు పెరుగుతాయి. భూసారాన్ని పరిరక్షించుకునే అవకాశం ఏర్పడుతుంది. సున్నా వడ్డీ పంట రుణాలతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీని ఈ నెల 29న జమ చేసేలా ఏర్పాట్లు చేయాలి.

దిగుబడి అంచనా 186 లక్షల టన్నులు

రాష్ట్రంలో జూన్ నుంచి నవంబర్ వరకు సాధారణ వర్షపాతం 775 మి.మీ. కాగా ఇప్పటి వరకు 781.7 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 186 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి రానుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. 'ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ – క్రాప్ వంద శాతం నమోదైంది. వీఏఏ, వీఆర్వో బయోమెట్రిక్ ఆథరైజేషన్ కూడా వంద శాతం పూర్తైంది. రైతుల ఈకేవైసీ 93 శాతం పూర్తైంది. సోషల్ ఆడిట్‌లో భాగంగా జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించాం. రైతుల సమక్షంలోనే గ్రామసభల ద్వారా సోషల్ ఆడిట్ నిర్వహించాం' అని అధికారులు వివరించారు. సమీక్షలో వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, సీఎస్ సమీర్‌శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, మార్కెటింగ్, సహకారశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖల కమిషనర్లు ప్రద్యుమ్న, హెచ్.అరుణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎండీ జి.వీరపాండ్యన్, ఏపీ సీడ్స్ ఎండీ జి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ స్టాండింగ్ కమిటీల నియామకం

పలు కమిటీల్లో తెలుగు ఎంపీలకు చోటు

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ స్టాండింగ్ (హౌజ్) కమిటీలను ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలకు చోటు దక్కింది. వైఎస్సార్‌సీపీ, టీఆర్ఎస్, బీజేపీ, టీడీపీలకు చెందిన పలువురు ఎంపీలు ఈ కమిటీల్లో ఉన్నారు.

బిజినెస్ అడ్వైజరీ కమిటీ: వి.విజయసాయిరెడ్డి (వైఎస్సార్‌సీపీ), కె.కేశవరావు (టీఆర్ఎస్)

రూల్స్ కమిటీ: డా.కె.లక్ష్మణ్ (బీజేపీ), పరిమళ్ నత్వానీ(వైఎస్సార్‌సీపీ), పార్థసారథిరెడ్డి (టీఆర్ఎస్), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ)

ప్రివిలేజ్ కమిటీ: జీవీఎల్ నరసింహారావు (బీజేపీ)

సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ : ఎస్.నిరంజన్ రెడ్డి (వైఎస్సార్‌సీపీ), జీవీఎల్ నరసింహారావు (బీజేపీ), కె.ఆర్.సురేష్ రెడ్డి (టీఆర్ఎస్)

హౌజ్ కమిటీ : సి.ఎం. రమేష్ (బీజేపీ), వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), బడుగుల లింగయ్య యాదవ్ (టీఆర్ఎస్)

ఎథిక్స్ కమిటీ : వి.విజయసాయి రెడ్డి (వైఎస్సార్‌సీపీ), కె.కేశవరావు (టీఆర్ఎస్)

ఎయిమ్స్‌లోనూ ఆరోగ్యశ్రీ సేవలు

▶ మొదటి పేజీ తరువాయి

రోజుకు అదనంగా మరో 3 లక్షల లీటర్ల నీరు అందించాలన్న ఎయిమ్స్ అభ్యర్థన మేరకు.. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి సరఫరా చేస్తున్నామన్నారు. ఎయిమ్స్‌కు మౌలిక వసతుల కల్పనలో సీఎం జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రూ.35 కోట్లతో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.10 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ తదితర పనులను తమ ప్రభుత్వమే చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు రూ.55 కోట్లను ఎయిమ్స్ అభివృద్ధికి ఖర్చు చేశామని మంత్రి చెప్పారు. మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారంలో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎయిమ్స్ డైరెక్టర్ త్రిపాఠి వెల్లడించారు.

వ్యవసాయ డ్రోన్ పైలెట్ శిక్షణకు గ్రీన్‌సిగ్నల్

- ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీకి డీజీసీఏ అనుమతి
- దేశంలోనే తొలి లైసెన్సు పొందిన వర్సిటీ మనదే
- డ్రోన్ పైలెట్ శిక్షణపై ప్రత్యేకంగా పాఠ్యప్రణాళిక
- 12రోజుల శిక్షణతో సర్టిఫికేషన్ కోర్సుకు శ్రీకారం
- 2032 వరకు ఆర్‌పీటీసీ శిక్షణకు వర్సిటీకి అనుమతి
- ఇప్పటికే వర్సిటీ పరిధిలో 75 మందికి డ్రోన్ శిక్షణ
- పరిశోధనల కోసం 16 డ్రోన్ల రూపకల్పన


వ్యవసాయ డిప్లమో విద్యార్థులకు డ్రోన్ పైలెట్ శిక్షణ ఇస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, అమరావతి: వ్యవసాయ, సంప్రదాయ డ్రోన్ పైలెట్ శిక్షణ ఇచ్చేందుకు ఏపీ ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి ఇచ్చింది. దేశంలోనే తొలిసారి వర్సిటీకి లైసెన్సు జారీచేస్తూ డీజీసీఏ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జితేందర్ లౌరా ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం గుంటూరు లాంలోని వ్యవసాయ డ్రోన్ పరిశోధన కేంద్రమైన సెంటర్ ఫర్ అప్సర ద్వారా సంప్రదాయ, వ్యవసాయ డ్రోన్లపై రిమోట్ పైలెట్ ట్రెనింగ్ కోర్సు (ఆర్పీటీసీ)లో 12 రోజుల శిక్షణ ఇచ్చేందుకు 2032 వరకు అనుమతి లభించింది. దేశంలో సంప్రదాయ డ్రోన్లపై శిక్షణ ఇచ్చేందుకు ప్రైవేటు రంగంలో 34 డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రాలకు డీజీసీఏ అనుమతి ఉంది. ఈ కేంద్రాల్లో ఐదు కిలోల బరువున్న సంప్రదాయ డ్రోన్లపై ఐదురోజుల పాటు కన్వెన్షనల్ రిమోట్ పైలెట్ కోర్సు (సీఆర్పీసీ) కింద శిక్షణ ఇస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం వినియోగించే డ్రోన్లు 25 కిలోలకుపైగా బరువుంటాయి. వీటిపై శిక్షణ పొందాలంటే ప్రత్యేక పాఠ్యప్రణాళిక ఉండాలి. కనీసం 12 రోజులు పడుతుంది. డీజీసీఏ మార్గదర్శకాలకనుగుణంగా గుంటూరు లాంలో సెంటర్ ఫర్ అప్సర పేరిట ఏపీ ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ 2020లో వ్యవసాయ డ్రోన్ల పరిశోధన సంస్థకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ డ్రోన్ పైలెట్ శిక్షణ కోసం దేశంలోనే తొలిసారి 12 రోజుల శిక్షణకు ప్రత్యేకంగా పాఠ్యప్రణాళికను సైతం రూపొందించింది. 10 ప్రధాన పంటలైన వరి, పత్తి, మిరప, చెరకు, మొక్కజొన్న జొన్న, మినుము, కంది, శనగ, వేరుశనగ సాగులో డ్రోన్ల వినియోగంపై ప్రామాణికాలను రూపొందించింది. ప్రయోగాత్మకంగా గడిచిన ఖరీఫ్‌లో 30 వేల ఎకరాల్లో వ్యవసాయ డ్రోన్ల వినియోగం ద్వారా సత్ఫలితాలను సాధించారు. అంతేకాదు.. సెంటర్ ఫర్ అప్సర ద్వారా 75 మంది వ్యవసాయ డిప్లమో విద్యార్థులకు అంతర్గతంగా శిక్షణ ఇచ్చి వ్యవసాయ డ్రోన్ పైలెట్లుగా తీర్చిదిద్దారు. వ్యవసాయ అనుబంధ అవసరాలకు తగినట్టుగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రత్యేకంగా 16 డ్రోన్లను రూపొందించి వివిధ పరిశోధనల్లో వినియోగిస్తున్నారు. వ్యవసాయ డ్రోన్ పైలెట్ శిక్షణ కోసం రూపొందించిన పాఠ్యప్రణాళికతో పాటు పైలెట్ శిక్షణకు అనుమతి కోరుతూ వర్సిటీ ప్రతిపాదనలు పంపింది. దీంతో ఈ నెల 3, 4 తేదీల్లో డీజీసీఏ డిప్యూటీ డైరెక్టర్ జితేందర్ లౌరా నేతృత్వంలోని బృందం లాంలోని సెంటర్ ఫర్ అప్సరను సందర్శించింది. అక్కడ మౌలిక సదుపాయాలతోపాటు పైలెట్ చీఫ్ ట్రైనర్ డాక్టర్ ఎ.సాంబయ్య నేతృత్వంలో శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందం నైపుణ్యతను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేసింది. సెంటర్ ఫర్ అప్సరకు లైసెన్సు జారీచేస్తూ సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మూడు వర్సిటీలకు మాత్రమే డ్రోన్ పైలెట్‌కు శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఉంది. అయితే వ్యవసాయ డ్రోన్ పైలెట్‌గా శిక్షణ ఇచ్చే తొలి అవకాశం ఎన్జీరంగా వర్సిటీకే దక్కింది. సంప్రదాయ డ్రోన్లపై ఐదురోజుల శిక్షణ పొందినవారికి కొనసాగింపుగా వ్యవసాయ డ్రోన్లపై మరో ఏడురోజులు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీచేసే అవకాశం కల్పించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆర్బీకేలోను డ్రోన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకోసం ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా డ్రోన్ పైలెట్‌గా శిక్షణ ఇచ్చేందుకు మార్గం సుగమమైంది.

ఇక డ్రోన్ విప్లవం

వ్యవసాయ, సంప్రదాయ డ్రోన్లపై శిక్షణ ఇచ్చేందుకు డీజీసీఏ అనుమతినివ్వడం.. రాష్ట్రంలో డ్రోన్ విప్లవానికి నాంది పలికింది. ఇదొక చరిత్రాత్మక పురోగతిగా భావించవచ్చు. దేశంలోనే తొలి వ్యవసాయ డ్రోన్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడమే కాదు.. తొలి శిక్షణ కేంద్రం కూడా మనదే కావడం గర్వంగా ఉంది. 2032 వరకు అనుమతి ఇవ్వడంతో డ్రోన్ రంగంలో వేలాదిమంది గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుంది.

– డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి, వీసీ, ఏపీ ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ

రాష్ట్రానికి దక్కిన గౌరవం

వ్యవసాయ డ్రోన్ పైలెట్‌గా శిక్షణ ఇచ్చేందుకు ఏపీ ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుమతి ఇవ్వడం రాష్ట్రానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఆర్బీకేలో డ్రోన్ ఏర్పాటు చేసేదిశగా అడుగులు వేస్తున్నాం. ఇందుకోసం ఎంపికచేసిన రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

హెచ్‌ఐవీ బాధితులకు సత్వర వైద్య సేవలందించాలి

ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్‌కుమార్



సాక్షి, అమరావతి: హెచ్ఐవీ బాధితులకు క్రమం తప్పకుండా సత్వర వైద్య సేవలు అందించాలని ఏపీ శాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీఎస్ నవీన్ కుమార్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ ఎమర్జెన్సీ ప్లాన్ ఫర్ ఎయిడ్స్ రిలీఫ్ (పెప్‌ఫర్), డెవలప్‌మెంట్ పార్ట్నర్స్ సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. హెచ్ఐవీ హాట్ స్పాట్లను గుర్తించి డేటా సేకరించాలన్నారు. ప్రస్తుతం డేటా ట్రయాంగిలేషన్ జరిగిన ఐదు జిల్లాల ఫలితాలను త్వరగా సమర్పించాలని, కేస్ టెస్టింగ్ వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు హెచ్ఐవీ బారిన పడే అవకాశం ఉన్నవారిని వైద్య పరీక్షలకు తీసుకురావాలని చెప్పారు. పాజిటివ్ నిర్ధారణ అయిన వారికి వెంటనే ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు ఇప్పించడంతో పాటు క్రమం తప్పకుండా వాడేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. జైళ్లలో ఉన్న వారికి ఎప్పటికప్పుడు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలన్నారు. పాత్, షేర్ ఇండియా, వీహెచ్ఎస్, డబ్ల్యూహెచ్వో, వైఆర్‌జీ, సాథీ, యునిసెఫ్ ప్రతినిధులతో పాటు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా అలీ బాధ్యతల స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న అలీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా ప్రముఖ సినీనటుడు మహమ్మద్ అలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలీకి విజయవాడలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి నియామకపత్రం అందజేశారు. అలీ మాట్లాడుతూ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానన్నారు. ప్రజలకు మేలు చేసే విషయంలో సీఎం అనుకున్నది సాధిస్తారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ విధానాలు ప్రతి ఇంట కనిపిస్తున్నాయని ఆనందం వ్యక్తంచేశారు.

హోదా వద్దన్నది చంద్రబాబే

- 12న విశాఖలో ప్రధాని సభకు అందరినీ ఆహ్వానిస్తున్నాం
- బీజేపీ నేత సోము వీర్రాజు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా వద్దన్నది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టంచేశారు. ప్రత్యేక హోదా వద్దని చెప్పి చంద్రబాబు కేంద్రం నుంచి రూ.7,500 కోట్లు ప్యాకేజీ తీసుకున్నారని తెలిపారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబునే అడగాలని సోమవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో చెప్పారు. త్వరలో కేంద్రం నుంచి రాష్ట్రానికి మరో రూ.10,500 కోట్లు వస్తాయన్నారు. ఈ నెల 12న విశాఖలో జరిగే ప్రధాని మోదీ సభకు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని పర్యటన కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసే నిర్వహిస్తున్నాయన్నారు. విశాఖ సహా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చలవేనని, అది చెప్పడానికే ప్రధాని వస్తున్నారని అన్నారు. ప్రధాని 11వ తేదీ విశాఖ వస్తున్నారని చెప్పారు. 12వ తేదీ ఉదయం బీజేపీ ముఖ్య నేతలతో సమావేశమయ్యే అవకాశం ఉందని, అనంతరం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో జరిగే సభలో పలు పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. ప్రధానికి విశాఖ విమానాశ్రయంలో పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలుకుతారని, రోడ్ షో కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థను అగ్రస్థానంలో నిలపాలి

రాష్ట్ర స్థాయి సదస్సులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థను జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రైవేట్ రంగంతో పోటీని తట్టుకునేలా రాష్ట్ర గిడ్డంగుల సంస్థను తీర్చిదిద్దాలని చెప్పారు. గిడ్డంగుల నిర్వహణ, విస్తరణపై విజయవాడలో సోమవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మంత్రి మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో ఏర్పాటైన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ 64 ఏళ్లుగా నిర్విరామంగా సేవలందిస్తూ స్వయం సమృద్ధి సాధించడం గొప్ప విషయమన్నారు. గిడ్డంగుల రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకువెళ్లాలని సూచించారు. మూడేళ్లుగా ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా సంస్థ లాభాల బాట పట్టిందన్నారు. ఈ సందర్భంగా కొత్తగా రూపొందించిన ఏపీ వేర్ హౌసింగ్ ఆన్‌లైన్ సర్వీస్ వెబ్ పోర్టల్‌ను మంత్రి కాకాణి ఆవిష్కరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండీ శ్రీకంఠనాథరెడ్డి, కేంద్ర గిడ్డంగుల సంస్థ ప్రాంతీయ అధికారి అజయ్ జాదూ, మార్కెటింగ్, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, సంస్థ చైర్మన్ కరిముల్లా అమీన్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ నేతలు వర్ల రామయ్య, బచ్చుల అర్జునుడు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిశారు. ఇటీవల నందిగామలో నిర్వహించిన రోడ్ షోలో తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుపై రాళ్ల దాడి జరిగిందని ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు.

19నుంచి ఉచిత బియ్యం పంపిణీ

చౌకదుకాణాలు, సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద మూడునెలల పాటు ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆహార భద్రత కార్డుదారులు రేషన్ దుకాణాల వద్ద ప్రతినెల 19వ తేదీ నుంచి 28వ తేదీలోగా బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసరమైన నిల్వలను కేటాయించిందని, దీన్లో కొంత నాన్ సార్టెక్స్, మరి కొంత నాన్ సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం ఉన్నాయని తెలిపారు. నవంబర్‌లో ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, మన్యం, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, ఎన్టీఆర్, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు నాన్ సార్టెక్స్, మిలిగిన 16 జిల్లాలకు నాన్ సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. 2.68 కోట్ల మంది ఎన్ఎఫ్ఎస్ఏ లబ్ధిదారుల జాబితాను చౌకదుకాణాలు, సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో వ్యక్తికి ఐదుకిలోల వంతున బియ్యం ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ పోషణ ధ్యేయంగా ఏడు జిల్లాల్లో ఫోర్టిఫైడ్



బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, వచ్చే ఏప్రిల్ నాటికి అన్ని జిల్లాలకు విస్తరిస్తామని తెలిపారు. ఇందులో ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బీ12 సమృద్ధిగా ఉంటాయని, వీటివల్ల రక్తహీనత తగ్గి, గర్భస్థ శిశువుకు మేలు జరగడంతోపాటు నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని వివరించారు. ఫోర్టిఫైడ్ బియ్యం తేలికగా ఉండి నీటిలో తేలడంతో కొంతమంది ప్లాస్టిక్ బియ్యంగా అపోహ పడుతున్నారని పేర్కొన్నారు.

రేషన్ అక్రమ రవాణాకు ఆస్కారం లేదు

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలిపారు. 9,260 ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారుల వేలిముద్రలతో ఇంటివద్దకే బియ్యాన్ని సరఫరా చేస్తుండటంతో బియ్యం బయట మార్కెట్‌కు తరలించే ఆస్కారం లేదని పేర్కొన్నారు. ఎల్లో మీడియా పనిగట్టుకుని విషప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. చౌకదుకాణాలు, ఎండీయూ వాహనాలను నిత్యం ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. విజిలెన్సు కమిటీలను నియమించి ప్రజా పంపిణీలో లోపాలు, అక్రమాలు లేకుండా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఫిర్యాదుల కోసం 1902 టోల్ ఫ్రీ నంబర్‌ను ఎండీయూ వాహనంపై ముద్రించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడేళ్లలో పక్కదారిపట్టిన 31,073 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్‌చేసి సెక్షన్ 6ఏ ప్రకారం 6,979 కేసులతోపాటు 1,603 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు. రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ పట్టుబడితే ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్‌చేసే అనుమతిని రద్దుచేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండల స్టాక్ పాయింట్‌లో ఇటీవల కొన్ని అవకతవకలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రాథమిక విచారణ అనంతరం స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిని సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు.

ముమ్మరంగా డీజీపీఎస్ సర్వే

- జీపీఆర్ఎస్ సిగ్నల్స్ అందని ప్రాంతాల్లో డీజీపీఎస్ సర్వే
- పార్వతీపురం మన్యం జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో వేగంగా సర్వే
- మిగిలిన జిల్లాల్లో త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: జీపీఆర్ఎస్ సిగ్నల్స్ అందని ప్రాంతాల్లో డీజీపీఎస్ పరికరాల ద్వారా భూముల రీ సర్వే ప్రక్రియ వేగం పుంజుకుంది. ఇప్పటికే పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలోని ఆరు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్) చేపట్టిన సర్వే విజయవంతమైంది. ఆరు గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు నంబర్ 13 నోటిఫికేషన్లు కూడా జారీ చేశారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాల్లో ఐదు ప్రైవేట్ ఏజెన్సీలు డీజీపీఎస్ సర్వే నిర్వహిస్తున్నాయి. త్వరలో నంద్యాల, కర్నూలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సర్వే చేపట్టనున్నారు.

కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో...

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జీఎన్ఎస్ఎస్ నెట్‌వర్క్ ద్వారా శాటిలైట్ల నుంచి వచ్చే జీపీఆర్ఎస్ సిగ్నల్స్ ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారు. కానీ కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో జీపీఆర్ఎస్ సిగ్నల్స్



రాకపోవడం వల్ల సీవోఆర్ఎస్ నెట్‌వర్క్ ద్వారా పనిచేసే రోవర్లు సరిగా పనిచేయడంలేదు. దీంతో ఇటువంటి ప్రాంతాల్లో డీజీపీఎస్ పరికరాల ద్వారా రేడియో మోడ్‌లో రీ సర్వే చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 2,800 గ్రామాల్లో జీపీఆర్ఎస్ సిగ్నల్స్ సరిగా రావడంలేదని గుర్తించారు. ఈ గ్రామాల్లో 28.50 లక్షల ఎకరాలను డీజీపీఎస్ ద్వారా సర్వే చేయనున్నారు. ఉత్తరాంధ్రలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్స్ సమస్య ఎక్కువగా ఉండడంతో అక్కడే ఎక్కువ దృష్టి పెట్టారు. మొత్తం 2,800 గ్రామాలను నాలుగు ప్యాకేజీలుగా విభజించి డీజీపీఎస్ సర్వేకు టెండర్లు పిలిచారు. తొలి ప్యాకేజీని గతంలోనే ఖరారు చేసి ఐదు ఏజెన్సీలకు పనులు అప్పగించడంతో సర్వే ముమ్మరంగా సాగుతోంది. మిగిలిన మూడు ప్యాకేజీల టెండర్ల ఖరారు ప్రక్రియ పూర్తయింది. త్వరలో అక్కడ కూడా సర్వే ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వానికి ఏం సంబంధం?

- రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదంటే... ఆంధ్రప్రదేశ్ గంజాయికి, డ్రగ్స్‌కు రాజధానిగా మారిపోయిందని బ్రాండ్ చెయ్యాలి. కొన్నాళ్లు ఇదే స్కీమ్‌ను అమలు చేశాయి టీడీపీ, ఎల్లో మీడియా!. కానీ దాదాపు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటూ దేశమంతా ఏపీకి క్యూ కట్టింది. ఎల్లో ఆరోపణల్లో పస లేదని తేలిపోయింది.
- ఇప్పుడు విశాఖ వంతు! సీఎం జగన్ సంకల్పిస్తున్నట్టుగా అక్కడకు రాజధాని రాకూడదు. అలా వస్తే తాము స్కెచ్ వేసిన రూ.లక్షల కోట్ల అమరావతి భూముల లూటీ సాధ్యం కాదు. అందుకే కొన్నాళ్లుగా విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే పనిలో పడ్డాయి. ప్రైవేటు ఒప్పందాలకు సైతం... ప్రభుత్వ ప్రమేయం ఉన్నట్లుగా మసి పూస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయి.
- 'రేడియంట్ భూముల్లో వెయ్యి కోట్ల కుంభకోణం' అంటూ టీడీపీ చేసిన ఆరోపణలను సోమవారం 'ఈనాడు' మొదటి పేజీల్లో అచ్చువేయటం కూడా ఇలాంటిదే. ఎందుకంటే ఆ భూములు రేడియంట్ కంపెనీకి కేటాయించింది టీడీపీ ప్రభుత్వం. రిజిస్ట్రేషన్ చార్జీల నుంచి మినహాయింపులిచ్చిందీ టీడీపీనే. ఆ భూముల కోసం వీఎంఆర్‌డీఏకు డబ్బులు చెల్లించింది కూడా వైసీపీ ప్రభుత్వం రాకముందే. ఆ తర్వాత సదరు కంపెనీ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో తనకున్న సాన్నిహిత్యం కారణంగా వీపీఆర్ ప్రాజెక్ట్స్‌తో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకుంది. ఆ ఒప్పందానికి ఇప్పుడు తెలుగుదేశం మసిపూస్తోంది. 'ఈనాడు' మారేడుకాయ చేస్తోంది. ఈ కూతలు, రాతలన్నీ విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను పణంగా పెట్టినవే!.
- ఆ ఒప్పందం ప్రకారం హై ఎండ్ అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో భూ యజమానికి 30%, డెవలపర్‌కు 70% వాటా ఉంటుంది. విల్లాలకు వచ్చేసరికి 40:60... మిగతా భూమిలో 50:50 వాటా ఉంటాయి. కానీ మనసులో దుర్మార్గం, దుర్బుద్ధి మాత్రమే నింపుకున్న టీడీపీ తైనాతీలు 70:30% వాటానే ప్రస్తావిస్తూ ఆరోపణలతో చెలరేగిపోయారు. ఇక్కడ ఆరోపణలు చేసిన వారికి గానీ, కుట్ర బుద్ధితో అచ్చేసిన రామోజీరావుకు గానీ ఒక్కటే ప్రశ్న. మీ ఇంటి మనిషి జయభేరి మురళీమోహన్ హైదరాబాద్‌లో నిర్మించిన హై ఎండ్ అపార్ట్‌మెంట్ నిర్మాణాల్లో భూ యజమానికిచ్చిన వాటా ఎంత? 30 కన్నా తక్కువేకదా? అప్పుడెందుకు ఈ విమర్శలు చేయలేదు? విశాఖలో నిర్మాణంలో ఉన్న ఎంకే-1, స్కైవ్యూ వంటి హై ఎండ్ ప్రాజెక్టుల్లోనూ ఇదే స్థాయి వాటా కదా? అసలు ఇటీవలి కాలంలో హై ఎండ్ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టు చేపట్టిన ఏ డెవలపరైనా భూ యజమానికి 40% వాటా ఇచ్చిన సందర్భాలున్నాయా? టీడీపీకో, రామోజీరావుకో ఇది తెలియక కాదు. ఒక కుట్ర ప్రకారం సీఎం కుటుంబంపై బురదజల్లే ప్రయత్నమిది. విశాఖలో ఏదో జరిగిపోతోందన్న భయాలు రేకెత్తించే ప్రయత్నమిది. ఇంతటి నీచ రాజకీయాలు చేయటానికి ఎవరికైనా సిగ్గుండాలి కదా? ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టపడి ఒక ఒప్పందానికి వస్తే దాంతో ప్రభుత్వానికేం సంబంధం? తనను బలవంతంగా తక్కువ వాటాకు ఒప్పించారని సదరు భూ యజమాని మీకేమైనా చెప్పాడా? ఆరోపణలు చేసిన టీడీపీ వాళ్లకెలాగూ నిజాలతో పనిలేకపోవచ్చు. కానీ పేరున్న పత్రికాధిపతిగా మీకైనా ఉండాలి కదా? ఈ రాతలపై మండిపడ్డ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చెప్పిన వాస్తవాలివిగో...

టీడీపీ, 'ఈనాడు', ఎల్లో మీడియాకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సవాల్


నెల్లూరు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం సంబంధం లేకుండా... రెండు ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఒప్పందాన్ని ప్రభుత్వానికి అంటగట్టి బురద జల్లేందుకు టీడీపీ, ఈనాడు, పచ్చ పత్రికలు ప్రయత్నిస్తున్నాయని వీపీఆర్ ప్రాజెక్ట్స్ అధినేత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనాడు, ఎల్లో మీడియాలో రేడియంట్ డెవలపర్స్ భూమికి సంబంధించి రాసిన టీడీపీ అసత్య ఆరోపణలపై నిజానిజాలను వివరించారు. 'రేడియంట్ సంస్థకు టీడీపీ హయాంలో జీవో నంబరు 77 పేరుతో 2019 ఫిబ్రవరి 14న 50 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ భూముల్ని కూడా కోర్టు తీర్పుతో అప్పట్లో సీఎం చంద్రబాబు హయాంలోనే అప్పగించారు. సుప్రీంకోర్టులో కూడా కేసు గెలుచుకుని, ట్రిబ్యునల్‌లో కూడా అనుకూలంగా తీర్పు తెచ్చుకుని... వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకముందే ఆ సంస్థ వీఎంఆర్‌డీఏకు నగదు చెల్లించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత మా కంపెనీ వీపీఆర్‌కు రేడియంట్‌కు మధ్య 2021 ఫిబ్రవరి 23న డెవలప్‌మెంట్ ఒప్పందం కుదిరింది. రేడియంట్ సంస్థతో మాకు 30 ఏళ్ల అనుబంధం ఉంది. రేడియెంట్ ఒక్కటే కాదు. చాలా సంస్థలతో మేం వ్యాపారం చేస్తున్నాం. మరి దీన్లో కుంభకోణం ఎక్కడుంది?' అని ప్రశ్నించారు.

అన్ని నగరాల్లోనూ అంతే కదా?

'మేం ఒక సంస్థతో వ్యాపార ఒప్పందం చేసుకుంటే తప్పేంటి? సాధారణంగా హై ఎండ్ అపార్ట్‌మెంట్ల కోసం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు వంటి ఏ నగరంలోనైనా 70–30 శాతం అగ్రిమెంట్లే జరుగుతున్నాయి. రామోజీరావు గానీ, చంద్రబాబు గానీ ఇలాంటి ప్రాజెక్టుల్లో భూ యజమానికి 50 శాతం వాటా ఇస్తారా చెప్పండి? నేను వందలు కాదు... వేల ఎకరాలు కొని మీకు డెవలప్‌మెంట్ కోసం ఇస్తా?' అని సవాల్ విసిరారు. ఉత్తరాంధ్రకు ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ రావడాన్ని అడ్డుకోవటానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఇదంతా భాగమేనని వేమిరెడ్డి ధ్వజమెత్తారు. 'చంద్రబాబు మీద ఈనాడుకు ప్రేమ ఉంటే మా బిజినెస్ వ్యవహారాలను కూడా వక్రీకరించి రాస్తారా? చివరికి దగదర్తి విమానాశ్రయం గురించి కూడా ఇలాగే రాశారు. దగదర్తిలో కంటే తెట్టు దగ్గర విమానాశ్రయం రావటం వల్ల నెల్లూరు జిల్లాకే కాకుండా ప్రకాశం జిల్లాకు కూడా కనెక్టివిటీ పెరుగుతుంది. దీనిపై నీచపు రాతలు రాయడం దుర్మార్గం కాదా?' అని ప్రశ్నించారు.

వైఎస్ భారతికి ఏమి సంబంధం?

కనీస సంస్కారం లేకుండా సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతి పేరును ఈ వ్యవహారంలోకి లాగడం సిగ్గు చేటు అని వేమిరెడ్డి విమర్శించారు. వైఎస్ అనిల్‌రెడ్డి తల్లి పేరు కూడా వైఎస్ భారతి అనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. 'రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ) నుంచి వివరాలు తీసుకున్నప్పుడు భారతి అని ఉంటే ఆమె ఎవరో కూడా తెలుసుకోవాలి. అందులో వయసు ఉంటుంది. ఇవేవీ చూడకుండా సీఎం భార్యను టార్గెట్ చేసి రాయడానికి సిగ్గు, బుద్ధి ఉండాలి. కుటుంబ సభ్యులను కూడా బయటకు లాగుతున్న దుర్మార్గాన్ని జర్నలిజం అంటారా?' అని వేమిరెడ్డి ప్రశ్నించారు.


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Municipal Administration and Urban Development Department- Joint Venture of Integrated Housing Project to an extent of Acs. 50.00 Cts in Sy. No. 336/P and LP No. 103/89 of Rushikonda Layout taken up by Visakhapatnam Metropolitan Region Development Authority (VMRDA), Visakhapatnam in the year 2003-04 and awarded to M/s Radiant Developers –One time settlement - Orders- Issued.

MUNICIPAL ADMINISTRATION AND URBAN DEVELOPMENT (M) DEPARTMENT

G.O.Ms.No.77 | Dated:14.02.2019
Read the following:-

రేడియంట్ సంస్థకు 50 ఎకరాలను కేటాయిస్తూ టీడీపీ హయాంలో 2019 ఫిబ్రవరి 14న జారీ చేసిన జీఓ నంబర్ 77 కాపీ


PRESENT
THE HON'BLE SRI JUSTICE D.V.S.S.SOMAYAJULU

చంద్రబాబు ప్రభుత్వం రేడియంట్ సంస్థకు భూములివ్వడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలు మినహాయించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిపై రేడియంట్ హైకోర్టును ఆశ్రయించగా చార్జీలు చెల్లించాల్సిన అవసరంలేదని కోర్టు ఇచ్చిన తీర్పు కాపీ

టిడ్కో గృహాలకు అన్ని వసతులు కల్పించండి

అధికారులకు మంత్రి సురేష్ ఆదేశం



సాక్షి, అమరావతి: టిడ్కో గృహాల్లో వసతుల లోపం లేకుండా చూడాలని మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన 40 వేల గృహాల్లో మౌలిక వసతులు పూర్తిచేయాలన్నారు. పట్టణ పేదల కోసం నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల ప్రగతిపై ఆయన సోమవారం అధికారులతో మాట్లాడారు. మంత్రి సురేష్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. డిసెంబర్ నెలాఖరుకు టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు బ్యాంకు రుణాలు అందజేయడంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని, లబ్ధిదారులపై ఆర్థికభారం లేకుండా చూడాలని చెప్పారు.



నువ్వు ప్రపంచంలో ఉన్నావా?
ప్రపంచం నీలో ఉందా? అది తేల్చుకో ముందు!
– చలం

సాక్షి
మంగళవారం, నవంబర్, 8

సమయం లేదు మిత్రమా!

'మానవాళి సమష్టిగా పోరాడాలి. లేదంటే అది సామూహిక ఆత్మహత్యా సదృశమే!' ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి చేసిన ఈ హెచ్చరిక అందరినీ ఆలోచింపజేస్తుండగా, ఐరాస సారథ్య 'పర్యావరణ సమస్యలపై భాగస్వామ్య పక్షాల 27వ సదస్సు' (యుఎన్–కాప్–27) ఆదివారం ఆరంభమైంది. ఈజిప్టులో సముద్రతీరంలోని రేవుపట్నమైన షర్మ్ ఎల్–షేక్‌లో 12 రోజుల ఈ సదస్సు మరోసారి పర్యావరణ సమస్యలపై దృష్టి సారించేలా చేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధంతో ఇంధన సంక్షోభం నేపథ్యంలో పాశ్చాత్య ప్రపంచం మళ్ళీ బొగ్గు వాడకం వైపు వెళుతున్న పరిస్థితుల్లో, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు సైతం బొగ్గువాడకం ఆపేస్తామనే పాత వాగ్దానం నుంచి పక్కకు తప్పుకొంటున్న వేళ ఈ సదస్సు జరుగుతోంది. వాతావరణ మార్పుల ప్రభావం అధికంగా ఉండే ఈజిప్టులో, లక్ష్యాల్లో భాగస్వాములు కావాల్సిన స్వతంత్ర పౌర సమాజం పట్ల వ్యతిరేకత చూపే ప్రభుత్వ హయాంలో సదస్సు సాగడం విచిత్రం.

యుఎన్–కాప్‌లోని 195 సభ్యదేశాలతో పాటు వ్యాపారవేత్తలు, శాస్త్రజ్ఞులు, పర్యావరణ ఉద్యమకారులు – ఇలా సుమారు 45 వేల మందికి పైగా ఈసారి సదస్సులో పాల్గొంటున్నారు. పెరుగుతున్న వాతావరణ సంక్షోభం నేపథ్యంలో దశాబ్దాలుగా ఏటా సాగుతున్న ఈ మెగా ఈవెంట్ మరోసారి ప్రాథమిక అంశాలపై చర్చకు తెర తీసింది. ధరిత్రి ఉష్ణోగ్రతలో పెంపు 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించరాదనేది ప్యారిస్ ఒప్పందం చేసుకున్నాం. మరి, ఆ దిశగా అడుగులు వేస్తున్నామా? వాస్తవానికి ఈ శతాబ్ది చివరకు 2 డిగ్రీల మించి తాపం పెరుగుతుందంటూ వాతావరణ మార్పులపై ఐరాస ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ (యూఎన్ఎఫ్‌సీసీసీ) చేసిన తాజా హెచ్చరిక మన మొద్దునిద్రకు దర్పణం. లక్ష్యాలు పెట్టుకోవడం కాదు... వాటిని సాధించడానికి నిజాయతీగా కృషి అవసరమని అది చెప్పకనే చెబుతోంది. అందుకే వాతావరణ నష్టనివారణకు ధనిక దేశాలు నిధులివ్వాలంటూ వర్ధమాన ప్రపంచం పట్టుబట్టే పరిస్థితి ఈసారి నెలకొంది.

వర్ధమాన దేశాలు ఎదుర్కొంటున్న వాతావరణ మార్పుల రీత్యా 2020 నుంచి 2025 వరకు ఏటా 100 బిలియన్ డాలర్ల సహాయం అందిస్తామని ధనిక దేశాలు ఎప్పుడో వాగ్దానం చేశాయి. 2009లో కోపెన్‌హాగెన్ (కాప్15)లో ఇచ్చిన ఆ మాటనే 2015లో ప్యారిస్ (కాప్21)లోనూ పునరుద్ఘాటించాయి. కానీ, అతీగతీ లేదు. ఆ 'వాతావరణ ద్రవ్యసహాయం' కిందకు ఏవేం వస్తాయో ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, పారదర్శకంగా ఆ రుణాలిచ్చే వ్యవస్థ ఏర్పాటు కాకపోవడం విడ్డూరం. భూగోళంపై వాతావరణ మార్పుల పర్యవసానం నుంచి ఏ దేశమూ తప్పించుకోలేదు. ఈ మార్పులకు ప్రధాన కారణమవుతున్న ధనిక దేశాలు తమ పొరుగునున్న బాధిత దేశాలపై సానుభూతి చూపితే సరిపోదు. దేశాల పరస్పర సహకారంతోనే వాతావరణ విపర్యయాల నుంచి బయటపడి మానవాళి మనుగడ సాగించగలదని గుర్తించాలి. 'వాతావరణంపై సంఘీభావ ఒప్పందం' అన్న ఐరాస పెద్ద తాజా అభిభాషణను ఆ కోణం నుంచి అర్థం చేసుకోవాలి.

ఈ ఏడాది వివిధ దేశాల్లో తలెత్తిన వాతావరణ సంక్షోభాలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. పాకిస్తాన్‌లో వచ్చిన భారీ వరదల్లో వేలమంది ప్రాణాలు కోల్పోయారు. దేశ ఆహార భద్రత సైతం చిక్కుల్లో పడే పరిస్థితి వచ్చింది. పెనుతుపాను ఇయాన్ దెబ్బకు క్యూబాలో ప్రాథమిక వసతులన్నీ ఛిన్నాభిన్నమై, రోజుల తరబడి విద్యుచ్ఛక్తి లేకుండా గడపాల్సి వచ్చింది. వాతావరణ మార్పుల వల్ల 55 బాధితదేశాలు ఇప్పటికే 525 బిలియన్ డాలర్ల మేర నష్టపోతున్నా యని లెక్క. 2030 కల్లా అది మరింత పెరగనుంది. ధనిక దేశాల వాతావరణ విధ్వంసం దెబ్బకు, తమకే సంబంధం లేని వర్ధమాన దేశాలు 2040కి 1 ట్రిలియన్ డాలర్ల దాకా నష్టపోతాయట. అభివృద్ధి చెందిన దేశాలే ఈ నష్టాన్ని భర్తీ చేయాలని వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు కోరుతున్నాయి. నష్టపరిహార నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజా 'కాప్27'లో దీనిపై చర్చ జరగడం అభిలషణీయమే!

గ్రీన్‌హౌస్ వాయువులను భారీగా విడుదల చేస్తున్న అమెరికా, ఐరోపా సమాజం (ఈయూ) మంకుపట్టు పడుతున్నాయి. నిరుడు స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన 'కాప్26'లో శాశ్వత నష్టం, సరిదిద్దుకోగల నష్టాల గురించి చర్చ జరపాలని వర్ధమాన దేశాలు కోరాయి. అమెరికా, ఈయూల తీవ్ర అభ్యంతరంతో అది జరగనే లేదు. ఇప్పుడు పాకిస్తాన్ మొదలు సోమాలియా, పసిఫిక్ మహాసముద్ర ద్వీపదేశాల దాకా అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. వాతావరణ మార్పులతో అతలాకుతలమవుతుండడంతో 'చిరు ద్వీపదేశాల కూటమి' సైతం ఆ బాధను బాపేలా ప్రపంచ 'ప్రతిస్పందన నిధి' కావాలని ప్రతిపాదిస్తోంది. భారత్ సైతం ఈ బాధల నివారణను భుజానికెత్తుకోవాలి. అభివృద్ధి చెందిన దేశాలను చర్చలకు రప్పించే నైతిక బాధ్యత వహించాలి.

ఉక్రెయిన్ యుద్ధం, పెరుగుతున్న ద్రవ్యోల్బణాల్ని సాకుగా చూపి, గ్లోబల్ నార్త్ దేశాలు వాతావరణ మార్పుల నివారణకు పెట్టుకున్న లక్ష్యాలను వెనక్కి నెట్టడం అభిలషణీయం కాదు. దాని పర్యవసానం ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులతో, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా తదితర దేశాల గ్లోబల్ సౌత్‌కే ఎక్కువ. నిజానికి, అమెరికాలో అనావృష్టి, ఆఫ్రికాలో కరవు, యూరప్‌లో వడగాడ్పులు ధనిక దేశాలకూ ప్రమాదఘంటికలే. ఇప్పుడు భూతాపోన్నతి నివారణ, నిధులపై మీనమేషాలు లెక్కిస్తే మొదటికే మోసం. సమయం లేదు మిత్రమా! త్వరపడాలి!

కొడిగడుతున్న డాలర్ దీపం

విశ్లేషణ



డి. పాపారావు

ప్రపంచంలోని వివిధ దేశాల కరెన్సీలతో పోలిస్తే డాలర్ విలువ భారీగా పెరుగుతోంది. ఒక దేశ ఆర్థిక స్థితిగతులు బాగుంటేనే ఆ దేశ కరెన్సీ విలువ బలంగా ఉంటుంది. కానీ ఏ విధమైన కొలబద్దల ప్రకారం చూసినా అమెరికా ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. అమెరికా ప్రపంచంలోనే అత్యంత రుణగ్రస్త దేశం. పైగా, ఉత్పత్తిరంగాలపై కాకుండా స్పెక్యులేటివ్ రంగాలైన షేర్‌మార్కెట్లు, రియల్ ఎస్టేట్‌పై ఆధారపడటం పెరిగింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ 2010 నాటికంటే 60 శాతం ఎదిగింది. కానీ ఆ దేశ కేంద్ర బ్యాంకు అయిన ఫెడరల్ రిజర్వ్ ఇదే కాలంలో ముద్రించిన కరెన్సీ మొత్తంలో 300 శాతం పెరుగుదల ఉంది. అంటే నిజంగా ఆర్థిక కార్యకలాపాల ద్వారా జరిగిన వృద్ధికంటే, కాగితం కరెన్సీ పెరుగుదల వల్ల వచ్చిన 'వాపు' ఎక్కువ!

ఈ రోజున అమెరికా ప్రపంచంలోనే అత్యంత పెద్ద రుణగ్రస్త దేశం. ఆ దేశం మొత్తం అప్పు 31.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇది ఆ దేశపు జీడీపీలో 126 శాతం. అమెరికా రుణభారంలో అతిపెద్ద వాటా జపాన్‌ది. తర్వాతి స్థానాలలో చైనా, బ్రిటన్ ఉన్నాయి. 1980 ముందు నుంచీ అమెరికా రుణభారం ప్రతి 8 సంవత్సరాలకు రెట్టింపు అవుతూ వస్తోంది. అమెరికా ఆర్థిక బలహీనతకు మరో ప్రధాన కారణం, విపరీతంగా డాలర్లను ముద్రిస్తూ ఉండటం. అమెరికా ఆర్థిక వ్యవస్థ 2010 నాటికంటే 60 శాతం ఎదిగింది. కానీ ఫెడరల్ రిజర్వ్ ఇదే కాలంలో ముద్రించిన కరెన్సీలో 300 శాతం పెరుగుదల ఉంది. అంటే ఆర్థిక కార్యకలాపాల ద్వారా జరిగిన వృద్ధికంటే, కాగితం కరెన్సీ పెరుగుదల వల్ల వచ్చిన 'వాపు' ఎక్కువ!

2000 సంవత్సరం నాటికి ప్రపంచ ఎగుమతులలో అమెరికా వాటా 12.1 శాతం. నాడు చైనాకి సంబంధించి ఇది 3.9 శాతం. 2020 నాటికి పరిస్థితి తల్లకిందులైపోయింది. అంతర్జాతీయ ఎగుమతులలో చైనా వాటా 14.7 శాతంగానూ, అమెరికా వాటా 8.1 శాతంగానూ ఉంది. ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయన్నమాట! 1980ల నుంచే మొదలైన అమెరికా ఆర్థికవ్యవస్థ పతనం నేడు పరాకాష్ఠకు చేరింది. ఇటువంటి బలహీనమైన దేశీయ ఆర్థిక పునాదులపై నిలబడే అమెరికా నేటి వరకూ అగ్రరాజ్యంగా చలామణి అయ్యింది. దీనంతటికీ కారణం ఆ దేశ కరెన్సీ అయిన డాలర్. 1944లో అంటే, రెండో ప్రపంచ యుద్ధం ముగుస్తున్న దశలోనే ప్రపంచదేశాలు తమ మధ్య లావాదేవీలకుగానూ రిజర్వ్ కరెన్సీ లేదా అంతర్జాతీయ కరెన్సీగా డాలర్‌ను ఆమోదించాయి. ఆ విధంగా బ్రిటన్ తాలూకు అగ్రదేశ స్థానాన్ని అమెరికా ఆక్రమించుకుంది. మూడు దశాబ్దాలకు పైబడి అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే బలమైనదిగా ఉండడం వలన కూడా డాలర్‌కు ఆ ప్రాభవం దక్కింది. 1971లో నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ డాలర్‌కు పునాదిగా బంగారాన్ని పాదివిన 1944లోని బ్రెట్టన్ వుడ్స్ ఒప్పందం నుంచి వైదొలిగాడు. అయితే, చమురు ఉత్పత్తి దేశాలతో ఉన్న సాన్నిహిత్యంతో డాలర్ కరెన్సీకే చమురు అమ్ముతామని ఆ దేశాలతో అంగీకరింపజేయడం ద్వారా ప్రపంచ దేశాలకు డాలర్ అవసరాన్ని అట్టిపెట్టగలిగాడు.

1980ల అనంతరం అమెరికా ఆర్థిక వ్యవస్థలో తీవ్ర బలహీనతలు ప్రవేశించాయి. వీటిలో ప్రధానమైనది ఆ దేశంలోని పరిశ్రమలు ఔట్‌సోర్సింగ్ రూపంలో విదేశాలకు తరలివెళ్ళిపోవటం. ఈ క్రమంలోనే ప్రపంచదేశాల పెట్టుబడులకు ద్వారాలు తెరిచిన చైనా ప్రపంచానికి సరుకు ఉత్పత్తి ఫ్యాక్టరీగా రూపొందింది. మెక్సికో, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి అనేక చౌకశ్రమశక్తి ఉన్న దేశాలకు కూడా అమెరికా ఫ్యాక్టరీలు తరలిపోయాయి. ఫలితంగా ఆ దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. సేవారంగం కూడా ఇంటర్నెట్ టెక్నాలజీ రంగ ప్రవేశం అనంతరం... ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టుల రూపంలో భారత్ వంటి ఆంగ్లం మాట్లాడగల నిపుణులు ఉన్న దేశాలకు తరలింది.



మూలిగే నక్కపై తాటికాయలా సాంకేతిక ఎదుగుదల క్రమంలో మరమనుషుల రంగ ప్రవేశం వంటివి జరిగాయి. 1980ల నాటికే నాటి ముతకరకం రోబోటు ముగ్గురు కార్మికుల ఉపాధిని కొల్లగొట్టేస్థాయిలో ఉంది. నేడు ఈ సాంకేతిక పరిజ్ఞానం ఎదుగుదల స్థాయిని చెప్పనవసరం లేదు. స్థూలంగా, ఉత్పత్తిరంగాలపై ఆధారపడి జీవించే అవకాశం ఇటు కార్మికులకూ, అటు ఉద్యోగులకూ కూడా లేకుండాపోయింది. ఈ క్రమంలోనే అమెరికా ఆర్థికవ్యవస్థ కేవలం తన కాగితం కరెన్సీ అయిన డాలర్‌పై లేదా స్పెక్యులేటివ్ రంగాలైన షేర్‌మార్కెట్లు, రియల్ ఎస్టేట్‌పై ఆధారపడటం పెరిగింది. దాంతోనే ముందుగా చెప్పినట్లు డాలర్ల ముద్రణ అపరిమితంగా పెరిగింది. ఈ పరిస్థితి రాత్రికిరాత్రే అమెరికాను అగ్రరాజ్యం పాత్ర నుంచి పడదోసేయలేకపోయింది. దీనికి కారణం అమెరికా ప్రజానీకం వినిమయం అత్యధికస్థాయిలో ఉండటమే. మరోరకంగా చెప్పాలంటే ప్రపంచంలోని అనేకానేక దేశాలు అమెరికాకు సరుకులూ, సేవలను ఎగుమతి చేయడం ద్వారా తమ దేశాలలో ఉపాధి కల్పనను, ఆర్థిక ఎదుగుదలను పొందాయి. దీని వలన అటు ప్రధాన దిగుమతిదారుగా ఉన్న అమెరికాకు ఎగుమతులు చేసి మనుగడ సాగించే చట్రంలో ఇతర దేశాలు సుదీర్ఘకాలం ఉండిపోయాయి.

కాగా, వాస్తవ ఉత్పత్తి లేని, డాలర్ల ముద్రణ మీద ఆధారపడిన అమెరికా ఆర్థికం ఇక ఎంతమాత్రమూ యథాతథంగా కొనసాగలేని పరిస్థితులు పుంజుకున్నాయి. మాయల ఫకీరు ప్రాణం చెట్టుతొర్రలో ఉన్నట్లుగా అమెరికా బలం దాని డాలర్‌లో ఉంది. దశాబ్దాలపాటు, తన డాలర్‌ను సవాల్ చేసిన దేశాలనూ, నేతలనూ అమెరికా నయానో భయానో కట్టడి చేసింది. ఈ క్రమంలోనివే... ఇరాక్‌పై యుద్ధం, లిబియాలో గడాఫీని తిరుగుబాటుతో అంతమొందించడం, ఇరాన్‌తో ఘర్షణ పడుతుండటం! రానురానూ అప్పులు పెరిగిపోతుండటం, యుద్ధాల కోసం మరింతగా ఖర్చుపెట్టలేని స్థితి ఏర్పడటం, అఫ్గానిస్తాన్, ఇరాక్‌లలో సైనిక పరాభవం వంటివన్నీ అమెరికా బలహీనతలను ప్రపంచం ముందు నగ్నంగా నిలబెట్టాయి. ముఖ్యంగా అఫ్గానిస్తాన్ నుంచి అమెరికా సైనిక దళాలు హడావిడిగా వైదొలిగిన తీరు, దాని మిత్ర దేశాలకు ఇక అమెరికా అండపై ఎంతమాత్రమూ ఆధారపడలేమనే పాఠాన్ని నేర్పాయి. ఇది ఉక్రెయిన్–రష్యా యుద్ధంతో మరింతగా బోధపడింది. ఈ యుద్ధ క్రమంలో రష్యాను అంతర్జాతీయ ఎగుమతి, దిగుమతులకు అవసరమైన సమాచార వ్యవస్థ అయిన 'స్విఫ్ట్' నుంచి బహిష్కరించటం ద్వారా ప్రపంచ దేశాలకు అమెరికా ఒక బలమైన సంకేతాన్ని ఇచ్చింది. కానీ అమెరికా డాలర్‌పై ఆధారపడితే ఏదో ఒక రోజు ఇటువంటి ఆర్థిక దిగ్బంధనమే మనకూ జరగొచ్చన్న పాఠాన్ని ప్రపంచదేశాలు నేర్చాయి.

గత కొన్ని మాసాలుగా అమెరికా ఫెడరల్ బ్యాంకు తన వడ్డీరేట్లను పెంచుతోంది. ఫలితంగా డాలర్ కరెన్సీలో మదుపులు చేయడం, అంతర్జాతీయ మదుపుదారులకు లాభసాటిగా మారసాగింది. దాంతో వారు వివిధ దేశాల షేర్‌మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులను ఉపసంహరించుకొని అమెరికా మార్కెట్లకు తరలిపోతున్నారు. ఫలితంగా ఆయా దేశాల కరెన్సీల విలువలు పడిపోవటం, షేర్‌మార్కెట్ సూచీలు దిగజారిపోవడం జరుగుతోంది. అంటే అమెరికా డాలర్ చేతిలో తమ జుట్టును పెడితే అది తమకు ప్రమాదకరమని అన్ని దేశాలు నిర్ధారణకు వస్తున్నాయి. ఫలితంగానే గతంలో అమెరికాకు భారీ ఎత్తున అప్పులు ఇచ్చిన దేశాలన్నీ నేడు ఆ డాలర్ అప్పులను వదిలించుకుంటున్నాయి. అమెరికాకు అతిపెద్ద రుణదాత (ఇది అమెరికాకు ఎగుమతులను చేయడంతో పేరుకుపోయిన మొత్తం) అయిన జపాన్ ఇప్పటికే తన ఈ రుణంలోని 12 శాతాన్ని అమ్మేసుకుంది. ఇదే బాటలో నిన్నటి అనుంగు మిత్రదేశాలు సౌదీ అరేబియా 35 శాతం, ఇజ్రాయెల్ 20 శాతం అప్పులను అమ్మేసుకున్నాయి. సుమారు 71 దేశాలు డాలర్ కరెన్సీని, దాని రూపంలో అమెరికా చేసిన అప్పును వదిలించేసుకుంటున్నాయి.

గతితర్కం (చలన సూత్రాలు) తాలూకు సూత్రీకరణ ప్రకారం 'ఒక పరిణామం లేదా వస్తువు దాని ఆరంభ స్థానం నుంచి ముందుకు వెళ్తున్నకొద్దీ దాని తాలూకు వేగం పెరుగుతుంది'. ఇది అన్ని విషయాల్లోనూ జరిగేదే. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధినే చూస్తే– గత వంద సంవత్సరాల ప్రగతి కంటే తర్వాతి 20, 30 సంవత్సరాలలో జరిగిన పురోగమనం ఎక్కువ. తరువాతి ఐదు సంవత్సరాలలో మరింత వేగంగా ఈ పురోగతి జరిగింది. ఇదే సూత్రం సామాజిక, ఆర్థిక విషయాలకు కూడా వర్తించే వాస్తవం. కాబట్టి డాలర్ దిగజారుడు వేగం మరింతగా పెరగటం ఖాయం. ఆర్థికపరంగా ఇదివరకే డొల్ల అయిన అమెరికా... డాలర్ ముద్రణపై కూడా ఆధారపడలేక కుదేలైపోగలదు. ఏకైక అగ్రరాజ్యంగా అమెరికా స్థానం ముగిసిపోగలదు!

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు । 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోవాలి



తప్పుడు కేసులో జ్యుడీషియల్ కస్టడీ కోసం కొన్ని వారాలు జైల్లో ఉన్న ఒక యువతి తాను రుతుస్రావం సమయంలో 'పీరియడ్ కేర్' అందుబాటులో లేక ఎలా ఇబ్బంది పడిందో చెప్పింది. రక్తస్రావాన్ని ఆపడానికి మహిళలు అదే బట్టను మళ్లీ మళ్లీ వాడి పంచుకున్నారు.

– రామానుజ్ ముఖర్జీ, న్యాయవాది

అసలు దోషి



చమురు కంపెనీలు ఈ ఏడాది ఇప్పటికే 127 బిలియన్ డాలర్ల లాభాలను అందుకున్నాయి. గత సంవత్సరం ఇదే కాలానికి ఆ లాభం 42 బిలియన్ డాలర్లు. జనులారా! ద్రవ్యోల్బణం అనేది మెరుగైన వేతనాలు, ప్రభుత్వాల నిధుల కేటాయింపును అడిగే కార్మికుల వల్ల పెరగడం లేదు. కార్పొరేట్ దురాశ వల్ల పెరుగుతోంది.

– రాబర్ట్ రీచ్, యూఎస్‌ఏ ప్రొఫెసర్

వెనక్కా, ముందుకా?



బీజింగ్‌లోని తల్లిదండ్రులు, పిల్లలు భయానకమైన వార్తను అందుకున్నారు. అదృష్టవశాత్తూ ప్రపంచంలోని చాలామందికి అది కేవలం జ్ఞాపకం. కానీ 'జీరో కోవిడ్' విధానం అవలంబిస్తున్న చైనాకు మాత్రం కాదు. మళ్లీ పాఠశాలలు ఆన్‌లైన్‌కు మారుతున్నాయి.

– అనంత్ కృష్ణన్, పాత్రికేయుడు

మూర్ఖపు ప్రక్రియ



పెద్దనోట్ల రద్దుకు ముందు చలామణీలో ఉన్న నగదు 18 లక్షల కోట్లు. ఆరేళ్ల తర్వాత, అది 30 లక్షల కోట్లు అయింది. అంటే ఈ మొత్తం ప్రక్రియ ఒక మూర్ఖపు వ్యవహారం అని చెబుతోంది.

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

అదే మాట్లాడుతున్నాను



నేను ఎక్కువగా పెట్టే వామపక్ష పోస్టులకూ, ఇస్లాం మీద నా విమర్శకూ సరి పోలడం లేదని కొంతమంది నా దృష్టికి తెచ్చారు. ఇస్లాం అనేది రైట్ వింగ్. ఇందులో వైరుధ్యం ఎక్కడుంది?

– నిక్ కానో, ఆస్ట్రేలియా యాక్టివిస్ట్

ఇన్‌బాక్స్

బహుముఖ చైతన్య శీలి

జాతీయోద్యమ కారుడిగా, పత్రికా సంపాదకుడిగా, సంఘ సంస్కరణోద్యమకారుడిగా, గ్రంథాలయ ఉద్యమకారుడిగా... విభిన్న రంగాల్లో కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి పప్పూరు రామాచార్యులు. నరసింహాచార్యులు, కొండమ్మ దంపతులకు 1896 నవంబరు 8న, అనంతపురంలో జన్మించారు. అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో బీఏ చదువుతున్నప్పుడే కొంతమంది మిత్రులతో కలసి 1917లో 'వదరుబోతు' పేర పదిహేను రోజుల కొకసారి కరపత్రాలు ప్రచురించి పంచేవారు. ఆనాటి సాంఘిక దురాచారాలు, సాహిత్య, సాంస్కృతిక స్థితి గతులపై అధిక్షేప ధోరణిలో వ్యాసాల రూపంలో ఆ కరపత్రాలుండేవి. డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే జిల్లా కలెక్టరు కచేరీలో ఉద్యోగం లభించినా కొన్ని రోజులకే ఆ ఉద్యోగాన్ని మానేశారు.



పప్పూరు రామాచార్యులు

కొంతకాలానికి 'పినాకిని' పత్రిక ప్రధాన బాధ్యత స్వీకరించి నడిపారు. ఆ తర్వాత 1926 ఆగస్టు 14 నుండి 'సాధన' పత్రికను స్వయంగా ప్రారంభించారు. ఈ పత్రిక జాతీయోద్యమ ప్రచారానికీ, సామాజిక సంస్కరణకీ, విద్యా, విజ్ఞాన వ్యాప్తికీ, రాయలసీమ స్థితిగతులను బయట ప్రపంచానికి తెలియజెప్పటానికీ, సాహిత్య సాంస్కృతిక వికాసానికీ విశేషంగా తోడ్పడింది. నంద్యాలలో 1928లో జరిగిన ఆంధ్ర మహాసభల్లో 'రాయలసీమ' అనే పేరును చిలుకూరు నారాయణ రావు ప్రతిపాదించారు. సాధన పత్రికలో 'రాయలసీమ' పేరును విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావడానికి ఆరోజు నుండే ఉపశీర్షికగా 'ది వాయిస్ ఆఫ్ రాయలసీమ' అని ప్రచురించేవారు.

పత్రికల్లో రచనలు చేయడమే కాక అనేక పుస్తకాలను 'శ్రీసాధన ముద్రాక్షరశాల' నుండి వెలువరించేవారు. 1932లో సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా బళ్ళారిలో జైలు జీవితం గడిపారు. 1937లో 'శ్రీబాగ్ ఒడంబడిక' సందర్భంలో రాయలసీమ ప్రయోజనాలకై కృషి చేశారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా తిరుచునాపల్లిలో జైలు జీవితం గడిపారు. గ్రంథాలయ, సహకార ఉద్యమాలలో; అనేక ఇతర నిర్మాణాత్మక కార్యకలాపాల్లో పాలు పంచుకున్నారు. 1955–1962లలో ధర్మవరం నియోజకవర్గానికి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. తన జీవిత మంతా ప్రజల కోసమే పనిచేసిన రామాచార్యులు 1972, మార్చి 21న తనువు చాలించారు. ఆయన నిత్య చైతన్య శీలిగా ఎప్పుడూ నిలిచి వుంటారు.

– డా అప్పిరెడ్డి హరినాథరెడ్డి
కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత
(పప్పూరు రామాచార్యులు 125వ జయంతి సందర్భంగా)

ఆలోచనాపరుల జాగరూకతే దేశానికి రక్ష

మానవ జీవనం అనుక్షణమూ రాజకీయాలతో ముడిపడి ఉంటుంది. రాత్రుళ్లు నిద్ర చెడగొట్టే అతి భీకర శబ్దాలతో వీధులలో తీసే ఊరేగింపుల దగ్గర నుంచి, ఢిల్లీ అధికారిక కేంద్రంలో రహస్యంగానో, నలుగురి మధ్యలోనో తీసుకునే లిఖిత, అలిఖిత నిర్ణయాలు మన జీవితాలపై ప్రభావం చూపుతుంటాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న రాజకీయం ఒక 'కెరీర్'గా, అత్యంత పకడ్బందీగా, పాఠ్యాంశంగా బోధించవలసిన అవసరం ఉన్నది. టీఎన్ శేషన్ స్థాపించిన పూణేలోని ఎంఐటీ 'స్కూల్ ఆఫ్ గవర్నమెంట్', హైదరాబాద్‌లోని 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' లాంటివి మనదగ్గరా; ఇంగ్లండ్‌లోని 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనా మిక్స్' లాంటివి రాజకీయాలు సహా, పబ్లిక్ పాలసీ లాంటి కోర్సులు నడుపుతున్నాయి. ఈ దిశగా మరిన్ని సంస్థలు రావాల్సిన అవసరం ఉంది. వృత్తివిద్యా కోర్సులు చదివే వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఉన్నట్టే, ఈ రాజకీయ/ ఆర్థిక పాఠశాల నుంచి వచ్చే వారిని కూడా సోషల్ రీసెర్చ్, రాజకీయాలు సహా అనేక ఇతర రంగాల వారు రిక్రూట్ చేసుకునే స్థితిని ఒకసారి ఊహించండి. ఊహలూ, కలలే నిజాలు అవుతాయి కదా?

ఇదంతా ఎందుకంటే, భారతదేశం ఒకవైపు బలమైన ఆర్థిక శక్తిగా రూపు దిద్దుకుంటూ వుంటే... మరోవైపు పేద ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతూ ఉన్నాయి. ప్రభుత్వాలు వారికి సంక్షేమ పథకాలు నిరంతరం అమలు చేయాల్సిన పరిస్థితులు పదిలంగా ఉంటున్నాయి. మళ్ళీ వీటిని 'ఉచితాలు' అంటూ కొందరు అగ్రనాయకులు హుంకరిస్తూ ఉంటారు. ఎక్కడో సమతుల్యత లోపిస్తున్నది కదా? దీనిని సరిదిద్దాలంటే సీరియస్ రాజకీయ, ఆర్థిక అవగాహన, విధానాల రూపకల్పన, కార్యాచరణ అవసరం. మతం, కులం పరిధుల్ని దాటి ఆలోచించాల్సిన ఆగత్యమూ ఉన్నది. వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రాముఖ్యం అర్థం అయితే అసలైన రాజకీయాలు అర్థం అవుతాయి. వ్యవస్థలు దాచిపెట్టే విషయాలను బ్లాక్ అండ్ వైట్‌లో చూడగలగడం అలవడుతుంది. ప్రభుత్వాలు తీసుకువచ్చే చట్టాలు, పథకాలు ఏం సాధించడానికి అని విశ్లేషిస్తే... ఆ నిర్ణయాల వెనక రాజకీయాలు అర్థం అవుతాయి. అయితే పార్టీలపై, నాయకులపై ప్రజలకు ఉండే అభిమానం, ప్రసార సాధనాలకు ఉండే అవసరాలు నిజాలను కప్పి పెడతాయి.

దేశంలో గత కొన్ని సంవత్సరాల పరిణామాలను మనం జాగ్రత్తగా గమనిస్తే స్వాతంత్ర్య పోరాట వీరులను, మహనీయులను ఒక వ్యూహం ప్రకారం పాఠ్యపుస్తకాల నుంచే కాక, దేశ ప్రజల మస్తిష్కాల నుంచి కూడా చెరిపివేసే ప్రక్రియ సాగుతూ ఉన్నది. గాంధీ, నెహ్రూల... త్యాగాలనూ, దార్శనికతనూ, నాయకత్వాలను ప్రశ్నించే వాతావరణం అలముకున్నది. అదే సమయంలో స్వాతంత్ర్య పోరాటం సహా దేశ దశ దిశను మార్చిన ఏ పోరాటంలోనూ పాత్రలేని వ్యక్తుల ప్రాభవం పెంచే పని జరుగుతున్నది. ఏక స్వామ్యం, ఏక భాష, ఏకరూపం అంటూ ఈ దేశ బహుళత్వాన్ని విలువ లేనిదిగా నిలబెడుతున్నారు. దీనికి కారణం ఏమంటే పాలక బీజేపీ పార్టీ కానీ, వారి సైద్ధాంతిక పాఠశాల ఆర్ఎస్ఎస్ కానీ దశాబ్దాల ఈ దేశ సాంస్కృతిక భిన్నత్వాన్ని ఆమోదించలేకపోవడమే. స్వాతంత్ర్యానంతరం దేశంలోని వివిధ ప్రభుత్వాలు తమ దార్శనికతతో దేశనిర్మాణం గావించాయి. ఐఐటీలు, సీసీఎంబీ, శాస్త్ర సాంకేతిక పరిశోధన సంస్థలు, న్యాయ యూనివర్సిటీలు ఒకవైపు; బహుళార్థ సాధక ప్రాజెక్టులు మరోవైపు, ఈ దేశ గ్రామికుల సంక్షేమం కోసం పథకాలు తెచ్చినాయి. తత్ఫలితంగా భారత్ ఎలాంటి ఆర్థిక సంక్షోభాన్ని అయినా తట్టుకుని నిలబడగలిగేంత పటిష్ఠంగా తయారయింది.



స్వాతంత్ర్యం వచ్చిన మరు సంవత్సరమే మత రాజ్యంగా ప్రకటించుకున్న పాకిస్తాన్‌లాగా కాకుండా లౌకిక రాజ్యంగా మనం నిలబడగలిగామంటే దానికి కారణం తొలితరం నాయకుల విశాల దృష్టి మాత్రమే. ప్రపంచంలోని ఏ అభివృద్ధి చెందిన దేశాన్ని చూసినా వారి అభివృద్ధికి కారణం వ్యవస్థల స్వతంత్రత, పటిష్ఠత అన్నది అర్థమవుతుంది. మన దేశంలో అన్ని వ్యవస్థలను రాజకీయం కబ్జా చేయడంవల్ల ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోతమేమోనన్న భయం కలుగుతోంది. కాంగ్రెస్ పార్టీ సీబీఐని దుర్వినియోగం చేసింది, తనకు నచ్చని ప్రభుత్వాల కూల్చివేతకు గవర్నర్ల వ్యవస్థను ఉపయోగించుకుందన్నది మన ఎరుకలోనిదే. అయితే, ప్రస్తుత బీజేపీ తన విపరీత రాజకీయ కక్ష సాధింపుతో కాంగ్రెస్‌ను తనకంటే మంచి పార్టీగా నిలుపుతున్నది. కేవలం సీబీఐ, గవర్నర్ వ్యవస్థను మాత్రమే కాక ఎన్నికల సంఘం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విజిలెన్స్ కార్పొరేషన్, మీడియా, చివరకు కోర్టులను కూడా ప్రభావితం చేస్తున్నది. ఇది ఆందోళన కలిగించే పరిణామం. పబ్లిక్ పాలసీ సంస్థలను కూడా వదిలిపెట్టడం లేదు కేంద్రం. 'సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ' సంస్థపై దాడులు ఇందుకు మంచి ఉదాహరణ.

పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోకుండా కీలకమైన నిర్ణయాలను ఆర్డినెన్స్ రూపంలో తీసుకోవడం, ఇచ్చ వచ్చిన రీతిలో విధానాల రూపకల్పన ఫాసిస్టు రాజ్యం చేసే పని. ఈ ధోరణికి కారణం ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకపోవడం మాత్రమే కాదు, వారి విశ్వాసాలు కూడా. సాధారణంగా అవినీతి అంటే అక్రమార్జన అనే అర్థంలోనే మనం చూస్తాం. కానీ అవినీతి అంటే నీతి లేకపోవడం, ఎలాంటి విలువలూ లేకపోవడం, హృదయ వైశాల్యం లేకపోవడం. అక్రమార్జన లెక్కలకు అందేది. అనైతికత కనపడనిది. దాని ఫలితాలు ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేసినపుడు మాత్రమే, అది కూడా, లోతైన దృష్టి ఉంటే తప్ప తెలియవు.

జాగరూకులైన ఆలోచనాపరులు మాత్రమే ఇపుడు ప్రజాస్వామ్యాన్నీ, అంతిమంగా దేశాన్నీ నిలబెట్టగలరు. భిన్నత్వాన్ని ఆస్వాదిస్తూనే ఏకంగా ఉండగలదు భారత్. ఆ పని మన చేతుల్లోనే ఉంది. ఇపుడు మేధావులు, బుద్ధిజీవులు, ప్రగతిశీల శక్తులు సహా రాజకీయ నాయకులు కూడా మేల్కొని ఒక కొత్త బంగారు లోకాన్ని సృష్టించాలి.

– శ్రీశైల్ రెడ్డి పంజుగుల, టీఆర్ఎస్ నాయకుడు
– డా॥ పి. సతీష్ చంద్ర, ఎమ్ఎస్, ఎఫ్ఆర్సీఎస్(యూకే)

సద్బుద్ధే కవచం

సజ్జనులనూ, సాధువులనూ సర్వదా సంరక్షించే బాధ్యత ఆ భగవంతుడిది. జగన్నాథుడు లోక పాలకుడిగా చేసే రెండు ముఖ్యమైన పనులు శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ. 'ఇందుకోసం నేను ప్రతి యుగంలోనూ అవతరిస్తూనే ఉంటాను' అని ఆయన శపథం.

అయితే లోకంలో ఇందరు అసంఖ్యాకులైన సజ్జనులూ, దుర్జనులూ కలిసి సహజీవనం చేస్తున్నప్పుడు యుగానికొకసారి అవతారం ఎత్తితే సరిపోతుందా అని సందేహం రావచ్చు. ఇలా భగవంతుడు స్వయంగా, ప్రత్యేకంగా భూమి మీద అవతరించేది పరమ దుర్మార్గుల పర పీడన పరాకాష్ఠకు చేరిన పరిస్థితులలో.



భగవంతుడు శిష్ట రక్షణా, దుష్ట శిక్షణా చేసేందుకు మరెన్నో మార్గాలు కూడా ఉన్నాయి. దేవతలు సజ్జనులను రక్షించటమంటే, గోపాలకులు కర్ర పుచ్చుకొని పక్కనే కూర్చొని గోవులను రక్షించినట్టు ఉండదు అంటుంది ఒక సుభాషితం. ఎవరిని రక్షించ గోరితే వాళ్ళకు సద్బుద్ధినీ, సద్భావాలనూ ప్రసా దిస్తారు. చాలు! ప్రేమ, భూత దయ, సత్యం, ఓర్పు, తృప్తి, లోక క్షేమ కాంక్ష మొదలైన వాటి వల్ల ప్రేరితమైన సాత్విక, సకారాత్మక భావనలు సద్భావనలు.

సద్బుద్ధి, సద్భావనలు కలవాడికి హింస, మోసం, పర పీడన, దొంగతనం, క్రూరత్వం లాంటి ఆలోచనలు రావు. కనక దుష్ట కర్మలు చేయడు, దుష్టఫలాలు అనుభవించడు. భద్రంగా క్షేమంగా ఉంటాడు. ప్రియమైన మాటలూ, ప్రియమైన చేతలూ, లోక క్షేమం కోరే సదాలోచనలూ ఉన్న వాళ్ళకు సాధారణంగా ఎవరూ ఎగ్గు తలపెట్టరు. తలపెట్టలేరు. తప్పిజారి తలపెట్టినా కృతకృత్యులు మాత్రం కాలేరు. సరికదా, అలాంటి ప్రయత్నాలు ఎదురు తిరిగి, ప్రయత్నం చేసిన వాళ్ళనే నాశనం చేస్తాయి. సద్బుద్ధి, సద్భావన, సత్సంకల్పం సాధుజనులకు శ్రీరామరక్ష. ఆ కవచాన్ని ఏ దౌర్జన్యమూ ఛేదించలేదు. 'ఆ నో భద్రా; క్రతవో యంతు విశ్వత': – అన్ని దిక్కుల నుండి మాకు సద్భావనలు వచ్చి చేరుగాక– అని ఋగ్వేద ప్రార్థన.

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** పౌర్ణమి ప.3.42 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** భరణి రా.1.41 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.10.49 నుండి 12.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.21 నుండి 9.07 వరకు తదుపరి రా.10.27 నుండి 11.18 వరకు, **అమృతఘడియలు:** రా.8.44 నుండి 10.22 వరకు, పాక్షిక చంద్రగ్రహణం : **రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు ; **యమగండం :** ఉ.9.00 నుండి 10.30 వరకు ; **సూర్యోదయం** 6.04 ; **సూర్యాస్తమయం** 5.24.


అన్నమయ్య జిల్లా అనంతపల్లిలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు


ప్రకాశం జిలా తాళ్లూరులో లబ్ధి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్


విజయనగరం జిల్లా దిబ్బగుడ్డివలసలో లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చినఅప్పలనాయుడు


శ్రీకాకుళం జిల్లా నందవ తోపూరులో మహిళకు పథకాల బుక్‌లెట్ అందజేసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మన ప్రభుత్వం

క్లుప్తంగా

సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశాం

- ఏపీ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధుల వెల్లడి

లబ్బీపేట (విజయవాడతూర్పు): ఇటీవల పాఠ్యపుస్తకాల ముద్రణ, సరఫరాకు సంబంధించి వచ్చిన కథనాలు సత్యదూరమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.సూర్యనారాయణ, కె.మధుసూదనరెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అధికారుల సహకారంతో, వారి పర్యవేక్షణలో ముద్రణ, సరఫరా చేశామని, పక్కరాష్ట్రాల కంటే ముందుగానే పాఠశాల విద్యార్థులకు అందించామని తెలిపారు. అదేవిధంగా 2022–23కి ప్రభుత్వమే పేపర్ పంపిణీ చేసి ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల పుస్తకాలు ముద్రణ చేయించి అతితక్కువ ధరకే విద్యార్థులకు కూడా సరఫరా చేసిందని చెప్పారు. ఈ విధానం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులపై రూ.20 కోట్ల వరకు భారం తగ్గిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బీమిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మైనేని సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జాస్తి నాగేశ్వరరావు, కోశాధికారి బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల ముఠా అరెస్టు

- నిందితుల్లో సూడాన్ దేశస్థుడితో పాటు ఆరుగురు


సీజ్ చేసిన డ్రగ్స్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి (ఇన్ సెట్) ఒమర్ (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మాదకద్రవ్యాలు సరఫరా, వినియోగిస్తున్న ముఠాను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. 34 గ్రాముల బరువున్న మిథైలెనెడియోక్సీ–మెంథాఫేటమైన్ (ఎండీఎంఏ) అనే డ్రగ్స్‌ను సీజ్ చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. నిందితుల్లో సూడాన్ దేశానికి చెందిన అహమ్మద్ ఒమర్ (28)తో పాటు చిత్తూరుకు చెందిన కె.సిరాజ్ (37), కె.సురేష్ (25), ఎస్.జయశంకర్ (32), సి.ప్రతాప్ (26), ఎస్.తేజకుమార్ (22) అనే యువకులున్నారు. చిత్తూరు ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. ఆదివారం నగరంలోని ఇరువారం–యాదమరి కూడలి వద్ద కొంతమంది వ్యక్తులు స్ఫటికల రూపంలో ఉన్న పదార్థాన్ని విక్రయించడం, కొనుగోలు చేస్తుండటాన్ని గుర్తించిన టూటౌన్ ఎస్ఐలు మల్లికార్జున, లోకేష్ తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ముగ్గురు వ్యక్తులు పారిపోగా, ఆ ప్రదేశంలో ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. సూడాన్ దేశంలోని ఖార్టోమ్ సిటీకు చెందిన అహమ్మద్ ఒమర్ అనే వ్యక్తితో చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం అరగొండకు చెందిన కె.సిరాజ్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ బెంగళూరులో ఒమర్‌తో స్నేహం చేసేవాడు. అతని వద్దనుంచి ఎండీఎంఏ అనే మాదకద్రవ్యాన్ని కొనుగోలుచేసి, దాన్ని చిత్తూరు నగరానికి చెందిన సురేష్, జయశంకర్, ప్రతాప్, తేజ, వెంకటేష్, మోహన్, మురళి అనే యువకులకు విక్రయించేవాడు.కాగా, పోలీసులు రూ.2 లక్షల విలువజేసే 34 గ్రాముల మాదకద్రవ్యం, 20 సిరంజీలు, మూడు సెల్‌ఫోన్లు, ఒమర్ పాస్‌పోర్టు, వీసాను సీజ్ చేశారు.

55 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు



తిరుపతి అలిపిరి: ఐదు వేర్వేరు ఘటనల్లో 55 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సోమవారం విలేకరులకు కేసు వివరాలను టాస్క్ ఫోర్సు ఎస్పీ మేడా సుందర్‌రావు వెల్లడించారు. ఆయన మాటల్లో.. రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సురేష్ కుమార్‌రెడ్డి, కృపానంద, చిరంజీవి బృందాలుగా విడిపోయి ఆదివారం కూంబింగ్ చేపట్టారు. అన్నమయ్య జిల్లా రాజంపేట రొళ్లమడుగు ఫారెస్ట్ బీట్ పరిధిలోని పెద్దకోన అటవీ ప్రాంతంలో తమిళనాడుకు చెందిన కుప్పుస్వామిని అరెస్టు చేసి, అతని నుంచి ఐదు ఎర్రదుంగలు స్వాధీనం చేసుకున్నారు. మామండూరు ఫారెస్ట్ కలివిలేటికోనం వద్ద 13 దుంగలు లభించాయి. సానిపాయ బేస్ క్యాంప్ రొళ్లమడుగు బీట్ పరిధిలో పెద్ద బురుజు నిషేధిత ప్రాంతంలో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన దొరైస్వామి విజయకుమార్‌ని అరెస్టు చేసి, ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. శేషాచలం రిజర్వు ఫారెస్టు చంద్రగిరి మండలం నాగపట్ల ఈస్ట్ ఫారెస్టు పరిధిలో బొగ్గల కోన వద్ద 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజ్ పాయసెలు అటవీ ప్రాంతంలో తమిళనాడుకు చెందిన తిరుమలైని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 22 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 55 ఎర్రచందనం దుంగలు 1359.250 కిలోలు ఉండగా, వాటి విలువ రూ.75లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

16 నుంచి అయ్యప్ప దర్శనం

శబరిమలకు రాష్ట్రం నుంచి 5 లక్షలకు పైగా భక్తులు వెళ్తారని అంచనా

- ఆలయ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికే అనుమతి
- యాత్ర మార్గంలోనూ స్పాట్ బుకింగ్ కేంద్రాలు
- ప్లాస్టిక్, యూజ్ అండ్ త్రో సంచుల వినియోగంపై ఆంక్షలు
- భక్తులు గుడ్డ సంచుల్ని మాత్రమే తెచ్చుకోవాలని కేరళ ప్రభుత్వ సూచన
- దక్షిణాది రాష్ట్రాల దేవదాయ శాఖ అధికారులతో కేరళ మంత్రి వీడియో కాన్ఫరెన్స్



సాక్షి, అమరావతి: నిర్దిష్ట వేళల్లో మాత్రమే కొనసాగే శబరిమల అయ్యప్పస్వామి దర్శనాలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది జనవరి 18వ తేదీ వరకు ఈ విడత దర్శనాలు కొనసాగుతాయి. కేరళలోని శబరిమల అయ్యప్ప దర్శనానికి రాష్ట్రం నుంచి ఈసారి 5 లక్షలకు పైగా భక్తులు తరలివెళ్తారని అంచనా. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టే చర్యల్లో భాగంగా ఏటా శబరిమల యాత్ర ప్రారంభానికి ముందు కేరళ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వివిధ దక్షిణాది రాష్ట్రాల దేవదాయ శాఖ మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాదికి సంబంధించిన ఏర్పాట్లపై కేరళ మంత్రి రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులతో పాటు వివిధ దక్షిణాది రాష్ట్రాల అధికారులతో మూడు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే దర్శనం

కరోనా నేపథ్యంలో మూడేళ్లగా శబరిమల ఆలయానికి సంబంధించిన 'వర్చువల్ క్యూ సిస్టమ్' ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారిని మాత్రమే ఆలయ అధికారులు దర్శనాలకు అనుమతిస్తున్నారు. ఈ ఏడాది కూడా ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికే అనుమతిస్తున్న విషయాన్ని ఏపీలోని భక్తులకు తెలిసేలా ప్రచారం చేయాలని కేరళ మంత్రి విజ్ఞప్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం శబరిమలకు వచ్చే మార్గంలోని నిలక్కల్, ఎడతావళం ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్పాట్ బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక బోర్డులు

శబరిమల యాత్రకు వెళ్లే భక్తులు పాటించాల్సిన నిబంధనల్ని తెలియజేసేలా రాష్ట్రంలోని పెద్ద ఆలయాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేసేలా రాష్ట్ర దేవదాయ శాఖ చర్యలు చేపట్టింది. రూ.25 లక్షలకు పైబడి ఆదాయం వచ్చే దాదాపు 270 ఆలయాల్లో ఈ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. కేరళ ప్రభుత్వం చేసిన సూచనలతో తెలుగులో బుక్‌లెట్ రూపొందించి, వాటిని ఆయా ఆలయాల వద్ద అయ్యప్ప భక్తులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఈ నిబంధనలు తప్పనిసరి

- దర్శనాలకు వచ్చే భక్తులు వైద్యుడు ఇచ్చే మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలి.
- భక్తులు ప్లాస్టిక్, వాడి పడేసే కొన్ని రకాలైన పేపర్లు వంటివి కలిగి ఉండకూడదని.. కప్పులు, గ్లాస్‌లు వంటివి ఒకసారి వాడిన తర్వాత కడుక్కొని తిరిగి వాడుకోవడానికి అవకాశం ఉండేవి మాత్రమే వెంట తీసుకెళ్లాలి. అన్నిరకాల ప్లాస్టిక్ వస్తువులు, యూజ్ అండ్ త్రో కవర్ల వినియోగంపై కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు.
- గుడ్డ సంచులను మాత్రమే భక్తులు వెంట తీసుకువెళ్లాలి.
- పంబ, అయ్యప్పస్వామి ఆలయ సన్నిధానం ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల వాడకంపై నిషేధం అమలులో ఉంటుంది.

నేడు శ్రీకాళహస్తిలో గ్రహణకాల అభిషేకాలు

శ్రీకాళహస్తి: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇందులో భాగంగా గ్రహణ కాల సమయంలో శాంతి అభిషేకాలు నిర్వహించనున్నారు. గ్రహణ కాలం సాయంత్రం 5.45 నుంచి 6.19గంటల వరకు ఉండడంతో ఆ సమయంలో సాయంత్రం 6 గంటలకు మూలమూర్తులకు శాంతి అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించనున్నారు. చంద్రగ్రహణం కారణంగా రాష్ట్రంలోని అన్ని ఆలయాలు మూతపడినా, శ్రీకాళహస్తీశ్వరాలయం మాత్రం తెరిచే ఉంటుంది. ఈ ఆలయం రాహు–కేతువులకు నిలయం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. యథాప్రకారం రాహు–కేతు పూజలు కూడా జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.


నేడు ఉదయం 7 గంటల వరకే దుర్గమ్మ దర్శనం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): చంద్రగ్రహణం కారణంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఆలయాలతో పాటు ఉపాలయాల్లో మంగళవారం ఉదయం ఏడు గంటల వరకే దర్శనానికి అనుమతిస్తారు. ఎనిమిది గంటలకు ఆలయ ద్వారాలను మూసివేస్తారు. గ్రహణ మోక్షకాలం అనంతరం సాయంత్రం 6.30గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి శుద్ధి, అమ్మవారికి స్నపనాభిషేకం, అర్చన, మహానివేదన, హారతులను ఇచ్చి ఆలయ ద్వారాలను తిరిగి మూసివేస్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. గ్రహణం నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, ఖడ్గమాలార్చన, గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమాలను మాత్రమే నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే లక్ష కుంకుమార్చన నుంచి సాయంత్రం పంచహారతులు వరకు అన్ని సేవలను రద్దు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి అన్ని ఆర్జిత సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఆలయ వైదిక కమిటీ తెలిపింది.

నేడు శ్రీవారి ఆలయంలో అన్ని సేవలు రద్దు

- ఉదయం 8.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆలయం మూసివేత
- రాత్రి 7.30 తర్వాత సర్వదర్శనానికి భక్తులకు అనుమతి


ఆలయం వెలుపల సోమవారం భక్తుల రద్దీ

తిరుమల: చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయం తలుపులు మూసివేస్తారు. చంద్రగ్రహణం కారణంగా శ్రీవాణి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను టీటీడీ రద్దు చేసింది. పౌర్ణమి గరుడ సేవ, అన్ని రకాల దర్శనాలు, ఆర్జితసేవలను కూడా రద్దు చేసింది. రాత్రి 7.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి చేసిన అనంతరం భక్తులను వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2 ద్వారా సర్వదర్శనానికి అనుమతిస్తారు. మరోవైపు తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 16 నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,211 మంది స్వామి వారిని దర్శించుకోగా, 30,906 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.4.20 కోట్లు సమర్పించుకున్నారు. శ్రీవారి దర్శనానికి 16 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటలు పడుతోంది.

శ్రీశైలంలో వైభవంగా జ్వాలాతోరణోత్సవం

- నేడు మల్లన్న ఆలయం మూసివేత



శ్రీశైలం టెంపుల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం శ్రీశైల క్షేత్రంలో జ్వాలాతోరణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి అర్చకులు, వేదపండితులు పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. జ్వాలాతోరణం వద్ద మూడుసార్లు స్వామి, అమ్మవార్ల పల్లకీని తిప్పారు. పాతాళగంగ వద్ద కృష్ణవేణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఏకాదశ హారతులను ఇచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద ఆశీనులు చేయించి ప్రాంగణమంతా లక్ష దీపాలను వెలిగించారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులిచ్చారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం మంత్రి రోజా దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న పాల్గొన్నారు. కాగా, చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు శ్రీశైల ఆలయ ద్వారాలు మూసివేయనున్నట్లు దేవస్థానం ఈవో తెలిపారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ప్రదోష కాల పూజలు నిర్వహించిన అనంతరం రాత్రి 8 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తామని చెప్పారు.

కార్తీకం పరమ పవిత్రం

- శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి
- విజయవాడ పాతబస్తీలోని పాత శివాలయం సందర్శన


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న స్వాత్మానందేంద్ర స్వామి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): కార్తీకమాసం పరమపవిత్రమైనదని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో నిర్వహిస్తున్న కార్తీక నక్షత్ర దీక్షా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి సోమవారం సందర్శించారు. స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని తొమ్మిదో శతాబ్దం నాటి శాసనాలు, ద్వారపాలకుల శిల్పాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ శివకేశవులకు కార్తీకమాసం పవిత్రమైనదని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సీతా డైరెక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి, ఈవో హేమలతాదేవి, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు పాల్గొన్నారు.

పున్నమివేళ.. గోదావరికి ఘన హారతి


తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్‌లో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి గోదావరి నదీమ తల్లికి ఘనంగా హారతినిస్తున్న దృశ్యం

కలెక్టర్‌పై రెచ్చిపోయిన జేసీ

కలెక్టర్‌పై కేకలు.. పేపర్లు విసిరేసిన ప్రభాకర్‌రెడ్డి

- భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 'స్పందన'లో ఏకవచనంతో దురుసుగా ప్రవర్తన
- అడ్డుకోబోయిన కలెక్టర్ గన్‌మెన్‌ను తోసేసిన వైనం
- ప్రభాకర్‌రెడ్డి తీరుపై అధికారుల విస్మయం.. పలువురు ఉద్యోగుల నిరసన
- ఆయనపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ జేఏసీ డిమాండ్



సాక్షి ప్రతినిధి, అనంతపురం/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): తరచూ తన వ్యవహారశైలితో వివాదాలకు కేంద్ర బిందువుగా ఉండే తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఈసారి ఏకంగా కలెక్టర్‌పైనే రెచ్చిపోయారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం 'స్పందన' కార్యక్రమానికి వచ్చిన ఆయన కలెక్టర్ నాగలక్ష్మిపై అరుపులు, కేకలతో ఊగిపోతూ తీవ్ర అలజడి సృష్టించి దౌర్జన్యపూరితంగా వ్యవహరించారు. కనీస మర్యాద కూడా లేకుండా కలెక్టర్‌ను ఏకవచనంతో సంబోధించారు. ఆమె ముందే పేపర్లు విసిరేశారు. అడ్డుకోబోయిన కలెక్టర్ గన్‌మెన్‌ను తోసేసి నానా రభస సృష్టించారు. అప్పటికీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సర్దిచెబుతున్నా వినకుండా అరుపులు, కేకలతో రెచ్చిపోయారు. మీరున్నది ఎందుకంటూ తీవ్రస్వరంతో గద్దించారు. దీంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరుతో అక్కడున్న రెవెన్యూ సిబ్బంది తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

అసలేం జరిగిందంటే..

తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామ సర్వే నంబరు 775లోని 6.93 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి జేసీ ప్రభాకర్‌రెడ్డి కలెక్టరేట్‌లో 'స్పందన'కు వచ్చారు. ఆ సర్వే నంబర్‌లోని పలు భూములు 22ఏ (చుక్కల భూములు) జాబితాలో ఉన్నాయి. వీటిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందులో భాగంగా అక్కడి భూ అనుభవదారులు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే సర్వే నంబరు 775లోని ఓ భూమికి సంబంధించిన ఫైలును 2021 నవంబరులో ప్రభుత్వ పరిశీలనకు పంపించారు. కిందిస్థాయి నుంచి అంటే తహసీల్దార్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా ఈ ఫైలును ప్రభుత్వానికి పంపించారు. సీసీఎల్ఏ అధికారులు ఈ ఫైలును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత 2022 ఫిబ్రవరిలో ఈ భూమిని చుక్కల భూముల జాబితా నుంచి తొలగించాలని జీఓ ఇచ్చారు. దీని ఆధారంగా ఈ 6.93 ఎకరాలతో పాటు ఇదే గ్రామంలోని మరో 40 ఎకరాల వరకూ చుక్కల భూముల నుంచి విముక్తి కల్పించారు. అనంతరం ఈ భూమిని సదరు యజమాని.. అంబటి రాఘవేంద్రరెడ్డి అనే వ్యక్తికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే, ఈ రిజిస్ట్రేషన్ ఎందుకు చేశారని, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి కలెక్టరుతో వాగ్వాదానికి దిగారు.

అప్పటికప్పుడు నిర్ణయం కాదు

ఈ ఫైలును రాత్రికి రాత్రే చేసినట్లు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. అలా చేయడానికి సాధ్యం కాదు. అన్ని డాక్యుమెంట్లు పరిశీలించి చేయడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుంది. పైగా ఈ ఫైలును సీసీఎల్ఏ పరిశీలనకు పంపించేశాం. ఇందులో ఎవరి సిఫార్సులూ, ఒత్తిళ్లూ లేవు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేశాం.

– నాగలక్ష్మి సెల్వరాజన్, కలెక్టర్

జిల్లాలో లక్ష ఎకరాలు చేశాం.. ఇదొక్కటే కాదు

జిల్లాలో లక్ష పైచిలుకు ఎకరాల భూమిని 22ఎ నుంచి విముక్తి కల్పించాం. సజ్జలదిన్నె గ్రామంలోని ఆ భూమి ఒక్కటే కాదు. ఈ భూమి కూడా ప్రభుత్వ పరిశీలనకు పంపించేశాం. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదు. ప్రతీఒక్క అడుగూ నిబంధనల ప్రకారమే వేశాం. ఇందులో ఎలాంటి వివాదాలకూ తావులేదు.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిపై దౌర్జన్యపూరితంగా వ్యవహరించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి.ప్రభాకర్‌రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి. సుగుణ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కలెక్టర్‌తో పాటుగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసులపై ఆయన దౌర్జన్యంగా వ్యవహరించడాన్ని తమ జేఏసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఐఏఎస్ స్థాయి అధికారులతోనే జేసీ ఇలా వ్యవహరిస్తే సాధారణ ప్రభుత్వోద్యోగుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం వెంటనే జేసీపై చర్యలు తీసుకోవాలన్నారు.

మండిపడిన ఉద్యోగులు

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహారశైలిపై అధికారులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. కలెక్టరుతో ఆయన ప్రవర్తించిన తీరు సరికాదని.. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధికారుల సంఘం, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. జిల్లా మెజిస్ట్రేట్ అయిన కలెక్టర్‌తో మాట్లాడేది ఇలాగేనా.. ఇదేనా మీ సభ్యత.. సంస్కారం అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు మర్యాద ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

క్లుప్తంగా

రేప్ కేసులో ఉరిశిక్షలు రద్దు

న్యూఢిల్లీ: ఢిల్లీలో 2012లో చోటుచేసుకున్న గ్యాంగ్ రేప్, హత్య కేసులో ఉరిశిక్ష పడిన ముగ్గురూ నిర్దోషులేనని సుప్రీంకోర్టు పేర్కొంది. వారి శిక్షలను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన యువతి గుర్గావ్‌లోని సైబర్ సిటీ ఏరియాలో ఉద్యోగం చేసుకుంటూ ఢిల్లీలోని ఛావ్లా ప్రాంతంలో ఉంటోంది. 2012 ఫిబ్రవరిలో ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్న ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు కారులో అపహరించుకు వెళ్లారు. ఆమెపై అత్యాచారం చేసి, తీవ్ర చిత్ర హింసలకు గురి చేసి చంపేశారు. ఛిద్రమై, కుళ్లిన స్థితిలో ఆమె మృతదేహం మూడు రోజుల తర్వాత హరియాణా రాష్ట్రం రేవారీలోని ఓ గ్రామం వద్ద పొలంలో కనుగొన్నారు. ఈ ఘటనకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ముగ్గురు యువకులు బాధ్యులని తేల్చారు. విచారణ చేపట్టిన దిగువ కోర్టు 2014లో ముగ్గురికీ మరణ శిక్ష విధించింది. ఢిల్లీ హైకోర్టు కూడా ఈ శిక్షలను సమర్థించింది. దీంతో, వారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజా తీర్పు వెలువడింది.

చీతాల మొదటి వేట సక్సెస్!

షియోపూర్: నమీబియా నుంచి మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కుకు తీసుకువచ్చిన చీతాలు వేట మొదలుపెట్టాయి. క్వారంటైన్ నుంచి పెద్ద ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేసిన ఫ్రెడ్డీ, ఆల్టన్ అనే రెండు మగ చీతాలు 24 గంటల్లోనే మచ్చల జింకను విజయవంతంగా వేటాడాయి. ఆదివారం రాత్రి లేదా సోమవారం వేకువ జామున వేటాడి ఉంటాయని అధికారులు చెప్పారు. అనంతరం రెండు గంటల్లోనే ఆహారాన్ని తినేశాయని చెప్పారు. వేటలోనూ ఇవి సత్తా చాటాయని చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ ఉత్తమ్ కుమార్ శర్మ సోమవారం చెప్పారు. సెప్టెంబర్ 17న నమీబియా నుంచి భారత్‌కు తీసుకు వచ్చిన 8 చీతాల మొట్టమొదటి వేట ఇదేనన్నారు. ఫ్రెడ్డీ, ఆల్టన్‌లను వదిలిన ఎన్‌క్లోజర్ విస్తీర్ణం 98 హెక్టార్ల వరకు ఉంటుందని చెప్పారు.

చెన్నై-మైసూర్ వందే భారత్ ట్రయల్ రన్ విజయవంతం

సాక్షి, చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నై నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరు మీదుగా మైసూరు వెళ్లే వందే భారత్ రైలు ట్రయల్ రన్ సోమవారం విజయవంతమైంది. రైలు ఈ నెల 11వ తేదీ నుంచి పట్టాలెక్కనుంది. చెన్నైలోని ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్ నుంచి ట్రయల్ రన్ నిర్వహించారు. ఉదయం 5.50 గంటలకు బయలుదేరి 8.50 గంటలకు జోలార్‌పేటకు చేరింది. అక్కడి నుంచి బెంగళూరు మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు మైసూరుకు చేరుకుంది. 1.05 గంటలకు మైసూరులో తిరుగు పయనమై, రాత్రి 7.35 గంటలకు చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు చేరుకుంది. దక్షిణ భారతదేశంలో ఇదే తొలి వందేభారత్ రైలు కావడం విశేషం.

మోర్బీ తీగల వంతెన దుర్ఘటనపై సుమోటోగా విచారణ

అహ్మదాబాద్: 135 మంది ప్రాణాలను బలిగొన్న మోర్బీ తీగల వంతెన దుర్ఘటనను గుజరాత్ హైకోర్టు సోమవారం సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంలో ప్రస్తుత స్థితిగతులపై ఈ నెల 14వ తేదీలోగా నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక అధికార యంత్రాంగానికి నోటీసులు జారీ చేసింది. గుజరాత్‌లోని మోర్బీ పట్టణంలో బ్రిటిష్ కాలం నాటి వేలాడే తీగల వంతెన అక్టోబర్ 30న కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా విచారణకు స్వీకరిస్తున్నట్లు గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ కమల్ త్రివేదికి తెలియజేసింది. స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర హోంశాఖ, కమిషనర్ ఆఫ్ మున్సిపాలిటీస్, మోర్బీ మున్సిపాలిటీ, జిల్లా కలెక్టర్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది.

సోరెన్‌కు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: మైనింగ్ లీజు వ్యవహారంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మైనింగ్ లీజు కేటాయింపుల్లో సోరెన్ అక్రమాలకు పాల్పడ్డారంటూ దాఖలైన పిల్‌ల విచారణార్హతను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సోరెన్ వేసిన అప్పీళ్లపై విచారణకు అంగీకరించింది. అలాగే, జూన్ 3వ తేదీన జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం పక్కన బెట్టింది. 'రాష్ట్ర ప్రభుత్వం వేసిన అప్పీళ్లను స్వీకరిస్తున్నాం. జార్ఖండ్ హైకోర్టు జూన్ 3వ తేదీన ఇచ్చిన తీర్పును పక్కనబెడుతున్నాం. ఆ పిల్‌లకు విచారణార్హత లేదు'అని జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ ఎస్ఆర్ భట్, జస్టిస్ సుధాన్షు ధూలియాల ధర్మాసనం పేర్కొంది. మైనింగ్ లీజు అక్రమాలపై సీబీఐ, ఈడీలతో దర్యాప్తు చేయించాలన్న పిల్‌లు విచారణార్హమైనవేనన్న హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ జార్ఖండ్ ప్రభుత్వం, సీఎం సోరెన్ వేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఆగస్టు 17న విచారణ ముగించింది. సుప్రీం తాజా నిర్ణయంపై సీఎం సోరెన్ హర్షం వ్యక్తం చేశారు. కాగా, సీఎం సోరెన్ అనర్హత అంశంపై జార్ఖండ్ గవర్నర్ రమేశ్ తమ అభిప్రాయాన్ని కోరలేదని ఎన్నికల కమిషన్(ఈసీ) సోమవారం స్పష్టం చేసింది.

మద్యం కేసులో మలుపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో ఆప్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న దినేశ్ అరోరా అప్రూవర్‌గా మారారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు అరోరా సన్నిహితుడు. మద్యం వ్యాపారి దినేశ్ అరోరా తమకు సాక్షిగా ఉంటారంటూ సోమవారం సీబీఐ ఢిల్లీ కోర్టులో పిటిషన్ వేసింది. విచారణ సమయంలో కీలక సమాచారం అందించారని పేర్కొంది. ఈ మేరకు న్యాయస్థానం అరోరాకు బెయిలిచ్చింది.

'పునరుత్పత్తి' అధ్యయనానికి.. అంతరిక్షంలోకి కోతులు

బీజింగ్: అంతరిక్ష ప్రయోగాల విషయంలో ఇప్పటిదాకా ఏ దేశమూ చేయని ప్రయత్నాన్ని డ్రాగన్ దేశం చైనా చేస్తోంది. గురుత్వాకర్షణ రహిత స్థితిలో జీవుల పునరుత్పత్తి జరుగుతుందా? అసలు అంతరిక్షంలో సంభోగం సాధ్యమేనా? అనేది తెలుసుకోవడానికి సన్నద్ధమవుతోంది. ఇందుకోసం కోతులను అంతరిక్షంలోకి పంపించాలని నిర్ణయించింది. 'చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది. చైనా సొంతంగా 'తియాంగాంగ్' పేరిట స్పేస్ స్టేషన్‌ను నిర్మించుకున్న సంగతి తెలిసిందే. ఈ స్టేషన్‌లోని వెంటియన్ మాడ్యుల్‌లోకి కోతులను పంపించనున్నారు. గురుత్వాకర్షణ శక్తి ఏమాత్రం లేనిచోట వాటి ప్రవర్తనను అధ్యయనం చేస్తారు. భార



రహిత స్థితిలో వాటి మధ్య సంభోగం, ఆడ కోతుల్లో పునరుత్పత్తి జరుగుతాయో లేదో తెలుసుకుంటారు. చంద్రుడు, అంగారకుడిపై నివాసాలు ఏర్పాటు చేసుకొనే దిశగా ఇప్పటికే పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతరిక్షంలో కోతుల పునరుత్పత్తిపై చైనా చేస్తున్న ప్రయోగాల ఫలితాలు కీలకంగా మారుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా తియాంగాంగ్ స్పేస్ స్టేషన్ ప్రస్తుతం భూమి నుంచి 388.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఇందులోని వెంటియన్ మాడ్యుల్‌లో ప్రస్తుతం ఆల్గే, చేపలు, నత్తలు వంటి చిన్న జీవులు జీవించడానికి అవకాశం ఉంది. కానీ, అవసరమైతే పెద్ద జీవులకు తగ్గట్టుగా పరిణామం పెంచుకొనేలా మాడ్యూల్‌ను డిజైన్ చేశారు. స్పేస్ స్టేషన్‌లోకి కోతులను పంపించగానే సరిపోదు, వాటికి ఆహారం అందజేయడం, ఆరోగ్యాన్ని కాపాడడం, వాటి వ్యర్థాలను నిర్వీర్యం చేయడం పెద్ద సవాలేనని చెప్పొచ్చు.

హంతక శకలం

ఎప్పుడో ఒకప్పుడు భూమిని ఢీకొనే ప్రమాదం

శాంటియాగో: గ్రహాల పాలిట ప్రాణాంతకమైనదిగా భావిస్తున్న గ్రహశకలం ఒకటి మన సౌర వ్యవస్థలో చక్కర్లు కొడుతోంది. దాదాపు మైలు వెడల్పున్న దీన్ని 2022 ఏపీ7గా పిలుస్తున్నారు. ఈ గ్రహశకలం ఏదో ఒక రోజు భూమిని ఢీకొట్టొచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దాని కక్ష్య ఏదో దాన్ని ఒకనాడు భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశాలు చాలా ఉన్నాయట. ఇది దీర్ఘవృత్తాకారంగా భ్రమిస్తున్నందువల్ల భూమికి ఏకంగా 30 లక్షల కిలోమీటర్ల సమీపానికి కూడా రాగలదట! అంతరిక్షంలో పెద్దగా లెక్కలోకే రాని దూరమిది. గత మార్చిలో 2022 ఏపీ7 భూమికి 1.3 కోట్ల మైళ్ల దూరంలో ఉంది. మరో ఐదేళ్లపాటు ఇంతకంటే సమీపానికి వచ్చే అవకాశమైతే లేదంటున్నారు. గత ఎనిమిదేళ్లలో మన కంటబడ్డ ప్రమాదకర శకలాల్లో ఇదే అతి పెద్దది. అంతేకాదు, చిలీలోని అబ్జర్వేటరీ నుంచి సౌరవ్యవస్థలో తాజాగా కనిపెట్టిన మూడు గ్రహశకలాల్లో ఇదే పెద్దది. మిగతా రెండు అర మైలు, పావు మైలు వెడల్పున్నాయి. వీటి గురించి ఆస్ట్రనామికల్ జర్నల్లో వ్యాసం ప్రచురితమైంది. భూమికి 1.3 ఆస్ట్రనామికల్ యూనిట్స్, అంటే 12.1 కోట్ల మైళ్ల కంటే సమీపానికి వస్తే వాటిని నియర్ ఎర్త్ ఆస్టిరాయిడ్స్ అంటాం.



అమెరికాలో నేడే మధ్యంతరం

ప్రతినిధుల సభలో 435, సెనేట్‌లో 35 స్థానాలకు ఎన్నికలు
- అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిష్టకు పరీక్ష
- డొనాల్డ్ ట్రంప్ రాజకీయ భవిష్యత్తు తేలిపోయే అవకాశం



న్యూయార్క్‌లో కేథీ హోచుల్ అభ్యర్థిత్వానికి బైడెన్ మద్దతుదారుల ప్రచారం

అగ్రరాజ్యం అమెరికాలో మధ్యంతర (మిడ్ టర్మ్) ఎన్నికలకు రంగం సిద్ధమయ్యింది. మంగళవారం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో వెలువడే ఫలితాలు ప్రస్తుత అధ్యక్షుడి మిగిలిన రెండేళ్ల పదవీ కాలంపై ప్రభావం చూపనున్నాయి. దేశ రాజకీయాలను సైతం తారుమారు చేసే అవకాశం లేకపోకపోలేదు. అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిష్టకు పరీక్షగా మారాయి. బైడెన్‌తోపాటు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రచారం హోరెత్తించారు. ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలతో విరుచుకుపడ్డారు.

మధ్యంతర ఎన్నికలంటే?

అమెరికా పార్లమెంట్(కాంగ్రెస్)కు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. కాంగ్రెస్‌లో రెండు సభలుంటాయి. అవి హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్. అధ్యక్షుడి పదవీ కాలం నాలుగేళ్లు. కాంగ్రెస్‌కు ప్రతి రెండేళ్లకోసారి.. అధ్యక్షుడి పదవీ కాలం మధ్యలో(సగం ముగిసినప్పుడు) ఎన్నికలు జరుగుతాయి. అందుకే వీటిని మధ్యంతర ఎన్నికలు అంటారు. అమెరికాలో 50 రాష్ట్రాలున్నాయి. ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు సెనేటర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. అంటే మొత్తం సెనేటర్లు 100 మంది. వారి పదవీ కాలం ఆరేళ్లు. మొత్తం 435 మంది ప్రతినిధులు ఉంటారు. ఇక జనాభాను బట్టి రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించే ప్రతినిధుల సంఖ్య మారుతుంది. వారి పదవీ కాలం రెండేళ్లు. ప్రతినిధుల సభలోని అన్ని స్థానాలతోపాటు సెనేట్‌లో మూడొంతుల్లో ఒక వంతు స్థానాలకు (35 సీట్లు) ఎన్నికలు నిర్వహిస్తారు. అంతేకాకుండా కొన్ని పెద్ద రాష్ట్రాల్లో గవర్నర్లను కూడా ఎన్నుకుంటారు.

గెలిచేదెవరో?

అధికార డెమొక్రటిక్ పార్టీకి కాంగ్రెస్ ఉభయ సభల్లో గత రెండేళ్లుగా మెజారిటీ ఉంది. అందుకే జో బైడెన్ మదిలోని ఆలోచనలు సులభంగా చట్టాలుగా మారుతున్నాయి. కానీ, ప్రతిపక్ష రిపబ్లికన్లతో పోలిస్తే డెమొక్రాట్ల ఆధిక్యం స్వల్పమే. కాబట్టి మధ్యంతర ఎన్నికల్లో ఇరుపక్షాల నడుమ ఉత్కంఠభరితమైన పోటీ ఖాయంగా కనిపిస్తోంది. ప్రతినిధుల సభలో రిపబ్లికన్లు, సెనేట్‌లో డెమొక్రాట్లు పాగా వేసే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రతినిధుల సభలో 435 స్థానాలు ఉండగా, కేవలం 30 స్థానాల్లో గట్టి పోటీ ఉండనుంది. ఇక సెనేట్‌లో 35 సీట్లలో హోరాహోరీ పోరు సాగనుంది. దేశవ్యాప్తంగా అమలయ్యే చట్టాలను కాంగ్రెస్ రూపొందిస్తుంది. ఏయే చట్టాలను తీసుకురావాలో హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్(ప్రతినిధుల సభ) నిర్ణయిస్తుంది. ఆ చట్టాలను సెనేట్ అడ్డుకోవచ్చు లేదా ఆమోదించవచ్చు. అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయాలకు సెనేట్ ఆమోద ముద్ర వేస్తుంది. అత్యంత అరుదుగా వాటిపై విచారణ కూడా జరపవచ్చు.

ప్రభావితం చేసే అంశాలేమిటి?

దేశంలోకి వెల్లువెత్తుతున్న వలసలు, పెరిగిపోతున్న నేరాలు, జీవన వ్యయం వంటివి మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేయబోతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలు ప్రతిపక్ష రిపబ్లికన్లకు ఉపకరించనున్నాయి. ఆగస్టులో నిర్వహించిన సర్వేలో అధ్యక్షుడు బైడెన్ పట్ల 50 శాతం కంటే తక్కువ ప్రజామోదం ఉన్నట్లు తేలింది. ఇది ఆయనకు ఇబ్బందికరంగా పరిణమించింది. మధ్యంతర ఎన్నికలు సాధారణంగా అధ్యక్షుడి పనితీరును ప్రతిబింబిస్తాయి. ఈ ఫలితాలను ఆయన పాలనపై ప్రజాతీర్పుగా భావించవచ్చు. ఈ ఎన్నికల్లో డెమొక్రాట్లు పట్టు సాధిస్తే.. వాతావరణ మార్పులు, ఆరోగ్య సంరక్షణ పథకాలు, గర్భస్రావ హక్కుల పరిరక్షణ, తుపాకీ సంస్కృతిని కట్టడి చేయడం వంటి అంశాల్లో బైడెన్ మరింత దూకుడుగా ముందుకెళ్లొచ్చు. ఏదో ఒక సభలో రిపబ్లికన్లు పైచేయి సాధిస్తే మాత్రం బైడెన్ అజెండాకు అడ్డుకట్ట తప్పదు.


అధ్యక్ష ఎన్నికను ప్రభావితం చేస్తుందా?

మధ్యంతర ఎన్నికల ఫలితాల ఆధారంగా.. 2024 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నుంచి అభ్యర్థిగా ఎవరు బరిలోకి దిగుతారో ఒక అంచనాకు రావొచ్చు. రిపబ్లికన్ పార్టీ నుంచి తానే పోటీ చేయబోతున్నానని మాజీ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ట్రంప్ మద్దతుదారులు ఎక్కువ సంఖ్యలో నెగ్గకపోతే ఆయనకు అవకాశాలు తగ్గిపోతాయి. మిషిగాన్, విస్కాన్సిన్, పెన్సిల్వేనియా వంటి పెద్ద రాష్ట్రాలను డెమొక్రాట్లు నిలబెట్టుకుంటే బైడెన్ మళ్లీ అధ్యక్షుడు అయ్యే చాన్సుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

వాగ్దానాలు కొంతవరకు నెరవేర్చా

వీడ్కోలు సభలో సీజేఐ యు.యు.లలిత్



న్యూఢిల్లీ: ఇచ్చిన వాగ్దానాలను కొంత వరకు నెరవేర్చగలిగానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ చెప్పారు. ఎల్లవేళలా పని చేసే ఒక రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం, కేసుల జాబితాను క్రమబద్ధం చేసే వ్యవస్థను నెలకొల్పడం, పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడం వంటి విషయాల్లో తన వంతు కృషి చేశానని తెలిపారు. జస్టిస్ యు.యు.లలిత్ పదవీ కాలం మంగళవారం ముగియనుంది. ఆరోజు సెలవు దినం కాబట్టి సోమవారమే సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ యు.యు.లలిత్ మాట్లాడారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే పెండింగ్ కేసులపై దృష్టి పెట్టానని, వేలాది కేసులు పరిష్కరించానని వివరించారు. ఈ వీడ్కోలు సభకు కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, పలువురు న్యాయవాదులు హాజరయ్యారు.

నా ప్రయాణం సంతృప్తికరం

సుప్రీంకోర్టులో 37 ఏళ్ల వృత్తి జీవితంలో న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ప్రతి దశను ఆనందించానని జస్టిస్ లలిత్ పేర్కొన్నారు. తన ప్రయాణం సంతృప్తికరంగా సాగిందన్నారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ తండ్రి, 16వ సీజేఐ జస్టిస్ యశ్వంత్ విష్ణు చంద్రచూడ్ ముందు న్యాయవాదిగా పనిచేశానని గుర్తుచేసుకున్నారు. ఇదే కోర్టులో మొదలైన తన ప్రయాణం, ఇక్కడే ముగుస్తోందంటూ భావోద్వేగానికి గురయ్యారు. పలు రాజ్యాంగ ధర్మాసనాలు ఏర్పాటు చేయడం తనకు మర్చిపోలేని జ్ఞాపకమని అన్నారు. కోర్టులో ఉన్న న్యాయమూర్తులందరినీ రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యులుగా చేశానని తెలిపారు. జస్టిస్ లలిత్ ఆగస్టు 27న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. కేవలం 74 రోజులు పదవిలో కొనసాగారు.

సహకరించుకోకపోతే వినాశనమే: గుటేరస్

షెర్మ్-ఎల్-షేక్: ప్రపంచ దేశాలన్నీ పరస్పరం సహకరించుకోకపోతే వినాశనం తప్పదని ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ హెచ్చరించారు. నరక కూపం దిశగా ప్రపంచ పయనం సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులను నియంత్రించకపోతే ఊహించని ఉత్పాతాలు తప్పవని పేర్కొన్నారు. కాలుష్య ఉద్గారాల విషయంలో అతిపెద్ద దేశాలైన చైనా, అమెరికా ఇకనైనా కళ్లు తెరవాలని, రాబోయే దుష్పరిణామాలను నివారించడానికి కలిసికట్టుగా పనిచేయాలని హితవు పలికారు. ఈజిప్ట్‌లోని షెర్మ్-ఎల్-షేక్‌లో సోమవారం కాప్-27 సదస్సులో వివిధ దేశాల నేతలు, ప్రతినిధులను ఉద్దేశించి గుటేరస్ ప్రసంగించారు. భూతాపం ఆందోళనకర స్థాయిలో పెరుగుతోందని చెప్పారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణంలో అనూహ్య మార్పులు కనిపిస్తున్నాయని, కరువులు, వరదలు మానవాళికి పెనుసవాళ్లు విసురుతున్నాయని గుర్తుచేశారు. కర్బన ఉద్గారాలను తగ్గించుకొనేలా ధనిక, పేద దేశాలు ఒక కొత్త ఒప్పందం కుదుర్చుకోవాలని చెప్పారు. ధనిక దేశాలు 2030 నాటికి, ఇతర దేశాలకు 2040 నాటికి బొగ్గు వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని గుటేరస్ కోరారు.

మనకున్న సమయం పరిమితం

వాతావరణ మార్పులకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయం వచ్చిందని ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్-సిసీ ఉద్ఘాటించారు. మనం జోక్యం చేసుకోకపోతే వాతావరణ మార్పులు ఎప్పటికీ ఆగవని అన్నారు. సమయం పరిమితంగానే ఉందని, ప్రతి సెకెన్ కాలాన్ని వాడుకోవాలని సూచించారు. యుద్ధాన్ని ఆపాలని రష్యా, ఉక్రెయిన్‌కు విజ్ఞప్తి చేశారు. వాతావరణ మార్పుల వల్ల నష్టపోతున్న పేద దేశాలకు ధనిక దేశాలకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని నైజీరియా పర్యావరణశాఖ మంత్రి మొహమ్మద్ అబ్దుల్లాహీ కోరారు. ఇందుకోసం క్లైమేట్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటా చెల్లుతుంది

సాక్షి, న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ల కోటా విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం లభించింది. ఈడబ్ల్యూఎస్ కల్పిస్తూ తీసుకొచ్చిన 103వ రాజ్యాంగ సవరణ చెల్లుబాటు అవుతుందంటూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు మెజారిటీ తీర్పు ఇచ్చింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు చెల్లుబాటు అవుతాయని న్యాయమూర్తులు జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ బేలా ఎం త్రివేదీ, జస్టిస్ జేబీ పార్దీవాలా, వాటిని కొట్టేస్తూ సీజేఐ జస్టిస్ లలిత్, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ తీర్పు ఇచ్చారు. ఈ కోటా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించదని మెజారిటీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థల్లో ఆర్థికంగా వెనకబడ్డ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2019లో మోదీ ప్రభుత్వం 103వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చింది. దీని చెల్లుబాటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 40 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని సుదీర్ఘంగా విచారించిన ధర్మాసనం సెప్టెంబరు 27న తీర్పు రిజర్వు చేసింది. సోమవారం సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై నాలుగు వేర్వేరు తీర్పులు వెలువరించింది. వాటిని 30 నిమిషాలకు పైగా చదివింది. జస్టిస్ దినేష్ మహేశ్వరి ఈ తీర్పును చదివారు. జస్టిస్ రవీంద్ర భట్ తీర్పుతో ఏకీభవిస్తున్నట్లు సీజేఐ లలిత్ పేర్కొన్నారు.

ఐదుగురు జడ్జీలు.. 4 తీర్పులు

ఈడబ్ల్యూఎస్ కోటాపై రాజ్యాంగ ధర్మాసనం నాలుగు వేర్వేరు తీర్పులు వెలువరించింది. 399 పేజీల ఈ తీర్పులో జస్టిస్ దినేష్ మహేశ్వరిదే అధిక భాగం. సీజేఐ విజ్ఞప్తి మేరకు ఆయన తొలుత తీర్పు చదివారు. ఈడబ్ల్యూఎస్ కోటాపై నాటి అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ లేవనెత్తిన రాజ్యాంగపరమైన ప్రశ్నలకు తీర్పులో సమాధానమిచ్చారు. ''ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్‌తో సహా ప్రత్యేక నిబంధనలకు అనుమతించడాన్ని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఈ కోటా నుంచి మినహాయించడాన్ని రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడంగా చెప్పలేం. 50 శాతం సీలింగ్ పరిమితిని కూడా ఈ కోటా ఉల్లఘించడం లేదు. ఎందుకంటే ఈ రిజర్వేషన్లకు పరిమితి ఉంది''అన్నారు. ఈ తీర్పుతో ఏకీభవిస్తున్నట్టు జస్టిస్ త్రివేదీ తెలిపారు. ఈడబ్ల్యూఎస్ తరగతుల ప్రయోజనం నిమిత్తం పార్లమెంటు ఆమోదించిన సవరణను నిశ్చయాత్మక చర్యగా పరిగణించాలే తప్ప అసమంజసమైన వర్గీకరణ అని చెప్పలేమన్నారు. జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ త్రివేదీల తీర్పుతో ఏకీభవిస్తున్నట్లు జస్టిస్ పార్దీవాలా పేర్కొన్నారు. 'విస్తృత ప్రయోజనాల నిమిత్తం ''రిజర్వేషన్లను పునః పరిశీలించాల్సి ఉంది. విద్య, ఉపాధిల్లో తగిన ప్రమాణాలు సాధించిన వర్గాలను వెనకబడిన జాబితా నుంచి తొలగించాలి. వెనకబాటుతనాన్ని గుర్తించే ప్రమాణాలు ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా ఉన్నదీ లేనిదీ కూడా సరిచూసుకోవాల్సిన అవసరముంది''అన్నారు.

మైనారిటీ తీర్పు

వెనకబడిన తరగతుల ప్రయోజనాలు పొందుతున్న వారు ఏదో ఒక విధంగా మెరుగైన స్థానంలో ఉన్నారని ఇప్పటికీ నిశ్చయంగా నమ్మలేకపోతున్నామని జస్టిస్ భట్ తన మైనారిటీ తీర్పులో పేర్కొన్నారు. ''ఆర్టికల్ 16(1), ఆర్టికల్ 16(4) ఒకే సమానత్వ సూత్రపు కోణాలని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ కోటా నుంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను మినహాయించడం వారి పట్ల వివక్ష చూపడమే. ఆర్థిక పేదరికం, ఆర్థిక వెనకబాటుతనం ప్రాతిపదికన రిజర్వేషన్లు అనుమతించినప్పటికీ ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలను మినహాయించడం రాజ్యాంగ విరుద్ధం. 2001 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీల్లో 38 శాతం, ఎస్టీల్లో 48 శాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు సిన్హో కమిషన్ నివేదిక పేర్కొంది. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితిని కూడా 103వ రాజ్యాంగ సవరణ ఉల్లంఘిస్తోంది. 50 శాతం నిబంధనకు ఇలా ఉల్లంఘనను అనుమతిస్తే అదో మార్గంగా మారుతుంది. కనుక ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్లు చెల్లవు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలను మినహాయిస్తూ చేసిన 103వ సవరణ రాజ్యాంగ విరుద్ధం''అని స్పష్టం చేశారు. జస్టిస్ భట్ తీర్పుతో సీజేఐ ఏకీభవించారు.

> ఆర్థిక ప్రమాణాలపై ఏకవచనంతో రూపొందించిన రిజర్వేషన్ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించదు. రాజ్యాంగ సవరణ రిజర్వేషన్ల 50 శాతం సీలింగ్ పరిమితి మించనందకు, ఎస్సీఎస్టీ, ఓబీసీలను ఈడబ్ల్యూఎస్‌ల నుంచి మినహాయించినంత మాత్రాన ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించినట్లు చెప్పలేం
> – జస్టిస్ దినేశ్ మహేశ్వరి

> జస్టిస్ త్రివేదీ తీర్పుతో ఏకీభవిస్తున్నా. కానీ రిజర్వేషన్లను నిరవధికంగా కొనసాగిస్తే అవి స్వార్థ ప్రయోజనాలుగా మారే ప్రమాదముంది. వాటిని కేవలం పదేళ్లపాటు అమలు చేయడం ద్వారా సామాజిక సామరస్యాన్ని తీసుకురావాలని అంబేడ్కర్ యోచించారు. కానీ ఏడు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. రిజర్వేషన్లు బలహీనవర్గాల సామాజిక, విద్యాపరమైన వెనకబాటు తొలగించే కసరత్తులా మాత్రమే ఉండాలి
> – జస్టిస్ జేబీ పార్దీవాలా

'డబుల్ ఇంజన్'కు అగ్నిపరీక్ష

సమస్యలేవీ తీరలేదంటున్న జనం
- అధికార బీజేపీకి ప్రమాద ఘంటికలు
- కాంగ్రెస్‌లో పెరుగుతున్న ఇంటిపోరు
- ఆప్ ఏ పార్టీ పుట్టిముంచుతుందో!
- ఆసక్తికరంగా హిమాచల్ ముఖచిత్రం

సాధారణంగా ప్రశాంతంగా సాగే హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఈసారి మాత్రం అక్షరాలా యుద్ధాన్నే తలపిస్తున్నాయి. ముఖ్యంగా అధికార బీజేపీ 'డబుల్ ఇంజన్' నినాదానికి అగ్నిపరీక్షగా మారాయి. అంతేగాక బీజేపీ, విపక్ష కాంగ్రెస్‌లోని ముఖ్య నేతల ప్రతిష్టకూ సవాలుగా పరిణమించాయి. మోదీ కరిష్మాతో అధికారం నిలబెట్టుకుంటామని కమలనాథులు ఆశిస్తుండగా ప్రభుత్వ వ్యతిరేకతే గట్టెక్కిస్తుందని కాంగ్రెస్ నమ్ముతోంది. 1985 నుంచి రాష్ట్ర ప్రజలు ఏ పార్టీకీ వరుసగా రెండోసారి అధికారం కట్టబెట్టని రివాజు ఈసారీ కొనసాగుతుందని ఆశిస్తోంది. మూడో పార్టీగా ఆప్ ఉనికి పోటీని మరింత సంక్లిష్టంగా మార్చేసింది. అన్ని పార్టీలూ హోరాహోరీ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి ప్రియాంక గాంధీ రెండుసార్లే ప్రచారం చేసినా రాష్ట్రమంతా కలియదిరిగారు. రాహుల్‌గాంధీ కూడా భారత్ జోడో యాత్రకు బ్రేకిచ్చి ప్రచారంలో పాల్గొననున్నారు. ఇక బీజేపీ నుంచి ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.

ఉద్యోగుల్లోనూ అసంతృప్తి


మోదీ వ్యక్తిగత ఆకర్షణకు తిరుగు లేకపోయినా కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వముంటే డబుల్ ఇంజన్ ప్రగతి సాధ్యమన్న బీజేపీ మాటలను హిమాచల్ జనాలు ఎంతవరకు నమ్ముతున్నారన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. దీన్ని రాష్ట్ర ప్రజలు పెద్దగా నమ్మడం లేదని హిమాచల్‌కు చెందిన శశికుమార్ అనే రాజకీయ విశ్లేషకుడు అభిప్రాయపడుతున్నారు. ధరల పెరుగుదల మొదలుకుని ఏ సమస్యకూ గత ఐదేళ్లలో పరిష్కారం దొరికింది లేదన్నది వారి ఆరోపణగా ఉంది. దీనికి తోడు పాత పెన్షన్ స్కీం కోసం రెండు లక్షలకు పైగా ప్రభుత్వోద్యోగులు చేస్తున్న డిమాండ్ కూడా బీజేపీకి కాస్త ప్రతికూలమేనంటున్నారు. దీన్ని తనకు అనువుగా మార్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. రెబెల్స్‌ను కట్టడి చేయడంలో కమలనాథులు విఫలమవుతున్న తీరు విశ్లేషకులనే ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏకంగా 24కు పైగా సీట్లలో వాళ్లు స్వతంత్రులుగా బరిలో దిగుతున్నారు. ఇది కూడా బీజేపీ విజయావకాశాలను బాగా దెబ్బ కొడుతుందన్నది కాంగ్రెస్ ఆశ. తమకు రెబెల్స్ బెడద మరీ అంతగా లేకపోవడం మరింత కలిసొచ్చే అంశమని పార్టీ నమ్ముతోంది. కాకలు తీరిన నాయకుడు వీరభద్ర సింగ్ గతేడాది మరణించినప్పటి నుంచీ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి కాస్త బలహీనంగానే మారింది. సీఎం పోస్టుకు కనీసం అర డజను మంది పోటీదారులు ఉండటంతో ఇంటి పోరు నానాటికీ పెరిగిపోతోంది. ఆప్ కూడా రంగంలో ఉన్నా ప్రధానంగా రాష్ట్రంలో ఉనికి చాటుకునేందుకే పరిమితమయ్యేలా కన్పిస్తోంది. అయితే గత ఎన్నికల్లో నోటాకు గణనీయంగా ఓట్లు పడ్డాయి. ఏకంగా 12 స్థానాల్లో నోటాదే మూడో స్థానం! ఈ ఓట్లన్నీ ఈసారి ఆప్ ఖాతాలోకి వెళ్లే అవకాశం కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆప్ పోటీ బీజేపీకి లబ్ధి చేకూరుస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిన అంశం.

కింగ్‌మేకర్ కాంగ్రా: కాంగ్రా జిల్లా మరోసారి కింగ్ మేకర్‌గా అవతరించే అవకాశం కన్పిస్తోంది. 1993 నుంచి ఈ జిల్లాలో అత్యధిక సీట్లు గెలుచుకునే పార్టీయే అధికారం చేజిక్కించుకుంటూ వస్తోంది. జిల్లాలోని 15 అసెంబ్లీ సీట్లలో 2012 ఎన్నికల్లో కాంగ్రెస్ 10 సీట్లు, 2017 ఎన్నికల్లో బీజేపీ 11 గెలిచి ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. ''రెండు పార్టీలకూ ఇక్కడ అటూ ఇటుగా 40 శాతం చొప్పున ఓటు బ్యాంకుంది. 3 నుంచి 5 శాతం ఓటర్లు మాత్రమే ఒక్కోసారి ఒక్కో పార్టీకి ఓటేస్తూ కీలకంగా మారుతున్నారు'' అని హిమాచల్ వర్సిటీలో పొలిటికల్ ప్రొఫెసర్ హరీశ్ ఠాకూర్ చెప్పుకొచ్చారు. కాంగ్రాలో కులం చాలా ప్రభావం చూపుతుందన్నారాయన. మిగతా రాష్ట్రంలో మాదిరిగా ఇక్కడా రాజ్‌పుత్‌లదే ప్రాబల్యం. జిల్లా జనాభాలో వారు 34 శాతముంటారు. 32 శాతమున్న ఓబీసీలు, 20 శాతమున్న బ్రాహ్మణులు కూడా ప్రభావం చూపుతారు. గద్దీ తదితర పర్వత ప్రాంతీయులది 14 శాతం వాటా. దాంతో బీజేపీ, కాంగ్రెస్ రెండూ రాజ్‌పుత్, గద్దీ నేతలకు ఎక్కువ టికెట్లిచ్చాయి. బీజేపీ ప్రభుత్వ పనితీరుపై మెజారిటీ ప్రజలు పెదవి విరుస్తుండటం కలవరపెడుతోంది. ధరల పెరుగుదలపై జనంలో ఆగ్రహం ఉంది. అందుకే అభ్యర్థిని కాకుండా తనను చూసి ఓటేయాలని ప్రధాని ప్రచార సభల్లోనూ విజ్ఞప్తి చేస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

స్వతంత్రులే కీలకం?

ఈసారి 20కి పైగా స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. గత ఎన్నికల్లో ఆరుగురు స్వతంత్రులు నెగ్గారు. ఈసారి ఈ సంఖ్య బాగా పెరిగేలా కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే చివరికి స్వతంత్రులే ప్రభుత్వ ఏర్పాటును శాసించే శక్తిగా అవతరించినా ఆశ్చర్యం లేదన్న అభిప్రాయం విన్పిస్తోంది.



ఎన్నికల అంశంగా అగ్నిపథ్

రాష్ట్రంలో సగం అసెంబ్లీ సీట్లున్న కాంగ్రా, హమీర్పూర్, ఉనా, మండీ జిల్లాల్లో అగ్నిపథ్ పథకం పెద్ద ఎన్నికల అంశంగా మారింది. ఎందుకంటే ఈ నాలుగు జిల్లాల్లో ఏకంగా 1.3 లక్షల మంది మాజీ, 40 వేల మంది సర్వీసులో ఉన్న సైనికులున్నారు! అంటే ప్రతి ముగ్గిళ్లకు ఒకరన్న మాట!! ఈ జిల్లాలకు ప్రధాన ఉపాధి వనరు సైన్యమే. ఈ నాలుగు జిల్లాల నుంచి ఏటా కనీసం 4 వేల మంది యువకులు సైన్యంలో చేరుతుంటారు. అగ్నిపథ్ రాకతో రెజిమెంట్‌వారీ భర్తీ విధానం రద్దవడంతో రాష్ట్రం నుంచి నియామకాలు మూడో వంతు తగ్గనున్నాయి. ఇది కచ్చితంగా బీజేపీకి వ్యతిరేకమవుతుందని కాంగ్రాకు చెందిన మేజర్ జనరల్ (రిటైర్డ్) రాణా అభిప్రాయపడ్డారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 8 । నవంబర్ । 2022



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన వి. చిట్టిబాబు కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు.



వాహ్.. స్కై వాచ్

భవానీపురం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విజయవాడ భవానీపురంలోగల రీజనల్ సైన్స్ సెంటర్‌లో సోమవారం రాత్రి స్కై వాచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ముగిసిన స్విమ్మింగ్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని సర్‌విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన 6వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది.





పున్నమి వేళ భక్తి వెన్నెల

సూర్యోదయ వేళ కార్తిక దీప కాంతులతో కృష్ణా తీరం వెలుగుపూలు విరబూసింది. నారికేళ, పంచామృతాభిషేకాలతో శివయ్య పొంగిపోయాడు. లక్ష బిల్వార్చనలతో మురిసిపోయాడు. ఆలయాలు భక్తజనాలతో నిండిపోయాయి. అంతటా ఓంకార మంత్రం ప్రతిధ్వనించింది. కార్తిక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచి పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి నదీమతల్లికి ప్రణమిల్లారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ



కోటి కాంతుల్లో ఇంద్రవైభోగం

అఖండ జ్యోతి.. కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవినేని అవినాష్ తదితరులు



కోటి కార్తిక జ్యోతులతో ఇంద్రకీలాద్రి దేదీప్యంగా వెలుగొందింది. పున్నమి చంద్రుడితో పోటీ పడినట్టు కృష్ణమ్మ బంగారు తరంగాలను మైమరపిస్తూ దీప కాంతులతో మెరిసిపోయింది. కార్తిక పౌర్ణమి సందర్భంగా దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన అఖండ దీపాన్ని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ వెలిగించి ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రంగవల్లులతో తీర్చిదిద్దిన ముగ్గులపై ఏర్పాటు చేసిన జ్యోతులను భక్తులు వెలిగించారు. ఆలయ ఈవో భ్రమరాంబ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)

న్యూస్‌రీల్

వేంకటేశ్వరునికి రూ.56.42 లక్షల ఆదాయం

జగ్గయ్యపేట: తిరుమలగిరిలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వారికి వివిధ రకాల బహిరంగ వేలం పాటల ద్వారా రూ. 56.42 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఏసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో పలు రకాల వేలం పాటలు సోమవారం నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు రూ. 32.90 లక్షలకు వేదాద్రి గ్రామానికి చెందిన వల్లపునేని శ్రీనివాసరావు కైవసం చేసుకున్నారు. అదే విధంగా కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కునకు గానూ రూ. 4.70 లక్షలు, పాలు, బియ్యం పోగు చేసుకునే హక్కునకు రూ. 11.10 లక్షలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు రూ. ఏడు లక్షలు, పొంగలి షెడ్డు నిర్వహణకు రూ. 72 వేలు ఆదాయం వచ్చిందన్నారు. ఈ పాటలు ఏడాది కాల పరిమితితో ఉంటుందన్నారు. మరో నాలుగు పాటలు పాటదారులు రాక పోవటంతో వాయిదా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ అనురాధ, చైర్మన్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

19న కృష్ణా యూత్ ఫెస్టివల్

మచిలీపట్నం: స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 19న కృష్ణా జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి యు. శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1 నాటికి 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువత ఈ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు. వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత ఈ నెల 17 నాటికి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 88866 11786లో సంప్రదించాలన్నారు.

కొనుగోళ్ల పండుగ

- ఈ నెల 10 నుంచి కృష్ణాలో, 15 నుంచి ఎన్టీఆర్ జిల్లాలో ప్రారంభం
- పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 492 ఆర్బీకేల్లో ఏర్పాట్లు పూర్తి
- ఒకటి రెండు రోజుల్లో కోతలు ప్రారంభమయ్యే అవకాశం

రెండు జిల్లాల్లో ధాన్యం సేకరణకు సన్నద్ధం



కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు


సాక్షి ప్రతినిధి, విజయవాడ: వరి పంట కోత దశకు చేరుకుంది. ఒకటి రెండు రోజుల్లో కోతలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు పౌర సరఫరాల సంస్థ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయశాఖ కమిషనర్ నుంచి రైతులకు సంబంధించిన ఈ-క్రాప్ డేటా సోమవారం రాత్రికి చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అవసరమైన సామగ్రిని సమకూర్చారు. సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశారు. ఏ గ్రేడ్ ధాన్యం ధర క్వింటా రూ.2060, సాధారణ రకం ధాన్యం ధర క్వింటా రూ.2040గా నిర్ణయించారు. మరోవైపు ఈ సారి వరి పంట చీడపీడలను అధిగమించడం, తుపానుల గండం నుంచి గట్టెక్కడంతో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతన్నలు భావిస్తున్నారు.

కృష్ణా జిల్లాలో..

కృష్ణా జిల్లాలో 3.95 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. వ్యవసాయాధికారులు ఈ ఏడాది 10.86 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఎకరానికి అత్యధికంగా 40–46 బస్తాల దిగుబడి వస్తుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. జిల్లాలోని పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, బంటుమిల్లి, బాపులపాడు మండలాల్లో పంట ఇప్పటికే కోత దశకు చేరింది. చంద్రగ్రహణం పూర్తయిన తర్వాత కోతలు ప్రారంభించే అవకాశం ఉంది. దీంతో నవంబరు 10వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మొత్తం 323 ఆర్బీకేల పరిధిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈఏడాది 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో 1.13లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. 3లక్షల టన్నులకు పైగా దిగుబడిగా వస్తుందని అంచనా వేశారు. ఈ ఏడాది అత్యధికంగా ఎకరాకు 45 బస్తాల వరకు దిగుబడులు రావచ్చని భావిస్తున్నారు. విజయవాడ రూరల్, తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెంలో మరో వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా నవంబరు 15వ తేదీ తర్వాత ధాన్యం సేకరణ చేయనున్నారు. ఈ ఏడాది జిల్లాలో 1.24 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు గానూ 169 ఆర్బీకేల పరిధిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఏర్పాట్లు పూర్తి..



జిల్లాలో పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 15 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. వరి ధాన్యం పండించిన రైతులు తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు అమ్ముకొనేలా చర్యలు తీసుకొంటున్నాం. దళారులకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ఈ- క్రాప్ ఆధారంగా ధాన్యం కొనుగోలు చేస్తాం. ఆర్బీకేలకు అవసరమైన సామగ్రిని సమకూర్చాం.

– ఎస్. శ్రీవాస్ నుపూర్ అజయ్, జాయింట్ కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

కోటి ఆశలతో..



వాతావరణం ఈ ఏడాది చాలా అనుకూలంగా ఉంది. సకాలంలో కాలువలకు నీరు విడుదలైంది. శివారు పొలాలకు కూడా నీరు అందింది. ఆర్బీకేల ద్వారా విత్తనాలను సమకూర్చారు. రైతులు, కౌలు రైతులకు చేయూత అందించటంలో ప్రభుత్వం ఎంతో సమర్థంగా పనిచేసింది. ప్రస్తుతం పంట పొలాలు కోతకు సిద్ధం అవుతున్నాయి. వారంలోపు కోతలు చేపట్టేందుకు అనువైన పరిస్థితి ఉంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఆర్బీకేల్లో పంట విక్రయించి మద్దతు ధర పొందేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం. కొనుగోలు కేంద్రాలు స్థానికంగా అందుబాటులో ఉండటం శుభపరిణామం.

– దిమ్మిటి ప్రసాద్, కౌలురైతు, కోలవెన్ను, కంకిపాడు మండలం

డిసెంబర్‌లో 'కృష్ణా తరంగ్'

మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ స్థాయిలో 'కృష్ణా తరంగ్' పేరిట యూత్ ఫెస్టివల్‌ను డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించేందుకు అంతా సిద్ధం కావాలని వర్సిటీ వైస్ చాన్సలర్ కేబీ చంద్రశేఖర్ అన్నారు. యూత్ ఫెస్టివల్ నిర్వహణపై వర్సిటీలో వివిధ విభాగాల అధికారులతో సోమవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ కాలేజియేట్ యూత్ ఫెస్టివల్‌ను ఈ సారి వేడుకగా నిర్వహించేందుకు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదే విధంగా డిసెంబర్ 19 నుంచి 23 వరకు పద్మావతి మహిళా యూనివర్సిటీలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌కు కృష్ణా యూనివర్సిటీ ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేలా సంబంధిత విభాగాల అధికారులంతా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యూత్ ఫెస్టివల్ నిర్వహణపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వీసీ చంద్రశేఖర్ ప్రకటించారు. చైర్మన్‌గా వీసీ చంద్రశేఖర్, వైస్ చైర్మన్‌గా రెక్టార్ డి. సూర్యచంద్రరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రామిరెడ్డి, కన్వీనర్‌గా ఎం. కోటేశ్వరరావు వ్యవహరించనున్నట్లు వీసీ చంద్రశేఖర్ వెల్లడించారు.

హెల్త్ వర్సిటీ టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక



లబ్బీపేట(విజయవాడ తూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం టేబుల్ టెన్నిస్ ఉమెన్ జట్టును ఎంపిక చేశారు. యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు సోమవారం ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఎంపికలు నిర్వహించారు. వారిలో అత్యంత ప్రతిభ చూపిన వారిని అంతర్ విశ్వ విద్యాలయాల పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వారిని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు అభినందిస్తూ, అంతర్ విశ్వ విద్యాలయాల పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జె. రాము పాల్గొన్నారు.

బందరు అభివృద్ధి ఇక పరుగులు

- డిసెంబరులో పోర్టుకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన
- రూ. 750 కోట్లతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్
- మరో రూ. 100కోట్లతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి
- రూ. 325 కోట్లతో గుడివాడ ఫ్లై ఓవర్ నిర్మాణానికి త్వరలో భూమిపూజ
- విలేకరులతో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి



మాట్లాడుతున్న బందరు ఎంపీ బాలశౌరి, వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి ఇకపై పరుగులు పెడుతుందని, బందరు వాసులు త్వరలో శుభవార్త వింటారని పార్లమెంట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు.

చంద్రబాబు మోసపూరిత విధానం..

గతంలో చంద్రబాబునాయుడు మోసపూరితమైన పథకం ద్వారా బందరు పోర్టుకు శంకుస్థాపన చేశారని ఎంపీ అన్నారు. పోర్టు, ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు తప్పనిసరిగా పర్యావరణ అనుమతులు, ఫైనాన్షియల్ క్లోజర్ కావాల్సి వస్తుందని.. అటువంటివి ఏమీ లేకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేసేందుకు మొక్కుబడిగా శంకుస్థాపన చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అలా కాకుండా ప్రస్తుతం రూ. 5,500 కోట్లతో పోర్టు నిర్మాణం చేపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా కాకుండా రూ. 3,950 కోట్లు వివిధ బ్యాంకులు ఈ నెలలో ఫైనాన్షియల్ క్లోజర్స్ ఇస్తున్నాయన్నారు. డిసెంబరు నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పోర్టు నిర్మాణానికి భూమిపూజ చేసి, వెనువెంటనే పనులు కూడా ప్రారంభిస్తామన్నారు.

నాలుగు నియోజకవర్గాల్లో ఇంటింటికీ కుళాయి..

బందరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో రూ.750 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నామని ఎంపీ చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని అవనిగడ్డ, పెడన, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల్లో ఈ పథకం మొదటిదశ అమలు చేస్తున్నామన్నారు. రూ. 750 కోట్ల నిధుల్లో సగం రూ. 375 కోట్లు మంజూరయ్యాయన్నారు. మిగిలిన నిధులు నాబార్డు అందించనున్నట్లు వెల్లడించారు.

ఫ్లైఓవర్‌కు ముహూర్తం..

గుడివాడ పట్టణంలో రూ. 325 కోట్లతో మంజూరైన ఫ్లై ఓవర్ నిర్మాణానికి త్వరలో భూమిపూజ చేస్తామని బాలశౌరి తెలిపారు. సుమారు 2.75 కిలోమీటర్ల మేర ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయితే గుడివాడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. తొలుత నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు మాదివాడ రాము పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలకు మహర్దశ..

కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వదేశీ పథకం ద్వారా రూ. 100 కోట్ల నిధులతో పర్యాటకంగా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ వివరించారు. బందరు నియోజకవర్గపరిధిలోని మంగినపూడిబీచ్, కోనేరుసెంటర్‌తో పాటు కోడూరు మండలంలోని హంసలదీవి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కొత్త రైలు మార్గానికి..

ప్రధాన మంత్రి గతిశక్తి పథకం ద్వారా మచిలీపట్నం-రేపల్లె రైలు మార్గానికి ప్రతిపాదనలు పంపామని ఎంపీ చెప్పారు. దీని గురించి ముఖ్యమంత్రికి చెప్పగానే అంగీకరించారన్నారు. సుమారు రూ.700 నుంచి రూ. 800 కోట్లు ఈ రైలుమార్గం నిర్మాణానికి అవసరమవుతాయన్నారు.

అర్జీలపై నిశిత పరిశీలన అవసరం

- స్పందనలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- మొత్తం 73 అర్జీలు స్వీకరణ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ, డీఆర్వో తదితరులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు నిశితంగా పరిశీలించి, పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 73 అర్జీలు వచ్చాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 29, పోలీస్ 12, మున్సిపల్, వైద్య, ఆరోగ్య శాఖలకు సంబంధించిన ఒక్కో శాఖకు 7 చొప్పున అర్జీలు వచ్చాయి. పంచాయతీరాజ్ 3, విద్య 2, దేవదాయ శాఖ 2, ఉపాధి కల్పన 2, ఏపీ సీపీడీసీఎల్ 2, ఇతర శాఖలకు సంబంధించి 7 అర్జీలు వచ్చాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించండి..

ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. స్పందన ఉద్దేశాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదన్నారు. స్పందన పోర్టల్‌లో గడువు తీరిన అర్జీలు ఉండకూడదన్నారు. 48 గంటలలో పరిష్కరించాల్సిన వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. న్యాయస్థానాల్లో ఉన్న కేసులకు సంబంధించి అర్జీలు వస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, డీఆర్వో కె. మోహన్ కుమార్, అసిస్టెంట్ డెప్యూటీ కలెక్టర్లు ఎస్. రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, డ్వామా పీడీ జె. సునీత, డీఈవో సీవీ రేణుక, ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి కె. అనురాధ, డీఎస్ఓ పి. కోమలి పద్మ, హౌసింగ్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- నందిగామ డివిజన్ కంచికచర్ల మండలం గని అత్కూరు శివారు కొత్తపేట గ్రామానికి చెందిన గుదే బేబీ అర్జీ ఇస్తూ.. తన భూమికి సంబంధించిన ఎటువంటి దస్తావేజులు లేవని, విచారణ చేపట్టి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరారు.
- జి. కొండూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన అప్పికట్ల మేరీ అర్జీ ఇస్తూ.. తన స్థలంలో రేకుల షెడ్డు వేసుకుని తల్లితో కలిసి నివాసం ఉంటున్నానన్నారు. విద్యుత్ బిల్లును కూడా చెల్లిస్తున్నానని, సర్వే నంబర్‌కు హద్దులు నిర్ణయించి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని విన్నవించారు.

సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జూనియర్ బాలబాలికల జట్లను ఆగిరిపల్లిలోని హీల్‌ప్యారడైజ్ స్కూల్‌లో సోమవారం ఎంపిక చేసినట్లు సెపక్ తక్రా కృష్ణా జిల్లా సంఘం కార్యదర్శి ఎం.పవన్‌కుమార్ తెలిపారు. బాలుర జట్టుకు జె.శివధనుష్, పి.తరుణ్, బి.జీవన్, ఎ.మోహిత్ సాయి, జె.రాముడు, బాలికల జట్టుకు ఎస్.ప్రియాంక, వి.లక్ష్య, టి.మౌనిక, కె.వసంతమాధురి, పి.తేజకళ ఎంపికయినట్లు చెప్పారు. ఈ నెల 12, 13 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు.

క్లుప్తంగా

నేడు మోపిదేవి ఆలయం మూసివేత

మోపిదేవి(అవనిగడ్డ): చంద్రగ్రహణం సందర్భంగా మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంను మంగళవారం ఉదయం 7 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు మూసివేయనున్నట్లు ఆలయ ఏసీ ఎస్.సూర్యచక్రధరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరుసటి రోజు అనగా 9వ తేదీ బుధవారం సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటలకు స్వామివారి దర్శనం, సేవలు యథావిధిగా నిర్వహిస్తామని, ఈ మార్పును భక్తులు గమనించి ఆలయ అధికారులకు సహకరించాలని కోరారు.

కొండలమ్మను దర్శించుకున్న స్టేట్ విజిలెన్స్ సెక్రటరీ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అపరాజితా సింగ్

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని స్టేట్ విజిలెన్స్ సెక్రటరీ అపరాజితా సింగ్ సోమవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. దుశ్శాలువా కప్పి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్, డీటీ డి.కనకదుర్గ ఉన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మైలవరం: భర్త అనుమాన భూతం ఓ మహిళ ప్రాణాలను బలిగొంది. మైలవరం తారకరామానగర్‌కు చెందిన ఉమ్మనబోయిన దుర్గ(25)కు పదేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన గణేష్‌తో వివాహం జరిగింది. గత ఏడాది కాలంగా భర్త తనను నిరంతరం అనుమానిస్తుండటంతో 15 రోజుల క్రితం దుర్గ తన ఇద్దరు పిల్లలతో సహా అదే ప్రాంతంలో ఉంటున్న తల్లి వద్దకు వచ్చి ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

11 నుంచి బాలోత్సవ్ సంబరాలు



బాలోత్సవ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీఎస్‌టీఏ ప్రతినిధులు

రామవరప్పాడు(గన్నవరం): ఎనికేపాడులోని విజయ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11 నుంచి 13 వరకు విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ బాలోత్సవ్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వీసీఎస్‌టీఏ గౌరవ అధ్యక్షుడు దేవినేని కిషోర్ కుమార్ తెలిపారు. విజయ కళాశాలలో సోమవారం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ సంబరాలకు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, మల్లాది విష్ణు, గద్దె రామ్మోహనరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. స్పోర్ట్స్, కల్చరల్, అకడమిక్ విభాగాల్లో జరిగే ఈ వేడుకల్లో సుమారు 350 పాఠశాలల నుంచి 10 వేల మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. వీసీఎస్‌టీఏ అధ్యక్షుడు చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా ఈ అసోసియేషన్ విద్యాసేవలో ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దిందన్నారు. కేవలం మార్కులే కొలమానం కాకుండా వారిలోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కల్చరల్, అకడమిక్, ఆటల పోటీల విభాగాలలో బేబీ జూనియర్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ గ్రూపులుగా విభజించి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బాలోత్సవ్ అడ్మినిస్ట్రేషన్ కమిటీ ప్రతినిధులు అనుమాటి చెన్నయ్య, గుండె స్లీవ, మామిడి శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ ముదిగొండ శ్రీహరిరావు, కల్చరల్ కమిటీ చైర్మన్ ఆరుమళ్ల మోహన్‌రెడ్డి, అకడమిక్ కమిటీ చైర్మన్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల ప్రత్యేక బస్సులకు మంచి స్పందన

జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పవిత్ర కార్తిక మాసంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని వివిధ శైవ క్షేత్రాలకు నడుపుతున్న బస్సులకు భక్తుల నుంచి మంచి స్పందన వస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.ఏసుదానం సామవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పంచారామాలకు- 30, త్రిలింగదర్శనికి-3, శ్రీశైలంకు-7, అన్నవరానికి-3, ఇతర శైవక్షేత్రాలకు-10 బస్సులతో పాటు అరుణాచలంకు-3 ప్రత్యేక బస్సులను నడిపినట్లు ఆయన పేర్కొన్నారు. తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 12న ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ఆ రోజు రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 13న శ్రీ కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని 14న అరుణాచలం చేరుతుందన్నారు. అదేరోజు సాయంత్రం బయలుదేరి మరుసటి రోజు 15వ తేదీ ఉదయం 7 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. శైవక్షేత్రాలతో పాటు బృందాలుగా శబరిమలై, మంగిన పూడి బీచ్, పర్ణశాల, ముచ్చింతల వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. వీటి కోసం దగ్గరలోని బస్సు డిపో మేనేజర్లను సంప్రదించి కానీ ఆన్‌లైన్‌లో కాని బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం



సహకార శాఖ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. గవర్నర్‌పేటలోని సహకార భవన్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా జి.ఎస్.ఎన్. బుచ్చియ్య చౌదరి, అసోసియేట్ అధ్యక్షులుగా జి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు యు.రమేష్, కార్యదర్శిగా టీజే మిల్టన్, సంయుక్త కార్యదర్శిగా టి.లీలా ప్రతాప్, సంయుక్త మహిళా కార్యదర్శిగా జ్యోత్స్న ప్రసాద్, కోశాధికారిగా పి.భాగ్యలక్ష్మీ రెడ్డి, క్యాడర్ కార్యదర్శులుగా బి.వెంకటేశ్వర్లు, టీవీబీ మురళీకృష్ణ ఎన్నికయ్యారు. నూతన కమిటీ మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతుంది.

- జీజీహెచ్‌లో సమగ్ర రేడియాలజీ సేవలు
- అందుబాటులో పది మంది రేడియాలజిస్టులు
- ఆధునిక టెక్నాలజీతో స్కానింగ్ పరికరాలు
- తొలిదశలోనే వ్యాధిని నిర్ధారిస్తున్న వైనం
- నేడు ఇంటర్నేషనల్ రేడియాలజిస్ట్స్ డే



జీజీహెచ్‌లో రోగికి ఎంఆర్‌ఐ స్కాన్ చేస్తున్న సిబ్బంది

ఎక్స్‌రే నుంచి సీటీ స్కాన్ దాకా...

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండెపోటు, పక్షవాతం, క్యాన్సర్, కడుపునొప్పి ఇలా వ్యాధి ఏదైనా నిర్ధారించేది రేడియాలజిస్టులే. గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యం నుంచి వృద్ధాప్యంలో వచ్చే వ్యాధుల వరకూ నిర్ధారణలో రేడియాలజిస్టుల పాత్ర కీలకం. ఎక్స్‌రే నుంచి డిజిటల్ ఎక్స్‌రేలు, ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్ ఇలా అనేక ఇమేజింగ్ పరికరాలు నేడు వైద్య రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. నవంబరు 8న ఇంటర్నేషనల్ రేడియాలజిస్ట్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం...

రక్తనాళాల్లో పూడికలనూ...

ఒకప్పుడు గుండె రక్తనాళాల్లో పూడికలు గుర్తించాలంటే యాంజియోగ్రామ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆస్పత్రిలో అడ్మిషన్ అవసరం లేకుండానే కంప్యూటరైజ్డ్ టోమోగ్రఫీ(సీటీ)స్కాన్ అందుబాటులోకి వచ్చింది. సంప్రదాయక సింగిల్ స్కాన్‌తో ప్రారంభమై డ్యూయల్, 4, 6, 8, 16 స్లయిస్ నుంచి నేడు 256, 320 స్లయిస్ సీటీ స్కాన్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. సంపూర్ణ దేహానికి వర్తించేలా నాన్ ఇన్‌వేసిన్ యాంటియోగ్రఫీ 3డీ సీటీ వంటివి వేగం, నాణ్యత, వైవిధ్యం విషయంలో ఎన్నో రకాలుగా వ్యాధి నిర్ధారణకు దోహదపడుతున్నాయి. గుండె, కిడ్నీ, మెదడు, లివర్ వ్యాధులతో పాటు, రక్తనాళాల్లోని లోపాలను గుర్తించే అత్యాధునిక సీటీ స్కాన్‌లు జిల్లాలో అందుబాటులోకి వచ్చాయి.

జీజీహెచ్‌లో సమగ్ర రేడియాలజీ సేవలు

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో సమగ్ర రేడియాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎంఆర్‌ఐ, రెండు సీటీ స్కానింగ్ యంత్రాలతో పాటు, పది అల్ట్రాసౌండ్ యూనిట్‌లు ఉన్నాయి. అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌లు ఉన్నాయి. ఇక్కడకు వచ్చే రోగుల వ్యాధి నిర్ధారణకు అవసరమైన స్కానింగ్‌లు చేస్తూ రిపోర్టులు అందిస్తున్నారు. ఒక ప్రొఫెసర్, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్‌లు, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఇలా 10 మంది రేడియాలజిస్టులు ఇక్కడ పనిచే స్తున్నారు.

కణజాలాల తేడాలను గుర్తించే ఎంఆర్‌ఐ

శరీరంలోని అంతర్గత తేడాలను గుర్తించడంలో ఎంఆర్‌ఐ(మాగ్నటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్) ఎంతగానో దోహదపడుతుంది. సూక్ష్మమైన లోపాలను సైతం ఈ స్కానింగ్‌లో గుర్తించగలుగుతున్నారు. వెన్నుపూస, అబ్డామిన్, మెదడు వంటి అనేక లోపాలను గుర్తించడంలో ఎంఆర్‌ఐ స్కాన్ కీలకంగా మారింది. ఈ స్కానింగ్ పరికరం 0.2 టెస్లాతో ప్రారంభమై ప్రస్తుతం 1.5 టెస్లా అందుబాటులోకి వచ్చింది. దీని స్కానింగ్ ఇమేజీలు వ్యాధి నిర్ధారణలో కీలకంగా ఉన్నాయి.

అల్ట్రాసౌండ్‌తో విప్లవాత్మక మార్పులు

మహిళల్లో పెనుముప్పుగా పరిణమించిన రొమ్ము క్యాన్సర్ నిర్ధారణలో అల్ట్రాసౌండ్ కీలకభూమిక పోషిస్తుంది. సూక్ష్మదశలో గుర్తించే ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కిడ్నీలు, పిత్తాశయంలో రాళ్లు గుర్తించడం, 24 గంటల కడుపునొప్పి, లివర్ పనితీరు ఇలా ఎన్నో రకాల వ్యాధులను సకాలంలో గుర్తించగలుగుతున్నారు. రోగి ప్రమాదం నుంచి బయట పడేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు.

కచ్చితమైన వ్యాధి నిర్ధారణ



రేడియాలజీ విభాగంలో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో వ్యాధులను కచ్చితమైన నిర్ధారణ చేయడంతో పాటు, తొలిదశలోనే గుర్తించగలుగుతున్నాం. ఎంఆర్‌ఐ యాంజియో చేసే పరికరాలు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి.

–డాక్టర్ జీవీ పార్వతీశంరావు, విభాగాధిపతి, రేడియాలజీ, జీజీహెచ్

అన్ని సేవలు అందిస్తున్నాం



రేడియాలజీకి సంబంధించి అన్ని రకాల సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా మహిళలు, గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తున్నాం. కడుపునొప్పితో జనరల్ సర్జరీ విభాగానికి వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ చేస్తున్నాం. బ్రెయిన్‌స్ట్రోక్‌ను గుర్తించి సకాలంలో వైద్యం అందేలా చేస్తున్నాం.

–డాక్టర్ డీఎల్ మంజుల, అసోసియేట్ ప్రొఫెసర్, రేడియాలజీ

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

రామవరప్పాడు(గన్నవరం): కలుషిత ఆహారం తిని 23 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం రాత్రి రామవరప్పాడు సమీపంలోని ఆకాష్ విద్యాసంస్థ శ్రీ వైష్ణవి భవన్ (గర్ల్స్ క్యాంపస్)లో చోటు చేసుకుంది. గ్రామంలోని బల్లెంవారి వీధిలో ఆకాష్ విద్యాసంస్థలకు చెందిన శ్రీ వైష్ణవి భవన్‌లో సుమారు 300 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. ఆదివారం రాత్రి మెస్‌లో వండిన చికెన్ బిర్యానీతో భోజనం చేశారు. భోజనం చేసిన కొద్దిసేపటికే 23 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలకు గురి అవడంతో నగరంలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు తెలిసింది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ బంగారు బాబు, ఏజీఎం చంద్రశేఖర్‌లను వివరణ కోరగా ఆదివారం ఇచ్చిన అవుటింగ్‌లో బయట ఆహారపదార్థాలు తినడంతోనే అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం విద్యార్థులు క్షేమంగానే ఉన్నారన్నారు.

చిత్రకారుడు అప్పారావుకు గవర్నర్ ప్రశంసాపత్రం



అప్పారావు చిత్రించిన తోట నర్సయ్య చిత్రం

పెనమలూరు: విశ్రాంత చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఆరేపల్లి అప్పారావుకు రాష్ట్ర గవర్నర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బీఏ రెడ్డి రచించిన స్వాతంత్ర్య స్ఫూర్తి–తెలుగు దీప్తి పుస్తకాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఈ నెల 4న ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 73 మంది చిత్రకారులు 133 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు చిత్రీకరించారు. వాటిలో జెండావీరుడు తోట నరసయ్య చిత్రాన్ని అప్పారావు చిత్రీకరించారు. ఈ చిత్రానికి గాను తనకు గవర్నర్ ప్రశంసాపత్రాన్ని అందజేసినట్టు అప్పారావు సోమవారం విలేకరులకు తెలిపారు.

పలువురు పోలీసు అధికారులకు బదిలీలు

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లాలోని పలువురు పోలీసు అధికారులను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ ఎన్.సురేష్‌కుమార్ రెడ్డిని విజయవాడ నార్త్ ట్రాఫిక్ ఏసీపీగా, మరో డీఎస్పీ డాక్టర్ బి.రవికుమార్‌ను విజయవాడ సౌత్ ఏసీపీగా, బి.ఆదినారాయణను సీసీఎస్ ఏసీపీగా, ఎం.రమేష్‌ను ఎస్‌డీపీఓ మైలవరానికి, ఎస్‌బీలో ఉన్న సీహెచ్ రవికాంత్‌ను విజయవాడ నార్త్ ఏసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న వీఎస్ఎన్.వర్మను కొవ్వూరు ఎస్‌డీపీఓగా బదిలీ చేశారు.

బీచ్‌లో గల్లంతైన విద్యార్థి మృతి



మృతదేహాన్ని బైక్‌పై తీసుకువెళుతున్న బంధువులు



నవీన్ మృతదేహాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌లో గల్లంతైన విద్యార్థి మృతి చెందాడు. సోమవారం తెల్లవారుజామున విద్యార్థి మృతదేహం పల్లెపాలెం బీచ్ ఒడ్డుకు కొట్టుకువచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని బందరు ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. ఆదివారం మచిలీపట్నం బలరామునిపేటకు చెందిన గోళ్ల నవీన్ (14) మరో ముగ్గురు స్నేహితులు కలిసి మంగినపూడి బీచ్‌కు వెళ్లిన విషయం పాఠకులకు విదితమే. స్నేహితులు నలుగురు బీచ్‌లో స్నానం చేస్తుండగా నవీన్ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితుల సమాచారంతో బందరు రూరల్, మెరైన్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా నవీన్ జాడ తెలియలేదు. సోమవారం తెల్లవారుజామున పెదపట్నం సమీపంలోని బీచ్ ఒడ్డున నవీన్ మృతదేహాన్ని బంధువులు గుర్తించారు. విగతజీవిగా పడి ఉన్న నవీన్ మృతదేహాన్ని చూసి భోరున విలపించారు.

బైక్‌పై విద్యార్థి మృతదేహం

పెదపట్నం బీచ్ ఒడ్డుకు కొట్టుకువచ్చిన నవీన్ మృతదేహాన్ని చూసి తల్లడిల్లిన బంధువులు బైక్‌పై పెట్టుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా బందోబస్తులో ఉన్న ఇనగుదురుపేట సీఐ ఉమామహేశ్వరరావు చూసి బంధువుల ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. తక్షణమే వాహనాన్ని పిలిపించి నవీన్ మృతదేహాన్ని అందులో ఎక్కించి బంధువులతో పాటు సిబ్బందిని ఆసుపత్రికి పంపారు. అప్పటికి ఇంకా విద్యార్థి ఆచూకీ కోసం గాలిస్తున్న రూరల్, మెరైన్ పోలీసులకు సీఐ సమాచారం అందించారు. దీంతో రూరల్ ఎస్ఐ వాసు ఆసుపత్రికి చేరుకుని బంధువుల నుంచి వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు : ఎస్పీ

జరిగిన సంఘటనపై కొంతమంది సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్‌లను బందరు డీఎస్పీ తీవ్రంగా ఖండించారు. విద్యార్థి మృతదేహాన్ని బంధువులు బైక్‌పై తీసుకువెళ్లటాన్ని పోలీసుల వైఫల్యంగా చిత్రీకరించటం సమంజసం కాదని, పోలీసుశాఖపై ఉద్దేశపూర్వకంగా నిందలు వేయాలని చూస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థి ఆచూకీ కోసం సిబ్బంది ఆదివారం నుంచి సోమవారం వరకు గాలిస్తూ ఉన్నట్లు చెప్పారు. విద్యార్థి మృతదేహాన్ని చూసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించకుండా మృతుడి బంధువులు బైక్‌పై తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారని, బందోబస్తులో ఉన్న సిబ్బంది అక్కడికక్కడే వాహనాన్ని ఏర్పాటు చేసి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారని చెప్పారు.

ఫిష్ ఆంధ్ర షాపులకు స్థల సేకరణ వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్



మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటుకు స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మన చేప– మన ఆరోగ్యం (ఫిష్ ఆంధ్ర– ఫిట్ ఆంధ్ర) ఫ్లాగ్ షిప్ కార్యక్రమం కింద జిల్లాలో మత్స్య ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించేలా స్థానిక మార్కెటింగ్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా చేపల విక్రయదారులు దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటికి స్థలాల కేటాయింపుపై సోమవారం జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో నగరపాలక సంస్థ, మత్స్య, పశుసంవర్ధక, మార్కెటింగ్, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్, పర్యాటక శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో చేపల దుకాణాలలో అమ్మకాలు నిర్వహించుకునేందుకు 168 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు చెప్పారు. మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలను అన్ని శాఖల సమన్వయంతో త్వరగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా చేపల వినియోగం పెంచి ఎగుమతులపై ఆధారపకుండా ఈ రిటైల్ షాపులను ప్రోత్సహించాలన్నారు. అయా షాపులకు నాణ్యమైన చేపలు, మత్స్య ఉత్పత్తులను సరఫరా చేయడానికి మత్స్య కారులను ప్రోత్సహించాలన్నారు. ఆక్వా రైతులకు లాభదాయకమైన మార్కెట్ కల్పించి, వినియోగదారులకు తక్కువ ధరలకు నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కొత్తగా మినీ ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్లను తీసుకువచ్చి మన చేప– మన ఆరోగ్యం కింద ఈ పథకానికి శ్రీకారం చుట్టిందని జేసీ వివరించారు. సమావేశంలో మత్స్య శాఖ డీడీ ఎ.నాగరాజా, సహాయ సంచాలకులు సీఎస్ చక్రపాణి, పశు సంవర్ధక శాఖ జేడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ స్థాయి క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో క్రికెట్(పురుషులు), వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ స్త్రీ, పురుషుల పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ అజీజ్ తెలిపారు. దీనిలో భాగంగా తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల స్థాయి క్రీడా జట్ల ఎంపికలు ఆయా మండల కేంద్రాల్లో, విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాల స్థాయి క్రీడా జట్ల ఎంపికలు విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 9,10 తేదీల్లో జరుగుతున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్‌తో సంప్రదించాలన్నారు. ఆయా క్రీడాంశాల్లో నియోజకవర్గ స్థాయి జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31వ తేదీ లోపు జరిగే జిల్లా స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యుత్ సబ్‌స్టేషన్ జమ్మిచెట్టు సెంటర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీరు బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధు గార్డెన్ ప్రాంతం, ఏఎస్. రామారావు రోడ్డు, శాంతి నగర్, జమ్మిచెట్టు సెంటర్, బాడవ పేట, వాటర్ ట్యాంక్ రోడ్డుల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకాలు



కృష్ణలంక(విజయవాడ తూర్పు): రాణిగారితోట, బాపనయ్యనగర్‌కు చెందిన ఉడుముల అయ్యపరెడ్డి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించారు. నగరంలోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆరో రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 55–59 మధ్య వయస్సు గల పురుషుల కేటగిరీలలో అయ్యపరెడ్డి పాల్గొని 3 బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు. 400 మీటర్లు, 200 మీటర్లు, 100 మీటర్ల ఫ్రీ స్టైల్స్‌లో బంగారు పతకాలు, 50 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం పొందారు. ఈయన గత 13 సంవత్సరాలుగా ఆక్వా డెవిల్స్‌లో స్విమ్మింగ్ కోచింగ్ తీసుకుంటూ అనేక పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన ఆయనకు పలువురు స్థానికులు అభినందనలు తెలిపారు.

ఆచార్య ఎన్‌జీ రంగా జీవితం ఆదర్శనీయం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్వాతంత్ర్య సమరయోధుడు, సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యుడుగా ఉండి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు నమోదు చేసుకున్న వ్యక్తి, పద్మవిభూషణ్ ఆచార్య ఎన్‌జీ.రంగా జీవితం అందరికీ ఆదర్శనీయమని మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు చెప్పారు. గాయత్రీనగర్‌లో సోమవారం ఎన్‌జీ.రంగా 122వ జయంతి నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వడ్డే శోభనాద్రీశ్వరరావు అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఎన్‌జీ.రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ చైర్మన్ గోగోనేని ధనశేఖర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎన్‌జీ.రంగా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. 1930 నుంచి 1991 సంవత్సరం వరకు ఎన్‌జీ.రంగా సుదీర్ఘకాలం అంటే 60 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారని చెప్పారు. రైతు కూలీల కోసం ప్రత్యేకగా ఉద్యమానికి ఆయన శ్రీకారం చుట్టారన్నారు. స్థానికులు కోగంటి కోటయ్య, గద్దె చంద్రశేఖర్, రాజేంద్ర ప్రసాద్, డి.రవికుమార్, వి.సురేష్, కె.సుధీక్ష్, ఓంకార్, జీ.రాజేంద్రప్రసాద్, వి.రమణ, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న 282 వార్డు వలంటీర్ల కోసం అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై 18–35 ఏళ్ల వయస్కులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీఎంసీ పరిధిలో మాత్రమే నివసించేవారు, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్జీదారులు తమ విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలతో జతపరచి వెబ్ సైట్లో ఈ నెల 13 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు అదనపు కమిషనర్ (ప్రాజక్ట్స్)లేదా వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్ నంబర్‌లో 8185933187 సంప్రదించాలన్నారు.

దేశభక్తి గీతాల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన హిందీ దేశభక్తి గీతాల పోటీల్లో నలంద విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 46 పాఠశాలల నుంచి 208 మంది పాల్గొన్నారు. నలందలో 9వ తరగతికి చెందిన ఎ.అన్షు, బి.తేజస్వి, ఎ. ఉమా తేజస్వి, రిషబ్, దేదీప్య, 8వ తరగతికి చెందిన కె. సత్యానంద్, ఎస్.శివానీ, బి.ఉషశ్రీలు సూరజ్ బద్లే చందా బద్లే అనే హిందీ దేశ భక్తి గీతాన్ని పాడి ప్రథమ స్థానంలో నిలిచినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. వీరంతా ఈ నెల 27న రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో సైతం ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు




మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దేవినేని నెహ్రూ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్, బహిరంగసభలో మాట్లాడుతున్న అవినాష్

బహిరంగ సభలో దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): గడప గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో తలపెట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మాచవరంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ జగనన్న హయాంలో సంక్షేమ పాలన అందుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలుజేసే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధాన్ని పరిశీలించేందుకు, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్‌లలో ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు గుర్తించామన్నారు. అధికారులతో సమన్వయంగా ఉంటూ వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ నిబద్ధతగా పనిచేస్తుందన్నారు. ఒకవేల ఏదైనా కారణంగా చేత పథకాలు అందకపోతే వెంటనే పరిష్కరించి లబ్ధి కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉంటుందన్నారు. అంతకు ముందు గుణదల నుంచి మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మాచవరంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టిఫిన్ బండి అందచేత..

2వ డివిజన్ బెత్లహాం నగర్ కు చెందిన నాగమణి, పుష్పవతిలకు రూ.35 వేలు ఖరీదు చేసే టిఫిన్ బండ్లు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ద్వారా పంపిణీ చేశారు. పేదల జీవనోపాధి నిమిత్తం ఇటువంటి కార్యక్రమాలు తరచూ చేస్తున్నట్లు వివరించారు. 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు రవిప్రకాష్, చందా కిరణ్ తేజ, కోటి నాగులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కోటి దీపోత్సవం



ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సోమవారం కోటి దీపోత్సవం కనులపండువగా నిర్వహించారు. దీపాల వెలుగుల్లో దుర్గమ్మ సన్నిధి దేదీప్యమానంగా వెలిగింది. కార్తిక పౌర్ణమి నేపథ్యంలో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. జ్వాలా తోరణం కోలాహలంగా జరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ




అన్ని వర్గాలకు జగనన్న బాసట

గడప గడపకు మన ప్రభుత్వంలో అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): అన్ని వర్గాలకు బాసటగా నిలిచి సంక్షేమ పాలన అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 2వ డివిజన్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, ప్రాంతీయ విభేదాలు లేకుండా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు మూడు రాజధానుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. మూడు రాజధానులు ఉంటే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. పాలనా సౌలభ్యం కోసం మూడు రాజధానుల ఏర్పాటు ఆమోదయోగ్యమన్నారు.

చంద్రబాబుకు వెన్నులో వణుకు..

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ సన్యాసం చేయక తప్పదని తెలిపారు. ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతో తెలుగు తమ్ముళ్లు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిందన్నారు. సామాన్యుల బతుకులు రోడ్డున పడ్డాయని గుర్తుచేశారు. ఈ కారణంగానే గత ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతో చంద్రబాబు వెన్నుల్లో వణుకు మొదలైందన్నారు.

అధికారులతో సమన్వయం..

అధికారులతో సమన్వయంగా ఉంటూ స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కొండ ప్రాంతంలో కొన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. కొండ ఎగువ ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరారు. అధికారులతో సమన్వయంగా ఉంటూ ఆయా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలా కుమారి, స్థానిక నాయకులు రవిప్రకాష్, చందా కిరణ్ తేజ, కోటి నాగులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న దేవినేని అవినాష్

వీఎంసీ స్పందనలో 29 అర్జీలు



బాధితుల అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడ తూర్పు): స్పందనలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించి పరిష్కరించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థలో సోమవారం నిర్వహించిన స్పందనలో 29 అర్జీలను ఆయన స్వీకరించారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పట్టణ ప్రణాళిక -11, ఇంజినీరింగ్‌పై-10 ప్రజారోగ్యం -01, రెవెన్యూ-01, పట్టణ సామాజికాభివృద్ధిపై-06 వచ్చాయి. అదనపు కమిషనర్(జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్(ప్రాజక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం. ప్రభాకర్, సీఎంవోహెచ్ డాక్టర్ పి. రత్నావళి, యూసీడీ ప్రాజక్ట్ అధికారి శకుంతల, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి. వెంకటలక్ష్మి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో నాలుగు అర్జీలు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగంపై ఒకటి, ప్రజారోగ్య విభాగం-01, రెవెన్యూ-01, పట్టణ ప్రణాళిక విభాగం -01, ఇంజినీరింగ్ విభాగంపై-01 వచ్చాయి. సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో మూడు అర్జీలు రాగా అందులో ఉద్యానవనవిభాగంపై 01, ఇంజినీరింగ్‌పై ఒకటి వచ్చాయి. పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో జరిగిన స్పందనలో మూడు అర్జీలు రాగా ఉద్యానవనవిభాగం-01, పట్టణ ప్రణాళిక విభాగంపై రెండు అర్జీలు అధికారులు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు పోటెత్తాయి. కృష్ణలంక మెట్లబజార్ చివరన కృష్ణానది కరకట్ట వెంబడి వేంచేసియున్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము 5 గంటల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు శివుని దర్శనానికి బారులు తీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మార్తి వెంకట్రామశాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి విశేష పూజలు, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, జ్వాలాతోరణం, నిత్య ఆకాశదీపం, పుష్పార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయ కమిటీ చైర్మన్ మూలంరెడ్డి సుబ్బారెడ్డి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. కృష్ణలంక సర్వీస్ రోడ్డులోని శంకరమఠం, పద్మావతి ఘాట్ వెంబడి ఉన్న మార్వాడీ శివాలయం భక్తులతో కళకళలాడాయి.

ఎక్సెల్ ప్లాంట్ పరిశీలన



అజిత్‌సింగ్ నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌ను సందర్శిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): అజిత్‌సింగ్ నగరలోని వీఎంసీ ఎక్సెల్ ప్లాంట్‌కు మూడు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేయాలని, ప్లాంట్ ఆవరణలో చెత్త తరలించే వాహనాల రాకపోకలకు అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో సోమవారం ఆయన పర్యటించారు. ప్లాంట్‌లో వాహనాల సర్వీసింగ్ ర్యాంపులను పెంచాలని, ప్లాంట్ చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆఫీస్ భవనం, స్టోర్‌రూం, డ్రైవర్ల రెస్ట్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆవరణలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, నగరంలో కొమ్మరి బొండాల విక్రయదారులు పారేసిన బొండాలను నేరుగా కాకుండా ముక్కలుగా చేసి వాటిని మాత్రమే ఎక్సెల్‌ప్లాంట్‌కు తరలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్తతోపాటు కాకుండా చెట్ల కొమ్మలను వేరుగా ప్లాంట్‌లో ఉడ్ ఛాపర్ మిషన్ ప్లాంట్‌లో అందిచాలన్నారు. ఈఈలు ఎఎస్ఎన్ ప్రసాద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆది దంపతుల గిరి ప్రదక్షిణ



ప్రచార రథంపై ఆది దంపతులకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో నిర్వహించిన గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా సాగింది. దేవస్థాన ప్రచార రథంపై గంగా పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు, ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాలతో పాటు వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ సిబ్బంది, భక్తులు, భవానీలు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. దేవస్థాన ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమైన కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాలు, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మల్లికార్జున మహా మండపానికి చేరుకుంది. ప్రచార రథంపై తమ ఇంటి ముంగిటకు వచ్చిన ఆది దంపతులకు భక్తులు పూజలు నిర్వహించారు. కార్తిక పౌర్ణమి వేళ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొనడం చాలా ఆనందదాయమకని పలువురు భక్తులు తెలిపారు. ప్రచార రథంపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను వీక్షించేందుకు భక్తులు రోడ్లపై బారులు తీరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): రోడ్డు దాడుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉంగుటూరుకు చెందిన తన్నా వెంకటేశ్వరరావు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బంధువులను బస్సు ఎక్కించేందుకు తన తండ్రి వీరయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై పీఎన్‌బీఎస్ బస్టాండ్‌కు చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో కృష్ణలంక జాతీయ రహదారి గుండా వెళ్తున్నారు. అమెరికన్ ఆసుపత్రి సమీపానికి రాగానే వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి పని నిమిత్తం తండ్రి కొడుకులిద్దరూ కృష్ణలంక ఫీడర్ రోడ్డు వైపునకు వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతున్నారు. ఆ సమయంలో బస్టాండ్ వైపు నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెంకటేశ్వరరావును ఢీకొట్టింది. దీంతో అతను కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. చుట్టుప్రక్కల వారి సహాయంతో తండ్రి కుమారుడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కృషి



లబ్బీపేట(విజయవాడతూర్పు): చేనేత, హస్త కళాకారులకు ప్రోత్సాహం అందించాలని నాబార్డు (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) రీజినల్ కార్యాయం చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్ అన్నారు. నాబార్డు ఆర్థిక సహకారంతో నేస్తం రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహణతో ఎంజీరోడ్డులోని పీవీపీ మాల్‌లో స్టాల్ ఇన్ మాల్ కార్యక్రమంలో భాగంగా చేతివృత్తి కళాకారుల స్టాల్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఆర్ గోపాల్ మాట్లాడుతూ గ్రామీణ ఉత్పత్తులను ప్రతి ఒక్కరికీ అందించడంతో పాటు, చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు నాబార్డు కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోనే తొలిసారిగా స్టాల్ ఇన్ మాల్ అనే వినూత్న పథకం ద్వారా వివిధ మాల్స్‌లో మహిళా ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తున్నట్లు తెలిపారు. అందుకు నాబార్డు సహకారం అందిస్తుందన్నారు. నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మిలింద్ చౌఔసాల్‌కర్, నేస్తం రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ సీఈవో వి సురేష్, డైరెక్టర్ వి నందిని, అసిస్టెంట్ మేనేజర్ జయరాజు తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు

పటమట: కార్తిక పౌర్ణమి సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో లక్ష బిల్వార్చనవ మహారుద్ర హోమం చేశారు.

కార్తిక పుణ్య స్నానాలు..




కార్తిక పౌర్ణమి సందర్భంగా విజయవాడలోని కృష్ణానది ఘాట్లు భక్తులతో కిటకిటలాడాయి. నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వెలిగించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు నదీ స్నానానికి తరలివచ్చారు. నగరంలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ




స్వరరాగ గంగా ప్రవాహం

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో సోమవారం మల్లాది రాంప్రసాద్, డాక్టర్ మల్లాది రవికుమార్ నిర్వహించిన గాత్ర సంగీత కార్యక్రమం కర్నాటక సంగీత వైభవాన్ని చాటింది. త్యాగరాజ స్వామి స్వర రచన పాలింతువో పాలించవో, పలుకు తేనియతల్లి (అన్నమయ్య) కాశీ, కాశీ (గణపతి సచ్చిదానంద స్వామి), అక్షయలింగ విభో, అరుణాచలనాథం (దీక్షితార్) ఆలపించారు. మృదంగంపై పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, వయోలిన్‌పై కామాక్షి, ఘటంపై మార్పూరి హరిబాబు సహకరించారు. కార్యక్రమ నిర్వాహకుడు సూరి నిడమర్తి మల్లాది సోదరుల సంగీత ప్రయాణం అంశంగా ప్రసంగించారు.

భూములిచ్చారంటూ బుకాయింపు

- ఇప్పటంపై జనసేన మరో కొత్త నాటకం
- ప్లీనరీకి పొలాలు ఇచ్చింది తొమ్మిది మందే
- అందులో ఇద్దరు తాడేపల్లి, చీరాలలో నివాసం
- ఇక ఆక్రమణల నోటీసులిచ్చింది ఒక్కరికే
- ఆ ఒక్కరూ జూన్‌లోనే హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న వైనం
- సభకు 31 మంది భూములిచ్చారంటూ జనసేన కొత్త పల్లవి



ఇప్పటంలో ప్రహరీని మాత్రమే కూల్చిన దృశ్యం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామంలో ఇళ్ల కూల్చివేతల్లో ఏమాత్రం నిజం లేదని తేలిపోవడంతో జనసేన మరో కొత్త నాటకానికి తెర తీసింది. తమ పార్టీ ఆవిర్భావ సభ నిర్వహణకు ఎవరెవరు స్థలాలిచ్చారో అదే రోజు వేదికపైనే పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇప్పుడు అధికారులు తొలగించిన ఆక్రమణల జాబితాలో వారెవరూ లేకపోవడం గమనార్హం. తొమ్మిది మంది సభకు స్థలాలు ఇచ్చినట్లు నాడు జనసేన ప్రకటించగా అందులో ఒక్కరికి మాత్రమే అధికారులు ఆక్రమణల కింద నోటీసులు జారీ చేశారు. మిగిలిన వారి ఇళ్లు, దుకాణాలు రోడ్డుకు దరిదాపుల్లోనే లేవు. అయితే ఆ ఇంటి యజమాని కూడా ఈ ఏడాది జూన్‌లో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో అధికారులు ఆ నివాసాన్ని వదిలేసి మిగిలిన ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇళ్ల కూల్చివేతల ఆరోపణలు బెడిసికొట్టడంతో మార్చిలో నిర్వహించిన జనసేన ప్లీనరీకి 31 మంది భూములిచ్చారని, వారి ఇళ్లను టార్గెట్ చేసి తొలగిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు కొత్త పల్లవి అందుకున్నారు.

పార్కింగ్‌కు వాడుకుని..

ఇప్పటంలో ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్ అండ్ బీ అధికారులు మార్కింగ్ చేసినప్పుడు మొత్తం 53 ప్రైవేట్ ఆస్తులు, ఒక పంచాయతీ భవనం ఆక్రమణల పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 31 మంది తమ ప్లీనరీకి భూములిచ్చిన సానుభూతిపరులంటూ జనసేన బుకాయిస్తోంది. నిజానికి వీరి భూములు సభ జరిగిన ప్రాంతాన్ని ఆనుకుని ఉండటం, ఆ సమయంలో పొలాల్లో ఎలాంటి పంటలు లేకపోవడంతో ప్లీనరీ వాహనాల పార్కింగ్‌గా వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. అది కూడా వారి నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే వాడుకోవడం గమనార్హం.

సభకు భూములిచ్చింది 9 మందే..

ఇప్పటంలో జనసేన సభకు భూములిచ్చిన తొమ్మిది మందికి సర్వే నం.167, 167(బి)లో పొలాలున్నాయి. సభ నిర్వహణకు వారు అంగీకరిస్తున్నట్లు స్థానిక తహశీల్దార్‌కు అర్జీ అందింది. జనసేన నేతలు చెబుతున్న 31 మంది పొలాలు సమీపంలోనే ఉన్నా అనుమతి తీసుకోలేదు. స్థానిక టీడీపీ నాయకుడైన శంకరశెట్టి పిచ్చయ్య గతంలో సర్పంచ్‌గా పని చేశారు. తర్వాత ఆయన భార్య కూడా సర్పంచ్‌గా ఉన్నారు. జనసేన సభకు పొలాలు ఇచ్చిన 9 మందిలో ఆయన ఇల్లు మాత్రమే రోడ్డును ఆనుకుని ఉంది. ఆయన ఇంటి ప్రహరీ, మెట్లు ఆక్రమణ పరిధిలోకి రావడంతో అధికారులు నోటీసులిచ్చారు. దీనిపై ఆయన జూన్‌లో హైకోర్టును ఆశ్రయించి స్టే పొందడంతో పిచ్చయ్య ఇంటి ప్రహరీని అధికారులు తొలగించలేదు.

గతంలోనే విగ్రహ తొలగింపు ప్రక్రియ

ఇప్పటంలో ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణ పరిధిలోకి 53 ప్రైవేట్ ఆస్తులు, రెండు దేవాలయాలు, మరో రెండు వైఎస్సార్ విగ్రహాలు వచ్చాయి. వీటిలో ఒక విగ్రహ తొలగింపు ప్రక్రియ గతంలోనే చేపట్టి రెయిలింగ్, దిమ్మె తొలగించారు. మరో ప్రాంతానికి తరలించే లోగా జనసేన రాద్ధాంతం సృష్టించింది. ఆ విగ్రహాన్ని సోమవారం తరలించారు. మరో విగ్రహాన్ని రోడ్డు పనులు ప్రారంభించే లోగా తరలించాలని నిర్ణయించారు.

జనసేన సభకు భూములిచ్చిన వారి వివరాలు

1. వింటా సాంబిరెడ్డి (సర్వే నం.167(బి)): సొంతూరు గన్నవరం సమీపంలోని తేలప్రోలు కాగా తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రి వెనుక ఉన్న వజ్ర రెసిడెన్సీలో నివాసం ఉంటున్నారు. ఎండు చేపల వ్యాపారం చేసే ఈయన ఇప్పటంలో ఏడెనిమిదేళ్ల క్రితం పొలం కొనుక్కున్నారు. ఇప్పటంలో ఎలాంటి నివాసం లేదు.
2. లక్కాకుల ఆదినారాయణ: ఈయన నివాసం ఊరు మధ్యలో ఉంది.
3. తిరుమలశెట్టి సామ్రాజ్యం: లక్కాకుల ఆదినారాయణ సోదరి. చీరాలలో ఉంటారు. ఈమెకు ఇప్పటంలో సొంతిల్లు లేదు.
4. గాజుల సాబయ్య: ఈయన ఇల్లు కూడా ఆదినారాయణ ఇంటికి సమీపంలోనే ఊరికి మధ్యన ఉంది.
5. శంకరశెట్టి శ్రీనివాసరావు: (పిచ్చయ్య తమ్ముడు) గుంటూరులో ఉంటారు. వారసత్వంగా వచ్చిన ఇల్లు గ్రామంలో ఉంది.
6. శంకరశెట్టి పిచ్చయ్య: ఈయన ఇల్లు పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉంది. ప్రహరీతో పాటు ఇంటి మెట్లు ఆక్రమణల పరిధిలోకి వచ్చాయి. ఏప్రిల్, మేలో నోటీసులు ఇవ్వడంతో జూన్‌లో కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. అధికారులు ఈయన ఆస్తిని ముట్టుకోలేదు.
7. శంకరశెట్టి రాయుడు, 8. శంకరశెట్టి ఉమామహేశ్వరరావు, 9. గాజుల నర్సియ్య: వీరి నివాసాలు గ్రామంలోనే ఉన్నాయి.

క్లుప్తంగా

ఇప్పటంలో వైఎస్సార్ విగ్రహం తరలింపు

పది రోజుల కిందటే బేస్ మట్టం పగుల గొట్టిన అధికారులు



వైఎస్సార్ విగ్రహాన్ని తొలగిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి ఇప్పటంలో కమిషనర్ శారదాదేవి ఆదేశాల మేరకు వైఎస్సార్ విగ్రహాన్ని సోమవారం తొలగించారు. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటం ప్రాంతానికి రూ.6 లక్షల నిధులు కేటాయించడంతో పెదవడ్లపూడి నుంచి కొలనుకొండ జాతీయ రహదారి వద్ద ఉన్న అండర్‌పాస్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. దానిలో భాగంగా వైఎస్సార్ విగ్రహ బేస్ మట్టాన్ని 10 రోజుల కిందటే పగులగొట్టారు. అయితే విగ్రహ తరలింపు కొద్దిగా ఆలస్యమైంది. చివరకు ఈ విషయంలోనూ రాజకీయాలు చేస్తుండటంతో అధికారులు ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి వైఎస్సార్‌సీపీ నాయకులకు అప్పగించారు.

సాగర్ నుంచి నీటి విడుదల

విజయపురిసౌత్/శ్రీశైలం ప్రాజెక్ట్: నాగార్జున సాగర్ వద్ద రెండు రోజుల కిందట మూతపడిన క్రస్ట్‌గేట్లు సోమవారం మళ్లీ తెరుచుకున్నాయి. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. రెండు క్రస్ట్ గేట్లు ఐదు అడుగుల మేర ఎత్తి 16,200 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 55,329 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయిలో 589.90 అడుగుల వద్ద కొనసాగిస్తూ వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి, ఎడమ, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, ఎస్‌ఎల్‌బీసీ, వరదకాలువ ద్వారా 48,928 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాజెక్టులైన జూరాల సుంకేసుల నుంచి 22,201 క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన కొనసాగుతోంది.

పరిహారం చెల్లింపులు ఆలస్యం కానివ్వద్దు

ఏపీ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

సాక్షి, అమరావతి: విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు పరిహారాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆదేశించారు. చైర్మన్ అధ్యక్షతన అర్ధ సంవత్సర సమావేశం హైదరాబాద్‌లోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో సోమవారం జరిగింది. పరిహారం చెల్లింపులకు సంబంధించిన కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగిన చైర్మన్ నిబంధనల ప్రకారం ఆలస్యం కాకుండా వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ ఏడాది మార్చి 30 వరకూ వివిధ అంశాలపై జారీ చేసిన ఆదేశాల అమలు తీరుపై సమీక్షించారు. 2021–22 ఆర్థిక సంవత్సరం, 2022–23 మొదటి అర్ధభాగంలో విద్యుత్ అమ్మకాలు, కొనుగోలు, రాబడిలో వ్యత్యాసాలను కేటగిరీల వారీగా తెలపాలని కోరారు. 2021–22లో డిస్కంల లాభనష్టాలపై చర్చించి ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్‌లు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చెల్లింపులు ఎలా ఉన్నాయ్?

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రెవెన్యూ డిమాండ్, వసూళ్లు, ఆంధ్రప్రదేశ్ పవర్ కో–ఆర్డినేషన్ కమిటీకి చెల్లించిన నగదు వంటి వివరాలను ఈఆర్సీ చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 11 వరకు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఎంత చెల్లించారనేది ఆరా తీశారు. మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల బకాయిల చెల్లింపు కోసం ప్రవేశపెట్టిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం పురోగతిపైనా చర్చించారు. సమావేశంలో విద్యుత్ శాఖ సెక్రటరీ కె.రాజబాపయ్య, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, జేఎండీ ఐ.పృథ్వీతేజ్, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డి పాల్గొన్నారు.

● తెలంగాణ

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్‌పై భారీగా ఫిర్యాదులు?

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లిన గవర్నర్ తమిళిసై!
- ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో జరుగుతోందనే ఆరోపణలున్నట్టు వివరణ
- తన ఆదేశాలను ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఫిర్యాదు
- ఢిల్లీలో అమిత్‌షాతో గవర్నర్ భేటీ.. మర్యాదపూర్వకంగానే అని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రతిపక్షాల నేతలు, ఇతర ముఖ్య నాయకుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయంటూ అనేక ఫిర్యాదులు వస్తున్నాయని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల కనుసన్నల్లో ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని, దీనికి పోలీసులు సహకరిస్తున్నారని వివిధ పార్టీల నేతలు తనకు ఫిర్యాదు చేశారని వివరించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ పర్యటనకు వచ్చిన గవర్నర్.. సాయంత్రం నార్త్‌బ్లాక్‌లోని హోంశాఖ కార్యాలయంలో అమిత్‌షాతో భేటీ అయ్యారు. సుమారు పది నిమిషాల పాటు వారు వివిధ అంశాలపై చర్చించారు. తన మూడేళ్ల పదవీకాలంలో రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన నివేదికను అమిత్‌షాకు తమిళిసై అందజేశారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల కొనుగోలు అంశం, పలు బిల్లుల ఆమోదం విషయంలో ప్రభుత్వ సహకారం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో కేసీఆర్ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహం, కేంద్రంలోని పెద్దలను ఇరకాటంలోకి నెట్టేలా వ్యవహరిస్తున్న తీరుపైనా చర్చ జరిగినట్టు సమాచారం. ఇక తన ఆమోదం కోసం వచ్చిన పలు బిల్లుల విషయంలో అదనపు సమాచారం కోరినా ప్రభుత్వ యంత్రాంగం నుంచి స్పందన కరువైన విషయాన్ని అమిత్‌షా దృష్టికి గవర్నర్ తీసుకెళ్లినట్టు తెలిసింది. విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాల భర్తీకోసం కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు బిల్లుపై సందేహాలు ఉన్నాయని.. వాటి నివృత్తి కోసం రాష్ట్ర విద్యా మంత్రికి లేఖ రాసినా స్పందన లేదని వివరించినట్టు సమాచారం.

మామూలు భేటీయే: గవర్నర్

అమిత్‌షాతో భేటీ అనంతరం గవర్నర్ తమిళిసై మీడియాతో ముక్తసరిగా మాట్లాడారు. తెలంగాణ గవర్నర్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. గవర్నర్‌గా తన మూడో ఏడాదికి సంబంధించిన కార్యకలాపాలను నివేదిక రూపంలో హోంమంత్రికి ఇచ్చానని వివరించారు. కేంద్ర హోంమంత్రితో భేటీ సాధారణంగా జరిగే ప్రక్రియలో భాగమేనని, ఎలాంటి ప్రత్యేకతా లేదని పేర్కొన్నారు.

తెలంగాణ గొంతు నొక్కలేరు

- మేనూర్ బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- తెలంగాణలో ముగిసిన జోడో యాత్ర

సాక్షి, కామారెడ్డి/హైదరాబాద్: 'తెలంగాణ సమాజంలో ప్రశ్నించేతత్వం, ఎదిరించే శక్తి ఉన్నాయి. తెలంగాణ గొంతును ఎవరూ నొక్కలేరు. ఎవరూ అణచివేయలేరు. దేశానికి ధైర్యాన్ని, శక్తిని అందించే సామర్థ్యం తెలంగాణకు ఉంది. తెలంగాణలో పాదయాత్ర ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నా. తెలంగాణను వదిలివెళుతున్నందుకు బాధగా ఉంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. రాబోయే రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తుంది' అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తెలంగాణలో చివరి రోజైన సోమవారం సాయంత్రం కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం మేనూర్ వద్ద నిర్వహించిన బహిరంగసభలో రాహుల్ ప్రసంగించారు. సీఎం కేసీఆర్ కమీషన్ల కోసమే ప్రాజెక్టులను రీ డిజైన్ చేశారని, రాత్రిపూట ధరణి పోర్టల్‌ను తెరిచి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణలో సోమవారంతో ముగిసింది. గత నెల 23న తెలంగాణలోకి ప్రవేశించిన రాహుల్.. 12 రోజులపాటు 375 కిలోమీటర్ల మేర నడిచారు. ఈ యాత్ర తెలంగాణ నుంచి మహారాష్ట్రలోకి ప్రవేశించింది.

ద.మ. రైల్వే పూర్తిస్థాయి జీఎంగా అరుణ్‌కుమార్ జైన్



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జి జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న అరుణ్‌కుమార్‌జైన్‌ను రైల్వే శాఖ పూర్తిస్థాయి జీఎంగా నియమించింది. పదోన్నతితో ఆయనకు పోస్టింగ్ ఇవ్వటంతో సోమవారం అరుణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్స్ 1986 బ్యాచ్‌కు చెందిన అధికారి.

సూపర్ గ్రాసం

- సూపర్ నేపియర్‌తో బహుళ ప్రయోజనాలు
- మెండుగా పోషక విలువలు, దిగుబడి
- చలికాలంలోనూ పెరగడం దీని ప్రత్యేకత
- పశు పోషకులకు 80 శాతం రాయితీపై సరఫరా



కళాశాల పశుగణ క్షేత్ర సముదాయంలో పెంచుతున్న సూపర్ నేపియర్ గడ్డి

గన్నవరం: జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యవసాయం తర్వాత ప్రధాన ఆధారమైనది పాడిపోషణ. కానీ, పెరిగిన పోషణ ఖర్చులు కారణంగా పాడి పశువుల పెంపకం కూడా గణనీయంగా తగ్గుతోంది. పశుగ్రాసాల ఉత్పత్తికి కూడా భూమి లభ్యత క్రమంగా తగ్గిపోతోంది. ప్రస్తుతం ఉన్న హైబ్రిడ్ గ్రాసాలు చలికాలంలో పెరుగుదల లేకపోవడం, తక్కువ పోషక విలువలు ఉండడం వల్ల పశు పోషకులను ఆదుకోలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాడి పోషణ ఖర్చులను తగ్గించి, అధిక దిగుబడి, అత్యధిక పోషక విలువలు కలిగిన కొత్త రకం పశుగ్రాసాన్ని కృష్ణాజిల్లా గన్నవరంలోని ఎన్టీఆర్ పశువైద్య కళాశాలకు చెందిన పశుగణ క్షేత్ర సముదాయం అందుబాటులోకి తీసుకొచ్చింది. థాయ్‌లాండ్ దేశంలో అభివృద్ధి చేసిన 'సూపర్ నేపియర్' పేరుతో పిలిచే ఈ పశుగ్రాసం మంచి ఫలితాలను ఇస్తోంది. చలికాలంలో కూడా పెరగడం ఈ సూపర్ నేపియర్ ప్రత్యేకత. ఈ గ్రాసంలో 10 నుండి 12 శాతం మాంసకృత్తులు, 28 నుంచి 30 శాతం పీచు పదార్థం, 50 నుంచి 55 శాతం జీర్ణమయ్యే పదార్థాలు ఉన్నాయి. దీనివల్ల పాల దిగుబడులు కూడా గణనీయంగా పెరగడం వల్ల సూపర్ నేపియర్ పశుగ్రాసానికి ఏపీ, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో డిమాండ్ గణనీయంగా పెరిగింది.

సాగు విధానం..

ఈ పశుగ్రాసం చౌడు నేలల్లో తప్ప ఆరుతడి కలిగిన అన్ని రకాల భూముల్లో పెరుగుతుంది. దీనిని మిగిలిన హైబ్రిడ్ నేపియర్ గ్రాసాల్లాగే పెంచవచ్చు. తొలుత దుక్కిలో పది టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల చొప్పున నత్రజని, సూపర్ ఫాస్పేట్, పది కిలోల పొటాష్ వేయాలి. భూమిని మొత్తగా దున్నిన తర్వాత ప్రతి మూడు అడుగులకు ఒక బోదెను ఏర్పాటు చేసుకోవాలి. ఈ గ్రాసం పెంచేందుకు ప్రతి ఎకరానికి పది వేల కాండపు కణుపులు లేనిపక్షంలో వేరు పిలకలు అవసరమవుతాయి. భూమికి ఆరుతడి పెట్టిన తర్వాత ప్రతి మూడు అడుగులకు ఒక కణుపును ఏటవాలుగా ఒక నోడు భూమిలోకి, మరో నోడు భూమి మీద ఉండేలా గుచ్చాలి. ప్రతి కణుపుకు రెండు నోడ్స్ తప్పనిసరిగా ఉండాలి. నాటిన నాలుగు రోజుల్లోనే భూమి లోపల కణుపు నుంచి వేర్లు, భూమిపైన కణుపు నుంచి ఆకులు వస్తాయి. ముఖ్యంగా నేపియర్ గడ్డి మొదళ్ల వద్ద కలుపు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. దీనివల్ల గడ్డి త్వరగా దుబ్బులు కట్టడంతో పాటు ఏపుగా పెరుగుతుంది. మొదటి కోత వరకు అంతర పంటగా అలసంద, జనుము వంటివి వేసుకోవచ్చు.

యాజమాన్య పద్ధతులు..

సూపర్ నేపియర్ నాటిన తర్వాత మూడు వారాలకు నత్రజని ఎరువులు పైపాటుగా వేస్తే గడ్డి త్వరగా పెరుగుతుంది. ప్రతి 10 నుంచి 15 రోజులకు ఒకసారి నీటితడి పెట్టాలి. ఈ విధంగా జాగ్రత్తలు తీసుకుంటే రెండు నెలలకు మొదటి కోత కొస్తుంది. అనంతరం ప్రతి 35 నుండి 40 రోజులకు ఒకసారి కోతలు వస్తాయి. ఈ విధంగా ఏడాదికి ఎనిమిది కోతలు వస్తాయి. ఎరువుల యాజమాన్యం జాగ్రత్తగా పాటిస్తే గడ్డి దిగుబడి ఎక్కువగా ఉండి ఏటా ఎకరానికి 200 టన్నులకు పైగా పశుగ్రాసం లభిస్తుంది. సూపర్ నేపియర్ గడ్డి సుమారు 12 నుంచి 15 అడుగుల వరకు పెరుగుతుంది. దీని కోసం ప్రతికోతకు సుమారు 20 కిలోల నత్రజని వేయాలి, ప్రతి ఏడాది 10 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల సూపర్ ఫాస్పేట్, 10 కిలోల పొటాష్ ఎరువులను వేస్తూ ఉండాలి. ఒకసారి నాటిన గడ్డి జాగ్రత్తగా మధ్యలో దున్నుతూ, చచ్చు దుబ్బులు, కలుపు తీస్తూ పెంచితే సుమారు పదేళ్ల వరకు పశుగ్రాసాన్ని ఇస్తుంది.

చక్కెర పదార్థాలు ఎక్కువగా ఉంటాయి..

ఒక ఎకరం సూపర్ నేపియర్ పశుగ్రాసం ఉంటే సుమారు పది పాడి పశువులకు ఏడాది పొడవునా పశుగ్రాసాన్ని అందించవచ్చు. ఈ గడ్డిని తప్పనిసరిగా చాప్ కట్టర్‌తో చిన్న ముక్కలుగా కత్తిరించి పశువులకు వేయాలి. లేకుంటే పశువులు ఆకులను మాత్రమే తిని కాండంలోని పోషక పదార్థాలను వృథా చేస్తాయి. ముఖ్యంగా ఈ గడ్డిలో చక్కెర పదార్థాలు ఎక్కువగా ఉండడం వల్ల పశువులు ఇష్టంగా తింటాయి. కాయజాతి పశుగ్రాసాలైన అలసంద, పిల్లిపెసర, జనుము, ఉలవలను ఈ నేపియర్ గడ్డితో కలిపి మేపితే పశువుల్లో పాల దిగుబడు అధికంగా ఉంటుంది. ఈ గ్రాసం వల్ల దాణా ఖర్చులు కూడా గణనీయంగా తగ్గించవచ్చు. ఈ పశుగ్రాసంలో చక్కెర పదార్థాలు అధికంగా ఉండడం వల్ల గడ్డి ఎక్కువగా ఉన్నప్పుడు సైలేజి పద్ధతిలో నిలువ చేసుకోవచ్చు.

రాయితీపై సరఫరా...



సూపర్ నేపియర్ పశుగ్రాసం మేపు వల్ల పశుపోషణలో 60 శాతం ఖర్చులు తగ్గుతాయి. థాయ్‌లాండ్ నుంచి తీసుకువచ్చిన ఈ సూపర్ నేపియర్ గడ్డిని ఇక్కడ అభివృద్ధి చేసి రైతులకు 80 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నాం. ఇప్పటి వరకు ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్‌కు చెందిన 3,600 మంది రైతులకు సుమారు ఆరు కోట్లపైగా కణుపులను అందజేశాం. ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు 60 వేల ఎకరాల్లో ఈ గడ్డిని విస్తరించడానికి బోధన పశుగణ క్షేత్ర సముదాయం సహాయ పడింది.

– డాక్టర్ సిహెచ్. వెంకటశేషయ్య, పశుగణ క్షేత్ర సముదాయం విభాగాధిపతి

కనుల పండువగా నదీహారతి



మునేరులో నదీ హారతి ఇస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి మునేరులో నదీ హారతి కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను పల్లకీలో తీసుకెళ్లి మునేరులో ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంపై అలంకరించారు. అనంతరం ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు దంపతులు నదిలో గంగకు చీర, రవిక, పూలు, గాజులు వాయినం సమర్పించి నదీ హారతులు ఇచ్చారు. భక్తులు అరటి దొప్పల్లో ఒత్తులు వెలిగించి నదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ జి.ఉమాపతి, సూపరింటిండెంట్ సునీత, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని సర్‌విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్‌లో రెండు రోజుల పాటు జరిగిన 6వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. 25–29, 30–34, 35–39, 40–44, 45–49, 50–54, 55–59, 60–64, 65–69, 70–74, 75–79, 80 సంవత్సరాల పైబడిన వయసు విభాగాల్లో 50, 100, 200, 400 మీటర్ల ఫ్రీస్టయిల్, బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్ కేటగిరిల్లో స్త్రీ, పురుషులు తలపడ్డారు. ఆయా కేటగిరిల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులకు స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జి రాంబాబు, ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పి.గోవిందరాజులు, ఎ.వెంకటమోహన్‌రావు, సహాయ కార్యదర్శి ఎస్.సనత్ బహుమతులు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను జిల్లా అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, ఐ.రమేష్, సీనియర్ కోచ్‌లు ఎం.మాలాద్రి, కె.వి.మోహన్‌రాజా పర్యవేక్షించారు.

సెక్టోరియల్ అధికారుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం: కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ అమర్లపూడి శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి, ఎంఐఎస్ మరియు ప్లానింగ్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ మానటరింగ్ ఆఫీసర్(ఉర్దూ), అసిస్టెంట్ ఇంక్లూసివ్ ఎడ్యుకేష్ కో–ఆర్డినేటర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో లేదా డైట్ లెక్చరర్లు ఈ పోస్టులకు అర్హులన్నారు. అక్టోబర్31 నాటికి దరఖాస్తుదారుల వయస్సు 50 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 14 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం మచిలీపట్నంలోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గ్రహాల వీక్షణం.. ఆసక్తికరం



టెలిస్కోప్ ద్వారా గ్రహాలను వీక్షిస్తున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్ కాస్ట్) ఆధ్వర్యంలో విజయవాడ భవానీపురంలోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో సోమవారం రాత్రి స్కై వాచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఏర్పడబోయే చంద్ర గ్రహణాన్ని చూసేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాధాకృష్ణ, డాక్టర్ స్వాన్ (ఇంగ్లాండ్)ల నేతృత్వంలో మూడు టెలిస్కోప్‌ల ద్వారా జూపిటర్, శని, చంద్ర గ్రహాలతోపాటు జూపిటర్ గ్రహానికి అనుబంధంగా ఉండే నాలుగు గ్రహాలను చూపించారు. అలాగే ఉమ, పద్మావతి, మోహన్‌బాబులు ఖగోళంలో ఏర్పడిన ఈ గ్రహాలు, వాటి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అప్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై.అపర్ణ ఖగోళంలోని గ్రహాలను ఆసక్తిగా తిలకించారు. విశ్వంలో ఎన్నో రహస్యాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు నిరూపించారని అన్నారు. ముఖ్యంగా చంద్రుడు చుట్టూ సంచరించే గ్రహాలను టెలిస్కోప్ ద్వారా చూడగలగటం ఒక అనిర్వచనీయమైన అనుభూతి కలిగిస్తుందన్నారు. కాగా ఈ స్కై వాచ్ కార్యక్రమానికి స్థానిక డీఎస్ఎమ్ హైస్కూల్, నేతాజీ హైస్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అరుదుగా కనిపించే ఈ గ్రహాలను చూడటం ద్వారా సరి కొత్త అనుభూతిని పొందామని విద్యార్థులు తమ సంతృప్తిని వెల్లడించారు. స్టార్‌గేజర్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అప్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జేడీ రావు, ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ మైనం హుస్సేన్ పాల్గొన్నారు.

శతమానం భవతి



గడప గడపకు కార్యక్రమం 100 రోజులు పూర్తయిన సందర్భంగా బెలూన్లు ఎగుర వేస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించి సంక్షేమ పాలన అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా నగరంలోని మాచవరంలో బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

మన చుట్టూ పేరుకు పోతున్న
రకరకాల వ్యర్థాల నుంచే
కొత్త అర్థాలను వెతకచ్చు.
ఆ అర్థాల నుంచి ఆర్థికంగానూ
నిలదొక్కుకోవచ్చు.
ఇదే విషయాన్ని ఆచరణలో పెట్టి
చూపిస్తోంది ఢిల్లీ వాసి మీనాక్షి శర్మ.
ఫ్యాబ్రిక్ డిజైనింగ్‌లో కోర్సు చేస్తూనే...
విపరీతంగా పేరుకుపోతున్న
ఫ్యాబ్రిక్ వ్యర్థాల గురించీ ఆలోచించింది.
అంతటితో ఆగిపోకుండా
ఆ వ్యర్థాల నుంచే ఎంతోమందికి
ఉపయోగపడే వస్తువులను
తయారు చేయడం మొదలుపెట్టింది.
ఢిల్లీ చుట్టుపక్కల నుంచి నెలకు
200 కేజీల ఫ్యాబ్రిక్ వేస్ట్‌ను సేకరించి,
30 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.

వేస్ట్ నుంచి బెస్ట్


'యూజ్ మి వర్క్' ఫౌండర్ మీనాక్షి శర్మ

మెట్రో నగరాల్లో వాతావరణ పరిస్థితుల గురించి మనలో చాలామందికి ఎంతో కొంత అవగాహన ఉంది. కానీ, రకరకాల కాలుష్యాలని నివారించడం మాత్రం మనవంతు బాధ్యత అనుకోం. ఈ బాధ్యతా రాహిత్యం మనకే కాదు మన ముందుతరాలకూ నష్టమే అంటోంది ఢిల్లీలో అప్‌సైకింగ్ ప్రాజెక్ట్ 'యూజ్ మి వర్క్'ని విజయవంతంగా కొనసాగిస్తున్న మీనాక్షి శర్మ. కుతుబ్ మినార్ దగ్గర 450 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న తన క్రియేటివ్ స్టూడియోలో 30 మంది మహిళలు కుట్టుపని చేస్తూ కనిపిస్తారు. చుట్టుపక్కల ఫ్యాబ్రిక్ ఫ్యాక్టరీల నుంచి వచ్చిన వేస్ట్ క్లాత్స్ ఉన్న సంచులు నిండుగా కనిపిస్తుంటాయి. వాటిని చూపిస్తూ 34 ఏళ్ల మీనాక్షి శర్మ తన స్వీయానుభవాలను వివరిస్తుంటుంది.

'వనరులను గౌరవించడం ఎలాగో మా అమ్మానాన్నలను చూస్తూ పెరిగాను. పాత వస్తువులను తిరిగి మరో వాడుకోదగిన వస్తువుగా ఎలా మార్చే వారో వారిని చూసే నేర్చుకున్నాను. చదువుకోవడానికి జమ్మూ నుంచి ఢిల్లీ వచ్చిన నేను డిగ్రీలో ఫ్యాషన్ డిజైనింగ్ ఎంచుకున్నాను. ఆ సమయంలో ఫ్యాషన్ పరిశ్రమలో టన్నులకొద్దీ ఫ్యాబ్రిక్ వ్యర్థాలు మిగిలి పోతున్నాయని తెలుసుకున్నాను. 'ఆ వేస్టేజీని తిరిగి ఉపయోగంలోకి తేలేమా..?' అని ఆలోచించాను.


అలంకరణ వస్తువులు తయారుచేస్తున్న తన స్టూడియోలోని మహిళలతో...


వ్యర్థాలతో హెయిర్‌బ్యాండ్స్ తయారుచేసి, అలంకరించుకున్న మహిళలతో...


వర్క్‌షాప్స్‌కి వచ్చినవారితో హోమ్ డెకార్ ఐటమ్స్ తయారు చేయిస్తూ....

■ పేద మహిళలకు ఉపాధి

కాలేజీ పూర్తయ్యాక కెరియర్‌ని ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు ఏది సరైనది అని ఆలోచించి, వ్యర్థాల వైపుగా కదిలాను. ఇళ్లలో పనులు చేసేవారూ, చిన్న చిన్న కూలి పనులకు వెళ్లే మహిళలను కలిశాను. వారికి కుట్టుపనిలో శిక్షణ ఇచ్చి, డెకార్ ఐటమ్స్ చేయడం మొదలుపెట్టాను. క్లాత్ బ్యాగులు, ఇతర యాక్సెసరీస్, గృహాలంకరణకు ఉపయోగపడే వస్తువులు ఇక్కడ తయారవుతాయి. ముఖ్యంగా పుట్టిన రోజు, పండగ రోజుల్లో ఇంటి అలంకరణలో ఉపయోగించే ఐటమ్స్‌ని మహిళలు శ్రద్ధగా తయారు చేస్తారు. ఒక విధంగా చెప్పాలంటే యూజ్ అండ్ త్రో ఐటమ్స్‌ని ఈ క్లాత్ ఐటమ్స్ రీ ప్లేస్ చేస్తాయి. వీటివల్ల ఇక్కడి మహిళలకు నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఆదాయం వస్తుంద'ని వివరిస్తుంది మీనాక్షి శర్మ.

■ ఫ్యాక్టరీ టు వార్డ్రోబ్

వీరు తయారు చేసే వస్తువులలో ఫ్యాషన్ ఉపకరణాలు, అందమైన పూలతీగలు, కుషన్ కవర్లు, క్విల్ట్‌లు, బ్యాగులు, రగ్గులు.. వంటివి ఉంటాయి. 'వ్యర్థాలను సేకరించడం పెద్ద సవాల్' అంటారు మీనాక్షి. 'ఇళ్లు, ఫ్యాక్టరీలు, బొటిక్స్ నుంచి స్క్రాప్ అంతా డంప్ చేసే ప్రదేశాలకు చేరుకుంటుంది. మేం ఆ డంపింగ్ నుంచి ఈ వ్యర్థాలను సేకరిస్తాం. కొన్నిసార్లు ప్రజలే తమ పాత దుస్తులను మా స్టూడియోకి కొరియర్‌లో పంపుతారు. వాటిని బాగు చేసి, అప్‌సైక్లింగ్ ప్రక్రియను ప్రారంభిస్తాం' అని చెప్పే మీనాక్షి పదేళ్లుగా ఈ స్టూడియోని నిరంతరాయంగా నడుపుతోంది.

తన 'యూజ్ మి' స్టూడియో నుంచి వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తుంటుంది ఈ పర్యావరణ ప్రేమిక. ముఖ్యంగా పిల్లలకు వ్యర్థాలను ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పిస్తే 'వృథా అంటూ ఏదీ ఉండదని' గ్రహించి వారు జీవితమంతా ఆ విధానాలనే అవలంబిస్తారని తన వర్క్‌షాప్స్, ఆన్‌లైన్ క్లాసుల ద్వారా మరీ మరీ చెబుతుంది. మీనాక్షి చేస్తున్న ఈ ప్రయోగాత్మక వెంచర్‌కి అమెరికా, లండన్ తదితర దేశాల నుంచి కూడా ఆర్డర్లు వస్తుంటాయి. ఆలోచనతోపాటు ఆచరణలో పెట్టిన పని ఎంతమంది జీవితాల్లో వెలుగులు నింపుతుందో తన సృజనాత్మక విధానాల ద్వారా చూపుతుంది మీనాక్షిశర్మ.

సందర్భం

కొందరు అందరిలా ఉండరు....
'ఎందుకీ పక్షులు కొమ్మల్ని విడిచి పారిపోతున్నాయి ఆకాశాల బరువుల్ని మోసుకుంటూ?
ఎందుకీ చెట్లు ఇలా వలస పోతున్నాయి పువ్వుల భారాన్ని మోసుకుంటూ?
ఎవరైనా వాటి నేత్రాల్లో ఉన్న శోకసముద్రాలు గుర్తించారా? దేశపు గొంతులో ఉన్న ఆక్రోశం ఎవరైనా విన్నారా?' అంటూ దేశం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడతారు. అలాంటి వారిలో ఒకరు ఆశా సహాయ్. పదిహేడు సంవత్సరాల వయసులో దేశం కోసం యుద్ధక్షేత్రాల్లోకి వెళ్లింది...

ది వార్ డైరీ
- ఒక రణధీర కథ

జపాన్‌లోని కోబ్ నగరంలో జన్మించింది ఆశా సహాయ్. తండ్రి ఆనంద్ మోహన్ సహాయ్ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు రాజకీయ సలహాదారు. అంతకుముందు బాబూ రాజేంద్రప్రసాద్‌కు సెక్రెటరీగా పనిచేశాడు. బిహార్‌లోని భాగల్పూర్‌కు చెందిన ఆనంద్ మోహన్ ఆనాటి నిర్బంధ పరిస్థితుల్లో జపాన్‌కు వెళ్లాడు. అక్కడ బతుకుదెరువు కోసం జపాన్ పిల్లలకు ఇంగ్లీష్ బోధించేవాడు.

'దేశానికి దూరంగా ఉన్నా, మా నుంచి దేశం ఎప్పుడూ దూరంగా లేదు. నా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు రావాలని ఆబాల గోపాలం కోరుకునే రోజులవి' అంటున్న ఆశా సహాయ్ తల్లిదండ్రుల ద్వారా మాటలు, పాటల రూపంలో దేశభక్తిని ఆవాహన చేసుకుంది.



పదిహేడు సంవత్సరాల వయసులో నేతాజీ భారత జాతీయ సైన్యంలోని రాణీ ఝాన్సీ రెజిమెంట్‌లో చేరింది. జపాన్ నుంచి తైవాన్ అక్కడి నుంచి థాయిలాండ్ వరకు ప్రయాణించి రాణీ ఝాన్సీ రెజిమెంట్‌లోకి వెళ్లింది. రైఫిల్ హ్యాండ్లింగ్ నుంచి యాంటీ-ఎయిర్ క్రాఫ్టగన్స్ వరకు తొమ్మిది నెలల పాటు రకరకాల విద్యల్లో కఠినమైన శిక్షణ తీసుకుంది. గెరిల్లా యుద్ధతంత్రాలలో ఆరితేరింది. సింగపూర్, మలేసియా, బర్మా... యుద్ధక్షేత్రాల్లో పని చేసింది. తాగడానికి నీరు, తినడానికి తిండి దొరకని ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నో రోజులు బర్మా అడవుల్లో గడిపింది. తన పోరాట అనుభవాలను ఎప్పటికప్పుడు డైరీలో రాసుకునేది.

ఆశా సహాయ్‌ని సైనిక దుస్తుల్లో చూసిన రోజు తల్లి సతీ సహాయ్... 'నీ తల్లిదండ్రుల గురించి ఆలోచించవద్దు. ఇప్పుడు నువ్వు మా బిడ్డవి కాదు, భరతమాత బిడ్డవు' అని ఆశీర్వదించింది.

బెంగాల్‌కు చెందిన సతీ సహాయ్ ప్రఖ్యాత స్వాతంత్ర్య సమర యోధుడు చిత్తరంజన్‌దాస్‌కు సమీప బంధువు.

'బాంబుగాయాలతో బాధ పడుతున్నా సరే వెనకడుగు వేసే వాళ్లం కాదు' అని ఆ రోజులను గుర్తు చేసుకుంటుంది ఆశా సహాయ్.

తాను డైరీలో రాసుకున్న విషయాలను ప్రముఖ ప్రచురణ సంస్థ హార్పర్ కోలిన్స్ తాజాగా 'ది వార్ డైరీ ఆఫ్ ఆశా-సాన్: ఫ్రమ్ టోక్యో టు నేతాజీస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ' పేరుతో పుస్తకంగా ప్రచురించింది. పుస్తకాన్ని ఇంగ్లిష్‌లో ప్రచురించడం ఇదే తొలిసారి. ఆశా మునిమనవరాలు తన్వీ శ్రీవాస్తవ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. 'ఈ పుస్తకం చదువుతున్నప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాను. ఆ రోజుల్లో యువతరంలో ఉప్పొంగే దేశభక్తి భావాలు, చేసిన త్యాగాల గురించి తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఉపకరిస్తుంది. చావు అంచుల వరకు వెళ్లి వచ్చిన ఆశా ఏరోజూ వెనకడుగు వేయలేదు' అంటుంది తన్వీ శ్రీవాస్తవ.

'ఇది వ్యక్తిగత పుస్తకం కాదు. ఆ రోజుల్లోని పోరాటస్ఫూర్తికి అద్దం పట్టే పుస్తకం' అంటున్న 94 సంవత్సరాల ఆశా సహాయ్ తన కుమారుడితో కలిసి పట్నా (బిహార్)లో నివసిస్తోంది.



'ది వార్ డైరీ ఆఫ్ ఆశా-సాన్: ఫ్రమ్ టోక్యో టు నేతాజీస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ' పుస్తకం

సాగుబడి
విశాఖ కార్టె: నవంబర్ 7 నుంచి

ఇక సేంద్రియ సీవీడ్స్ సాగు!


● సీవీడ్స్ సాగయ్యే కృత్రిమ చెరువు
● సీవీడ్స్‌కు సీ ప్లాంట్స్, సీ వెజిటబుల్స్ అని పేరు
● ఉల్వా రకం సీవీడ్‌కు 'సముద్రపు పాలకూర' అని పేరు
● సేంద్రియ సీవీడ్స్ సాగు పద్ధతిని అభివృద్ధి చేసిన ఇజ్రేల్ కంపెనీ

సీవీడ్స్.. అంటే సముద్రపు నీటిలో పెరిగే నాచు వంటి మొక్కలు. వాటి విలువ తెలియని కాలంలో 'వీడ్స్' అని పిలిచి ఉంటారు. పౌష్టిక విలువేమిటో తెలిసిన తర్వాత ఇప్పుడు 'సీ ప్లాంట్స్' అని, 'సీ వెజిటబుల్స్' అంటూ నెత్తినపెట్టుకుంటున్నారు. ఆకు పచ్చగా ఉండే ఉల్వా రకం సీవీడ్‌ను 'సముద్రపు పాలకూర' అని కూడా పిలుస్తున్నారు. చైనా, జపాన్ తదితర ఆసియా దేశాల్లో తరతరాలుగా వీటిని సముద్రం నీటిలో సహజసిద్ధంగా పెరిగే సీవీడ్స్‌ను సేకరించి తినే అలవాటుంది. అమెరికా, కెనడాల్లో కొన్ని కంపెనీలు చెరువుల్లో పెంచటం ప్రారంభించాయి. ఇజ్రేల్ కంపెనీ మరో ముందడుగేసింది. సేంద్రియ సీ వెజిటబుల్స్ సాగు చేసే ప్రత్యేక సాంకేతికతను అభివృద్ధి చేసింది. ఆహారోత్పత్తులకు అదనపు పోషకాలు జోడించడానికి, ఔషధాల తయారీలో సీవీడ్స్‌ను విరివిగా వాడుతున్నారు.

సేంద్రియ సీ వీడ్స్ సాగు అంటే ఏమిటి? సీ వీడ్స్ సాధారణంగా సముద్రపు నీటిలో సహజ సిద్ధంగా పెరుగుతూ ఉంటాయి. వాతావరణ పరిస్థితులును బట్టి కొన్ని సీజన్లలోనే అందుబాటులో ఉంటాయి. కాలక్రమంలో వీటిని తీరం వెంబడి సముద్రపు నీటిలో కేజెస్‌లలో సాగు చేయటం ప్రారంభమైంది. తీరప్రాంతాల్లో నేలపై నిర్మించిన కృత్రిమ చెరువుల్లో సముద్రపు నీటిని తోడి సాగు చేయటం అమెరికా, కెనడా దేశాల్లోని తూర్పు తీరంలో కొన్ని కంపెనీలు ప్రారంభించాయి. ఇప్పుడు ఇజ్రేల్‌కు చెందిన 'సీకురా' అనే కంపెనీ మరో ముందుకు వేసి సేంద్రియ సీ వీడ్స్ సాగు చేయనారంభించటం విశేషం. సాధారణ సముద్ర జలాల్లో భారఖనిజాలు, ఇతర కాలుష్యాలు అంటకుండా సముద్ర గర్భం నుంచి శుద్ధమైన నీటిని తోడి తెచ్చి తీరానికి దగ్గర్లో నేలపై కృత్రిమ ఉప్పునీటి చెరువుల్లో సాగు చేసే విధానమే 'సేంద్రియ సీవీడ్స్ సాగు' పద్ధతి అని ఈ సంస్థ చెబుతోంది. నీటి ఉష్ణోగ్రతను, కాంతిని నియంత్రించడం ద్వారా ఏడాది పొడవునా సేంద్రియ సీవీడ్స్ సాగును నిరంతరాయంగా చేపట్టవచ్చని ఈ సంస్థ చెబుతోంది. పెరుగుతున్న జనాభాకు పౌష్టిక విలువలున్న ఆహారోత్పత్తులను అందించడానికి తగినంత పరిమాణంలో స్థిరమైన దిగుబడి పొందడానికి తమ సాంకేతికత ఉపకరిస్తుందని ఈ కంపెనీ చెప్తోంది.


సీవీడ్స్ మొదటి దశలో సాగయ్యేది ఈ ట్యాంకుల్లోనే

సీవీడ్స్ సాగులో 3 దశలు

సేంద్రియ సీవీడ్స్ సాగుకు సముద్రగర్భం నుంచి తోడిన నీటిని భారఖనిజాలు, ఇతర కలుషితాలు లేకుండా శుద్ధి చేసిన నీటిని వాడుతారు. సీవీడ్‌ల ముక్కలు వేస్తే కొద్ది రోజుల్లో అవి పెరుగుతాయి. పెరుగుదల క్రమంలో వయసును బట్టి 3 దశలుంటాయి. ఒక్కో దశకు వేర్వేరు చెరువుల వ్యవస్థను డిజైన్ చేశారు. సముద్రపు నీటిలోని సహజ పోషకాలు, బాక్టీరియా ఆధారంగా సీవీడ్స్ వేగంగా పెరుగుతాయి. సాగు పూర్తయి సీవీడ్స్‌ను పట్టుబడి చేసిన తర్వాత నీటిని ఆక్వా సాగుకు వాడొచ్చు లేదా తిరిగి సముద్రంలోకి వదిలేయవచ్చు. కాలుష్యం అనే మాటే ఉండదు అని నిపుణులు చెబుతున్నారు.

'బీచ్‌లో కాళ్ళకు చుట్టుకొని చికాకుపెట్టే వాటిగానే సీవీడ్స్‌ను ఇజ్రేల్ ప్రజలు భావించేవారు. తినడానికి పనికొచ్చేదని మొన్నటి వరకూ తెలీదు. ఇప్పుడు అది ఎంత ఆరోగ్యకరమైనదో, ఎంత రుచిగా ఉంటుందో గ్రహించారు అంటున్నారు ఓజ్. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ ఈ రెండు రకాల సీవీడ్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఓజ్ అంటున్నారు. సేంద్రియ సీవీడ్ సాగుపై మన శాస్త్రవేత్తలు దృష్టిపెడితే.. రొయ్యలు, చేపలు, స్పిరులినా మాదిరిగా చెరువుల్లో సీవీడ్స్ సేంద్రియ సాగు చేసి అమెరికా, కెనడా తదితర దేశాల్లో మార్కెట్లను భారత్ చేజిక్కించుకునే పరిస్థితులొస్తాయని ఆశించవచ్చు.


● ఉల్వా రకం సీ వీడ్


● గ్రేసిలేరియా

సముద్రపు పాలకూర.. ప్రొటీన్లు పుష్కలం

సీ వీడ్స్ రకాలు వేలాదిగా ఉంటాయి. వీటిలో ప్రొటీన్లు, ఇతర పోషకాలు ఎక్కువగా కలిగిఉండే రెండు రకాలను ఎంపిక చేసుకొని తాము సాగు చేస్తున్నామని సీకురా సీఈఓ ఓజ్ చెప్పారు. మాంసం (25 గ్రా.), చికెన్ (21.7 గ్రా.), కోడిగుడ్డు (12 గ్రా.)తో పోలిస్తే తాము సాగు చేసే ఉల్వా, గ్రేసిలేరియా రకాల సీవీడ్స్‌లో 32 గ్రాముల ప్రొటీన్ ఉంటుందన్నారు. ఉల్వా రకం పచ్చని ఆకుల మాదిరిగా ఆకుపచ్చని రంగులో ఉంటుంది. అందుకే దీన్ని 'సముద్రపు పాలకూర' అని కూడా పిలుస్తారు.

ఇక రెండోది గ్రేసిలేరియా. ఇది ముదురు ఎరుపు రంగు సున్నితమైన కాడలతో కూడిన మొక్క మాదిరిగా ఉంటుంది. వీటిని

ప్రొటీన్లు, ఖనిజాలు, విటమిన్లు వీటిల్లో ఏ మేరకున్నాయో నిర్ధారించడానికి కంపెనీ జన్యు పరీక్షలు నిర్వహించింది. డైటరీ ఫైబర్, మెగ్నీషియం, కాల్షియం, ముఖ్యంగా అధిక అయోడిన్ వీటిల్లో కాలే, చియా, స్పిరులినా వంటి ఇతర సూపర్ ఫుడ్స్‌లో కన్నా మిన్నగానే ఉన్నాయి. అయోడిన్ లోపం నేడు ప్రపంచంలోని ప్రధాన పోషకాహార లోపాల్లో ఒకటి. గాయిటర్, గర్భధారణ సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. ఈ సమస్యల నివారణలో అధిక పోషకాలున్న ఉల్వా, గ్రేసిలేరియా సీవీడ్స్ సేంద్రియ సాగుకు ప్రాధాన్యం ఉంది.

- పంతంగి రాంబాబు,
సాక్షి సాగుబడి డెస్క్

మిరప సాగులో నల్ల తామర పురుగు ఉధృతి 2021-22 రబీ సీజన్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లో నష్టం కలుగజేసింది. ఈ పురుగు శాస్త్రీయ నామం త్రిప్స్ పార్విస్పైనస్. ఈ పురుగు గత ఏడు సంవత్సరాలుగా మెల్లగా విస్తరిస్తూ 2021-22లో పంటకు తీవ్ర నష్టాన్ని కలుగచేసి చర్చనీయాంశమైనది. ఈ పురుగు ఏ పురుగుమందులకూ లొంగక ఎంతో నిరోధకత పెంపొందించుకొని శాస్త్రవేత్తలకు సవాలుగా నిలిచింది.



నల్ల తామర పురుగుల కట్టడికి సమగ్ర సస్యరక్షణ

రా వ స్వా ప్ర సం
NIPHM

నల్ల తామర ఆడ, మగ పురుగులను పరిమాణం, రంగు ఆధారంగా గుర్తించవచ్చు. సాధారణంగా ఆడ పురుగులు పెద్దగా నలుపు లేదా ముదురు కాఫీ/గోధుమ రంగులో ఉంటాయి. మగ పురుగులు చిన్నగా పసుపు రంగులో ఉంటాయి. ఈ పురుగులు పిల్ల దశలో ఆకుల ఉపరితలం నుంచి రసం పీల్చుతూ ఎదిగే కొలదీ ఆకు దిగువ భాగం, పూలపైకి చేరి నష్టపరచటం వలన పూత రాలిపోతుంది, కాయలు కాయవు. ఇవి ఏ పురుగుమందులకూ లొంగనంత నిరోధకతను సంతరించుకున్నాయి.



రైతు సోదరులందరూ ఈ క్రింద తెలిపిన సమగ్ర సస్యరక్షణ చర్యలు తప్పక పాటించాలి

1. క్రమం తప్పకుండా మిరప చేలను పర్యవేక్షిస్తూ ఎక్కడైనా నల్ల తామరపురుగుల తీవ్రత ఎక్కువగా ఉంటే ఆ భాగాలను కత్తిరించి నాశనం చేయాలి.

2. ఈ పురుగు మిరపనే కాక అనేక జాతి మొక్కలనూ ఆశిస్తుంది. ఎప్పటికప్పుడు కలుపును నివారించుకోవాలి.

3. ఈ పురుగులను సామూహికంగా చంపటం కోసం ఎకరాకు 25-30 నీలి జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా తల్లిపురుగులను, వాటిసంతతిని నివారించుకోవచ్చు.

4. వృక్ష సంబంధ కీటక నాశినులైన వేపనూనె 3% లీటరుకు 2 మి.లీ. లేదా వేప గింజల కషాయం 5% లేదా కానుగ నూనె 3 మి.లీ.లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వీటిని అవసరాన్ని అనుసరించి మార్చి మార్చి వాడుకోవచ్చు. నూనెలు ఎక్కువగా వాడితే మొక్క పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. వేపగింజల కషాయం 5%, వావిలాకు సారం 50-80 మి.లీ. /లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చు. రైతులు సొంతంగా తయారు చేసి సత్వరమే వాడుకుంటే మంచి ఫలితాలిస్తాయి.

5. సూక్ష్మజీవి ఆధారిత కీటక సంహారాలు బేరియా బసియానా 4 గ్రా./లీ. లేదా 4 మి.లీ./లీ. నీటికి, సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ ఎన్.బి.ఎ.ఐ.ఆర్., పి.ఎఫ్.డి.డబ్ల్యు.డి. 20 గ్రా/లీ., బాసిల్లస్ ఆల్బస్ 20 గ్రా/లీ. నీటికి కలిపి మొత్తం మొక్క, నేల తడిసేలా చల్లాలి.

6. మిత్రపురుగులైన నల్లి బదనికలు, ఆంతోకోరిడ్ బగ్స్ ఈ నల్ల తామర పురుగులను తిని వాటి ఉధృతిని తగ్గిస్తాయి. ఆంతోకోరిడ్ బగ్స్ జాతికి చెందిన బ్లాప్టోస్టేతస్ పాలిసన్స్‌ను హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐపిహెచ్‌ఎం సంస్థ ఒక పురుగును రూ. 2.5 చొప్పున విక్రయిస్తోంది. గత సంవత్సరం అనేక మంది సేంద్రియ రైతులు ఈ మిత్రపురుగులను ఉపయోగించి సంతృప్తికరమైన ఫలితాలు సాధించారు. ఈ ఏడాది కూడా కావాలని అడుగుతున్నారు.

ఈ మిత్రపురుగులు వాడే రైతు సోదరులు ముఖ్యంగా గుర్తుపెట్టుకోవలసిన విషయాలు.. 1. పురుగుమందులు ఈ మిత్రపురుగులను కూడా చంపగలవు. 2. ఈ మిత్రపురుగును పొలంలో విడుదల చేయడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాలి. చేను చుట్టూ, అంతర పంటగా అలసంద, మొక్కజొన్న, జొన్న వంటి పంటలను కొన్ని సాళ్లు విత్తుకోవటం ద్వారా మిత్రపురుగులను సంరక్షించుకోవచ్చు. మిరప : జొన్న/సజ్జ/మొక్కజొన్న : అలసంద పంటలను 10:3:1 నిష్పత్తిలో విత్తుకుంటే అవి మిత్రపురుగుల ఆవాసాలుగా ఉండి తద్వారా పంటను సంరక్షిస్తాయి. పంటను సంరక్షించుకోవడానికి నేలలో ఎకరానికి 200 కేజీల వేపపిండి, 500 కేజీల వర్మికంపోస్టును ముందస్తుగా వేయటం వల్ల మొక్కలు ఆరోగ్యంగా ఉండి నల్ల తామర పురుగులను సమర్థంగా నిరోధించగలుగుతాయి.

- డా. బి. శైలజ,
- డా. ఈడ్పుగంటి శ్రీలత
జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్.ఐ.పి.హెచ్.ఎం.)
రాజేంద్రనగర్ హైదరాబాద్.
ఫోన్: 040 2401 3346



సెమీఫైనల్లో సుమిత్

ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారత బాక్సర్లు సుమిత్ (75 కేజీలు), గోవింద్ (48 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ 3-2తో కాదమ్‌దువాన్ (థాయ్‌లాండ్)పై, గోవింద్ 5-0తో మన్సూర్ (జోర్డాన్)పై గెలుపొందారు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో సచిన్ (71 కేజీలు) 1-4తో అస్లాన్‌బెక్ (కజకిస్తాన్) చేతిలో... లక్ష్య చహర్ (80 కేజీలు) 0-5తో అస్లోనోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

భారత్‌తో మ్యాచ్‌కు మలాన్ సందేహం

భారత జట్టుతో గురువారం జరిగే టి20 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ డేవిడ్ మలాన్ బరిలోకి దిగడం సందేహంగా మారింది. శ్రీలంకతో శనివారం జరిగిన మ్యాచ్ సందర్భంగా మలాన్ ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. గతంలో టి20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న మలాన్ ఈ ప్రపంచకప్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడి 56 పరుగులు సాధించాడు. ఒకవేళ మలాన్ సెమీఫైనల్ మ్యాచ్ సమయానికి కోలుకోకపోతే అతని స్థానంలో ఇంగ్లండ్ తుది జట్టులో ఫిల్ సాల్ట్‌ను ఆడించే అవకాశముంది.



మరో ప్రపంచకప్ వచ్చేసింది!

నవంబర్ 20 నుంచి ఫుట్‌బాల్ విశ్వ సమరం • బరిలో 32 జట్లు • డిసెంబర్ 18న ఫైనల్

ప్రపంచపటంలో దిగువన పసిఫిక్ మహా సముద్రం పక్కన ఒక విశ్వ క్రీడా వినోదం చివరి దశకు చేరుకుంది. అది ముగిసిన సరిగ్గా వారం రోజులకే పశ్చిమాసియాలో అరేబియన్ ద్వీపకల్పం వద్ద మరో భారీ క్రీడా సంబరానికి తెర లేవనుంది. 16 జట్ల క్రికెట్ పోరు ముగియగానే క్రీడాభిమానుల కోసం 32 జట్ల ఫుట్‌బాల్ సమరానికి సర్వం సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో అభిమానులను ఉర్రూతలూగించే 'ఫిఫా' వరల్డ్ కప్ మళ్లీ వచ్చేసింది. గల్ఫ్ దేశం ఖతర్ తొలిసారి ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు వేదికగా మారింది. నవంబర్ 20న ఆతిథ్య జట్టు మ్యాచ్‌తోనే మొదలయ్యే మెగా టోర్నీ పోరు 29 రోజుల పాటు గోల్స్ గోలతో ఊపేయనుంది. ఈ నేపథ్యంలో 22వ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు సంబంధించిన కొన్ని విశేషాలు...

తొలి మ్యాచ్: ఖతర్ X ఈక్వెడార్

ఫార్మాట్: 32 జట్లను ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్లున్నాయి. ప్రతీ జట్టు తమ గ్రూప్‌లో మిగిలిన మూడు జట్లతో ఆడతాయి. ప్రతీ గ్రూప్ నుంచి రెండేసి జట్లు చొప్పున 16 టీమ్‌లు నాకౌట్ దశకు (ప్రిక్వార్టర్ ఫైనల్) అర్హత సాధిస్తాయి. ప్రిక్వార్టర్ దశలో ఎనిమిది గ్రూప్‌ల విజేతలు ఎనిమిది గ్రూప్‌ల రన్నరప్‌నే ఎదుర్కొంటాయి.

మొత్తం మ్యాచ్‌ల సంఖ్య: 64
(గ్రూప్ దశలో 48; నాకౌట్‌లో 16)

• 2022 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులు 2010 డిసెంబర్ 2వ తేదీన ఖతర్‌కు కేటాయిస్తున్నట్లు



అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ప్రకటించింది. 2022 ప్రపంచకప్ ఆతిథ్యం కోసం మొత్తం ఐదు దేశాలు (ఖతర్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, ఆస్ట్రేలియా) పోటీపడ్డాయి. 22 మంది సభ్యులతో కూడిన 'ఫిఫా' ఎగ్జిక్యూటివ్ కమిటీ ఓటింగ్ ద్వారా ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసింది. ఓటింగ్ రౌండ్-1లో ఆస్ట్రేలియా... రౌండ్-2లో జపాన్.. రౌండ్-3లో దక్షిణ కొరియా... ఓటింగ్ రౌండ్-4లో అమెరికా నిష్క్రమించాయి.

• 92 ఏళ్ల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో ఖతర్ జట్టు తొలిసారి ఆడుతోంది. గతంలో ఏనాడూ ఖతర్ జట్టు ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేదు. ఆతిథ్య దేశం హోదాలో ఖతర్‌కు నేరుగా టోర్నీలో ఆడే అవకాశం లభించింది.

• ప్రపంచకప్‌లో పోటీపడుతున్న 32 జట్లలో ఖతర్ మినహా మిగతా 31 దేశాలు గతంలో కనీసం ఒక్కసారైనా ప్రపంచకప్ టోర్నీలో బరిలోకి దిగాయి. 2022 ప్రపంచకప్ కోసం 2019 జూన్ 6 నుంచి 2022 జూన్ 14 వరకు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరిగాయి. 2018 ప్రపంచకప్‌లో ఐస్‌లాండ్, పనామా అరంగేట్రం చేసినా ఈసారి మాత్రం కొత్త జట్లు అర్హత పొందలేకపోయాయి.

• ఇప్పటి వరకు జరిగిన అన్ని ప్రపంచకప్‌లలో ఆడిన ఏకైక జట్టుగా బ్రెజిల్ నిలిచింది. జర్మనీ (18 సార్లు) రెండో స్థానంలో, అర్జెంటీనా (13 సార్లు) మూడో స్థానంలో ఉన్నాయి.



స్వియాటెక్‌కు సబలెంకా షాక్


సబలెంకా


స్వియాటెక్

టెక్సాస్ (అమెరికా): ఈ ఏడాదిని మరో టైటిల్‌తో ముగించాలని ఆశించిన ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)కు నిరాశ ఎదురైంది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. బెలారస్ ప్లేయర్, ప్రపంచ ఏడో ర్యాంకర్ సబలెంకా 6-2, 2-6, 6-1తో స్వియాటెక్‌ను ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన స్వియాటెక్ సెమీస్‌లో మాత్రం సబలెంకా ధాటికి తడబడింది. ఈ ఏడాది స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తోపాటు మరో ఆరు టోర్నీలలో విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఈ సీజన్‌లో ఆమె 67 మ్యాచ్‌ల్లో గెలిచింది. మరో సెమీఫైనల్లో కరోలినా గార్సియా (ఫ్రాన్స్) 6-3, 6-2తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచి ఫైనల్లో సబలెంకాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది. సాకరి కూడా లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచి కీలకమైన సెమీఫైనల్లో ఓడిపోవడం గమనార్హం.

3 డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ (స్వియాటెక్), రెండో ర్యాంకర్ (ఆన్స్ జబర్), మూడో ర్యాంకర్ (జెస్సికా పెగూలా) క్రీడాకారిణులను ఓడించిన మూడో ప్లేయర్‌గా సబలెంకా నిలిచింది. గతంలో వీనస్ (2008లో), సెరెనా (2002లో) మాత్రమే ఈ ఘనత సాధించారు.

అమెలీ మౌరెస్మో, మేరీ పియర్స్ తర్వాత డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీలో ఫైనల్ చేరిన మూడో ఫ్రాన్స్ క్రీడాకారిణి గార్సియా. పియర్స్ (1997, 2005) రెండుసార్లు రన్నరప్‌తో సరిపెట్టుకోగా... మౌరెస్మో (2005లో) విజేతగా నిలిచింది. మళ్లీ 17 ఏళ్ల తర్వాత ఓ ఫ్రాన్స్ ప్లేయర్ ఫైనల్ ఆడనుంది.

గుణతిలకకు బెయిల్ తిరస్కరణ

సస్పెండ్ చేసిన లంక బోర్డు



సిడ్నీ: ఆస్ట్రేలియాలో రేప్ కేసులో అరెస్టయిన శ్రీలంక క్రికెటర్ దనుష్క గుణతిలకకు స్థానిక కోర్టులో చుక్కెదురైంది. అతనికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. అత్యాచారం కేసులో నిందితుడైన 31 ఏళ్ల క్రికెటర్‌పై శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్‌ఎల్‌సీ) సస్పెన్షన్ వేటు వేసింది. ఏ రకమైన క్రికెట్ (స్థాయి, ఫార్మాట్, లీగ్) ఆడకుండా నిషేధం విధించింది. తీవ్రమైన క్రిమినల్ నేరానికి పాల్పడిన అతనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని శ్రీలంక క్రీడాశాఖ ఆదేశించింది. ఆస్ట్రేలియా అధికారులకు సహకరిస్తామని ఎస్‌ఎల్‌సీ వర్గాలు తెలిపాయి. డౌనింగ్ సెంటర్ లోకల్ కోర్టు మెజిస్ట్రేట్ రాబర్ట్ విలియమ్స్ ముందు వర్చువల్ (వీడియో కాల్) పద్ధతిలో గుణతిలకను ప్రవేశపెట్టారు. అతని తరఫున లాయర్ ఆనంద అమరనాథ్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా మెజిస్ట్రేట్ తిరస్కరించారు. దీనిపై స్పందించిన లాయర్ ఆనంద అతిత్వరలోనే సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ వేస్తామన్నారు. టి20 ప్రపంచకప్ 'సూపర్ 12'లో నిష్క్రమించిన శ్రీలంక జట్టు స్వదేశానికి బయల్దేరే ముందు గుణతిలకను అరెస్టు చేయడంతో అతను మినహా మొత్తం జట్టు లంకకు పయనమైంది.

కోహ్లికి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు

దుబాయ్: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి గత నెలలో కనబరిచిన ప్రదర్శనకుగాను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న టి20 ప్రపంచకప్‌లో భారత క్రికెటర్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. పాకిస్తాన్‌పై అసాధారణ ఇన్నింగ్స్‌తో (82 నాటౌట్) జట్టును గెలిపించిన కోహ్లి... నెదర్లాండ్స్ (62 నాటౌట్), బంగ్లాదేశ్ (64 నాటౌట్)లపై కూడా అజేయ అర్ధసెంచరీలతో శివమెత్తాడు. దక్షిణాఫ్రికా (12)తో విఫలమైన కోహ్లి... జింబాబ్వేపై 26 పరుగులు చేశాడు. దీంతో కోహ్లితో పాటు అవార్డు రేసులో మిల్లర్ (దక్షిణాఫ్రికా), సికందర్ రజా (జింబాబ్వే) ఉన్నప్పటికీ భారత ఆటగాడినే 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' వరించింది. నెలవారీ ప్రదర్శనకిచ్చే అవార్డు అతనికిదే తొలిసారి. 'అక్టోబర్ నెలకు సంబంధించిన అవార్డు నాకు రావడం ఆనందంగా ఉంది. నాకు ఓటేసిన క్రికెట్ అభిమానులు, ప్యానెల్ సభ్యులకు ధన్యవాదాలు' అని కోహ్లి తెలిపినట్లు ఐసీసీ వెల్లడించింది. మహిళా క్రికెటర్లలో పాకిస్తాన్ వెటరన్ ఆల్‌రౌండర్ నిదా దార్ ఈ అవార్డుకు ఎంపికయింది. ఆమెతో భారత ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ పోటీపడ్డారు. అయితే ఆసియా కప్ టోర్నీలో నిలకడగా రాణించిన పాకిస్తాన్ ఆల్‌రౌండర్‌కే ఈ అవార్డు లభించింది.

5 ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు సాధించిన ఐదో భారతీయ క్రికెటర్ కోహ్లి. గతంలో రిషభ్ పంత్, అశ్విన్, భువనేశ్వర్ కుమార్, శ్రేయస్ అయ్యర్ ఈ ఘనత సాధించారు.



ఈనెల 11 నుంచి చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ ఇండోర్ స్టేడియంలో ఆలిండియా బిలో 1600 ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ జరగనుంది. విజేతకు రూ. 35 వేలు... రెండో స్థానంలో నిలిచిన వారికి రూ. 22,500... మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 11 వేలు అందజేస్తారు. స్పాట్ ఎంట్రీలను స్వీకరించరు. ఈ టోర్నీలో పాల్గొనాలనుకునేవారు 7337578899, 8338399299 ఫోన్ నంబర్లలో ఈనెల 9వ తేదీ లోపు తమ పేరు నమోదు చేసుకోవాలని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ కోరారు.

స్వర్ణ పతకం సాధిస్తే రూ. కోటీ 63 లక్షలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఉజ్బెకిస్తాన్ రాజధాని తాష్కెంట్‌లో జరగనున్న ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్ ప్రైజ్‌మనీని ప్రకటించారు. మే 1 నుంచి 14 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌ను మొత్తం 52 లక్షల డాలర్ల (రూ. 425 కోట్లు) ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్నామని సోమవారం ఇక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) అధ్యక్షుడు ఉమర్ క్రెమ్లెవ్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన బాక్సర్‌కు 2 లక్షల డాలర్లు (రూ. కోటీ 63 లక్షలు), రజతం నెగ్గిన బాక్సర్‌కు 1 లక్ష డాలర్లు (రూ. 81 లక్షలు), కాంస్యం సొంతం చేసుకున్న ఇద్దరు బాక్సర్లకు 50 వేల డాలర్ల (రూ. 40 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ ప్రాథమిక క్రీడాంశాల జాబితాలో బాక్సింగ్ లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన క్రెమ్లెవ్ ఒకవేళ ఒలింపిక్స్ నుంచి బాక్సింగ్‌ను తొలగిస్తే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

సినిమా



• నయనతార
• రాయ్‌లక్ష్మీ
• హన్సిక
• 'కరుంగాప్పియమ్' పోస్టర్

అందాల తారలు భయపెట్టడానికి రెడీ అవుతున్నారు. ఆ అందం వెనక ఎంత ట్రాజెడీ ఉండి ఉంటే.. భయపెట్టాలనుకుని ఉంటారో ఊహించవచ్చు. అలా భయపెట్టే కథలతో కొందరు కథానాయికలు ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. మరి ప్రేక్షకులు 'హో' అంటూ హడలిపోతారా చూడాలి. ఇక ఈ హారర్ స్టోరీలపై ఓ లుక్ వేయండి.

హో అంటారా... హడలిపోతారా!

'మాయ', 'ఐరా', 'డోరా'... ఇలా వీలైనప్పుడల్లా వెండితెరపై ఆడియన్స్‌ని భయపెట్టారు హీరోయిన్ నయనతార. తాజాగా నయనతార గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన మరో హారర్ మూవీ 'కనెక్ట్'. నయనతారతో 2015లో 'మాయ' సినిమా తీసిన అశ్విన్ శరవణన్‌యే ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనుపమ్ ఖేర్, సత్యరాజ్ కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమాను త్వరలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు హారర్ జానర్‌పై హీరోయిన్ కాజల్ అగర్వాల్ స్పెషల్ ఫోకస్ పెట్టినట్లున్నారు. ఎందుకంటే ప్రస్తుతం కాజల్ డైరీలో మూడు హారర్ సినిమాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. కాజల్ ప్రధాన పాత్రధారిగా యోగిబాబు, దర్శక-నటుడు కేఎస్ రవి కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఘోస్టీ'. హారర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించగా, కల్యాణ్ దర్శకత్వం వహించారు. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదలైంది. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. అలాగే తమిళ దర్శకుడు డీకే దర్శకత్వంలో 'కరుంగాప్పియమ్' అనే హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన సినిమాలో ఓ లీడ్ రోల్ చేశారు కాజల్ అగర్వాల్. కాజల్‌తో పాటు ఈ సినిమాలో రెజీనా, జనని, నోయిరికా, రజియా విల్సన్ నటించారు. ఈ చిత్రంలో కొన్ని అతీంద్రియ శక్తులు ఉన్న యువతి పాత్రలో కాజల్ కనిపిస్తారు. ఇక హారర్ జానర్‌లో వచ్చిన చిత్రాల్లో 'చంద్రముఖి' సినిమాను ప్రేక్షకులు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'చంద్రముఖి 2' రెడీ అవుతోంది. తొలి భాగానికి దర్శకత్వం వహించిన పి. వాసుయే మలి భాగానికి దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఫస్ట్ పార్ట్‌లో రజనీకాంత్ నటించగా, 'చంద్రముఖి 2'లో రాఘవా లారెన్స్ మెయిన్ లీడ్ చేస్తున్నారు. ఈ సినిమాలోని ఓ హీరోయిన్ పాత్రకు కాజల్ అగర్వాల్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. మరోవైపు వెండితెరపై ఇప్పటివరకు గ్లామరస్‌గా కనిపించిన హన్సిక కూడా హారర్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ మధ్య 'గార్డియన్' అనే హారర్ ఫిల్మ్‌కు హన్సిక సైన్ చేశారు. ఆల్రెడీ ఫస్ట్ లుక్ కూడా రిలీజైంది. శబరి-గురుశరవణన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అలాగే ఆర్. కన్నన్ అనే దర్శకుడు తెరకెక్కిస్తున్న హారర్ సినిమాలో కూడా హన్సిక నటిస్తున్నారు. మరో హీరోయిన్ రాయ్‌లక్ష్మీ 'సిండ్రెల్లా'గా ప్రేక్షకులను భయపెట్టేందుకు రెడీ అయ్యారు. వినో వెంకటేశ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో సాక్షీ అగర్వాల్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమాలో రాయ్‌లక్ష్మీ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కాగా.. 'రాజుగారి గది 2' తర్వాత సమంత మరోసారి ప్రేతాత్మగా కనిపించనున్నారని, ఈ సినిమాకు 'స్త్రీ' ఫేమ్ అమర్ కౌశిక్ దర్శకత్వం వహించనున్నారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇలా హారర్ బ్యాక్‌డ్రాప్‌లోనే మరికొందరు కథానాయికలు సినిమాలు చేస్తున్నారు.

ఆదిపురుష్ మరింత ఆలస్యం


• ప్రభాస్

సంక్రాంతి రేసు నుంచి 'ఆదిపురుష్' సినిమా తప్పుకుంది. ప్రభాస్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని సంక్రాంతికి జనవరి 12న విడుదల చేయాలనుకున్నారు. కానీ వచ్చే ఏడాది జూన్ 16కు వాయిదా వేస్తున్నట్లుగా సోమవారం అధికారికంగా ప్రకటించింది చిత్ర యూనిట్. ''ఆదిపురుష్' అనేది కేవలం సినిమాయే కాదు. ప్రభు శ్రీరాముడిపై మనకు ఉన్న భక్తికి ఓ ప్రతిబింబం. మన చరిత్ర, మన సంస్కృతి పట్ల మనకు ఉన్న అంకితభావానికి ఓ నిదర్శనం. విజువల్ పరంగా ప్రేక్షకులకు మరింత అద్భుతమైన అనుభూతిని కలిగించాలని ఈ సినిమా రిలీజ్‌ను వచ్చే ఏడాదికి వాయిదా వేశాం. భారతదేశం గర్వించేలా ఈ సినిమా ఉండాలని మేం నిర్ణయించుకున్నాం. ఇందుకు మీ (ప్రేక్షకులు) ప్రేమ, అభిమానుల సపోర్ట్ కావాలి'' అని ఈ చిత్రదర్శకుడు ఓం రౌత్ అన్నారు. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు.

షెఫ్ అన్విత


• అనుష్క

హీరోయిన్ అనుష్క శెట్టి గరిట పట్టారు. తన వంటలను కస్టమర్స్‌కి రుచి చూపించేందుకు షెఫ్‌గా మారారు. అయితే ఇది రియల్ లైఫ్‌లో కాదు.. ఆమె నటిస్తున్న తాజా చిత్రం కోసమే. నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి జంటగా 'రారా కృష్ణయ్య' ఫేమ్ పి. మహేష్ బాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో షెఫ్ అన్విత రవళి శెట్టిగా అనుష్క నటిస్తున్నారు. కాగా సోమవారం (నవంబర్ 7) అనుష్క బర్త్‌డేని పురస్కరించుకుని అన్విత రవళి శెట్టి క్యారెక్టర్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ''మా సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. వచ్చే ఏడాది విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

నీలాంటి వ్యక్తి నీకు ఎదురుపడితే!


• కల్యాణ్‌రామ్

'బింబిసార' వంటి హిట్ సినిమా తర్వాత కల్యాణ్ రామ్ నటిస్తున్న చిత్రం 'అమిగోస్'. రాజేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. కల్యాణ్ రామ్ కెరీర్‌లో 19వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'అమిగోస్' అనే టైటిల్‌ను ఖరారు చేయడంతో పాటు 2023 ఫిబ్రవరి 10న సినిమాని విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించి, పోస్టర్‌ని రిలీజ్ చేసింది. 'దె సే వెన్ యు మీట్ సమ్‌బడీ దట్ లుక్స్ జస్ట్ లైక్ యు, యు డై' (నీలాగే కనపడే ఇంకో వ్యక్తి నీకు ఎదురుపడితే నువ్వు చస్తావు) అనేది పోస్టర్‌పై క్యాప్షన్‌గా ఉంది. ఈ చిత్రానికి సంగీతం: గిబ్రాన్, కెమెరా: ఎస్. సౌందర్ రాజన్.

ఎప్పుడు కాల్ చేస్తావ్?


• అనిఖా

'మళ్లీ ఎప్పుడు కాల్ చేస్తావ్?, ఇంకోసారి చెయ్యాలంటే ఇప్పుడు కాల్ కట్ చెయ్యాలిగా!', 'మాటింటే మనిషిని చూడాలనిపించాలి.. మాట్లాడుతుంటే పాట ఇంటున్నట్టుండాలి' వంటి డైలాగులు 'బుట్ట బొమ్మ' టీజర్‌లో ఉన్నాయి. అనిఖా సురేంద్రన్ హీరోయిన్‌గా, అర్జున్ దాస్, సూర్య వశిష్ట హీరోలుగా శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బుట్ట బొమ్మ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై నాగవంశీ ఎస్.-సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ బర్త్‌డేని (నవంబరు7) పురస్కరించుకుని 'బుట్ట బొమ్మ' టీజర్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ చిత్రానికి కెమెరా: వంశీ పచ్చిపులుసు, సంగీతం: గోపీసుందర్.

నేను ఎవరు... సస్పెన్స్


• సాక్షి చౌదరి

దివంగత ప్రముఖ ఎడిటర్ కోలా భాస్కర్ తనయుడు కోలా బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'నేనెవరు'. సాక్షి చౌదరి హీరోయిన్‌గా, తనిష్క్ రాజన్, గీత్ షా సహాయ పాత్రల్లో, బాహుబలి ప్రభాకర్ విలన్‌గా నటించారు. నిర్భయ్ పల్నాటి దర్శకత్వంలో భీమినేని శివప్రసాద్, తన్నీరు రాంబాబు నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ''మంచి లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు దర్శక-నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: ఆర్.జి.సారథి, సహ నిర్మాతలు: పూనమ్ చంద్-కుమావత్, కిరణ్ కుమార్ మోటూరి.

చిలిపి వరాలే ఇవ్వు


• కృతీ సనన్
వరుణ్

వరుణ్ ధావన్, కృతీ సనన్ జంటగా అమర్ కౌశిక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భేదియా'. దినేష్ విజన్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళంలో ఈ నెల 25న విడుదలకానుంది. నిర్మాత అల్లు అరవింద్ 'భేదియా'ని తెలుగులో గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా రిలీజ్ చేస్తున్నారు. సచిన్ జిగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చిలిపి వరాలే ఇవ్వు..' అంటూ సాగే వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. అమితాబ్ భట్టాచార్య-యనమండ్ర రామకృష్ణ సాహిత్యం అందించిన ఈ పాటని కార్తీక్ పాడారు. ''హారర్, కామెడీ చిత్రమిది. 'చిలిపి వరాలే ఇవ్వు..' పాట చాలా బాగుంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
8-11-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
235	86
61,185	18,203

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,486	▲	11
డోజోన్స్	32,684	▲	281
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,300	▽	35
డాక్స్	13,534	▲	74
షాంఘై	3,078	▲	7
నికాయ్	27,524	▲	328

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	50,958
బంగారం (99.5 స్వచ్ఛత)	50,754
వెండి (కేజీ)	60,245

ఐపీవోల సందడే సందడి

- ఈ వారం మరో 4 కంపెనీలు రెడీ
- రూ. 5,000 కోట్ల సమీకరణకు సై
- 9–11 మధ్య పబ్లిక్ ఇష్యూలు షురూ

న్యూఢిల్లీ: ప్రైమరీ మార్కెట్లు మరోసారి సందడి చేయనున్నాయి. గత వారం నాలుగు కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకురాగా.. ఈ వారం సైతం ఇదే సంఖ్యలో ఐపీవోలు వెలువడనున్నాయి. తద్వారా ఉమ్మడిగా రూ. 5,000 కోట్లకుపైగా సమీకరించనున్నాయి. తాజా జాబితాలో ఆర్కియన్ కెమికల్స్, ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్, కేన్స్ టెక్నాలజీ ఇండియా, ఐనాక్స్ గ్రీన్ ఎనర్జీ సర్వీసెస్ చేరాయి. గత వారం వెలువడిన నాలుగు ఇష్యూలలో బికాజీ ఫుడ్స్ (22 రెట్లు అధిక స్పందన), గ్లోబల్ హెల్త్ (10 రెట్లు సబ్‌స్క్రిప్షన్) సోమవారం(7న) ముగిశాయి. ఈ బాటలో ఆర్కియన్, ఫైవ్‌స్టార్ ఇష్యూలు 9న,



కేన్స్ టెక్ 10న, ఐనాక్స్ గ్రీన్ 11న ప్రారంభం కానున్నాయి. 2022లో ఇప్పటివరకూ 26 కంపెనీలు ఐపీవోల ద్వారా రూ. 48,000 కోట్లను సమకూర్చుకున్న సంగతి తెలిసిందే.

ఆర్కియన్ కెమ్

స్పెషాలిటీ మెరైన్ రసాయనాల తయారీ కంపెనీ ఆర్కియన్ కెమికల్స్ రూ. 386–407 ధరల శ్రేణిలో ఐపీవో చేపట్టనుంది. 11న ముగియనున్న ఇష్యూలో భాగంగా రూ. 805 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.61 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. తద్వారా రూ. 1,462 కోట్లకు పైగా సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధులను కంపెనీ జారీ చేసిన ఎన్‌సీడీల చెల్లింపునకు వినియోగించనుంది.

ఫైవ్ స్టార్ బిజినెస్

ఎన్‌బీఎఫ్‌సీ.. ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ ఐపీవోకు రూ. 450–474 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు రూ. 1,960 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీలో టీపీజీ, మ్యాట్రిక్స్ పార్టనర్స్, నార్వెస్ట్ వెంచర్స్, సీక్వోయా, కేకేఆర్ తదితర దిగ్గజాలు ఇన్వెస్ట్ చేశాయి.

కేన్స్ టెక్నాలజీ

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సొల్యూషన్స్ ఆధారిత సమీకృత ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ కేన్స్ టెక్నాలజీ ఐపీవోకు రూ. 559–587 ధరల శ్రేణిని ప్రకటించింది. ఈ నెల 14న ముగియనున్న ఇష్యూలో భాగంగా రూ. 530 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. మరో 55.85 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 850 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, విస్తరణకు వినియోగించనుంది.

ఐనాక్స్ గ్రీన్

పవన విద్యుత్ దిగ్గజం ఐనాక్స్ విండ్ గ్రూప్ కంపెనీ ఐనాక్స్ గ్రీన్ ఐపీవోకు రూ. 61–65 ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ నెల 15న ముగియనున్న ఇష్యూలో భాగంగా రూ. 370 కోట్ల ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. ఇంతే విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ ఐనాక్స్ విండ్ ఆఫర్ చేయనుంది. తద్వారా రూ. 740 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

సోనాలిక ట్రాక్టర్ అమ్మకాల జోరు




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పండుగ సీజన్ నేపథ్యంలో సోనాలిక ట్రాక్టర్స్ అక్టోబర్‌లో 20,000 ట్రాక్టర్లను విక్రయించింది. పరిశ్రమ వర్గాలు అంచనా వేసిన 7% అమ్మకాల వృద్ధిని అధిగమించి ఏకంగా 16 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కంపెనీ తెలిపింది. ఒక నెలలో తమకు ఇవే అత్యధిక అమ్మకాలని కంపెనీ జాయింట్ ఎండీ రమణ్ మిట్టల్ తెలిపారు. తమ ట్రాక్టర్ల తయారీలో అత్యాధునిక సాంకేతికత వినియోగిస్తున్నందున రైతుల నుంచి తమ బ్రాండ్‌కు విశేషమైన ఆదరణ లభిస్తుందని రమణ్ అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-11-2022	
విశాఖ	505–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	504–00
విజయవాడ	504–00
రిటైల్ ధర (డజను)	78.00
7-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

పది నెలల గరిష్టానికి సూచీలు

- 18,200 స్థాయి పైకి నిఫ్టీ
- మళ్లీ 61వేలు దాటిన సెన్సెక్స్
- ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు
- కలిసొచ్చిన రూపాయి ర్యాలీ, ఎఫ్ఐఐల కొనుగోళ్లు
- గురునానక్ జయంతి సందర్భంగా నేడు ఎక్స్చేంజీలకు సెలవు



ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి ర్యాలీ, విదేశీ కొనుగోళ్లు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. బ్యాంకింగ్, మెటల్, ఆటో మెటల్ షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించింది. సెన్సెక్స్ ఉదయం 238 పాయింట్ల లాభంతో 61,188 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 61,401 – 60,714 మధ్య కదలాడింది. చివరికి 235 పాయింట్లు పెరిగి 61,185 వద్ద ముగిసింది. నిఫ్టీ 95 పాయింట్ల లాభంతో 18,212 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 18,065 వద్ద కనిష్టాన్ని, 18,256 వద్ద గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సరికి నిఫ్టీ 86 పాయింట్లు బలపడి 18,203 వద్ద నిలిచింది. వెరసి ఇరు సూచీలు పదినెలల గరిష్టంపై స్థిరపడ్డాయి. ఫార్మా, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1949 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.844 కోట్ల షేర్లను అమ్మారు. కేంద్ర బ్యాంకులు అంచనాల కంటే ముందుగానే వడ్డీరేట్లను తగ్గించవచ్చనే ఆశలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

గురునానక్ జయంతి సందర్భంగా (నేడు)మంగళవారం బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈ ఎక్స్చేంజీలు పనిచేయవు.

నెల గరిష్టానికి రూపాయి

దేశీయ కరెన్సీ రూపాయి సోమవారం నెలరోజుల గరిష్టంపై ముగిసింది. డాలర్ మారకంలో సోమవారం ఒక్కరోజే 43 పైసలు బలపడి 81.92 వద్ద స్థిరపడింది. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 82.14 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 82.32 వద్ద కనిష్టాన్ని తాకింది. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడుతుండటం, దేశీయ క్యాపిటల్ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడులు మళ్లీ పెరుగుతుండటం వంటి అంశాలు రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయని ఫారెక్స్ విశ్లేషకులు తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెప్టెంబర్ త్రైమాసికంలో బ్యాంక్ చరిత్రలోనే అత్యధిక నికర లాభం(రూ.13,265 కోట్లు) ఆర్జించడంతో ఎస్‌బీఐ షేరు ఇంట్రాడేలో 5% ర్యాలీ చేసి రూ.623 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 3% లాభంతో రూ.614 వద్ద నిలిచింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.18,250.83 కోట్లు పెరిగింది
- చివరి రోజు నాటికి గ్లోబల్ హెల్త్ లిమిటెడ్ ఐపీవోకు 9.58 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా మొత్తం 44.79 కోట్ల షేర్లను జారీ చేయగా.., 4.67 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్ ఐపీఓకు 26.67 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా మొత్తం 2.06 కోట్ల షేర్లను జారీ చేయగా.., 55.04 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

కోల్ ఇండియా లాభం రెట్టింపు

- క్యూ2లో రూ. 6,044 కోట్లు
- షేరుకి రూ. 15 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం కోల్ ఇండియా ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 106 శాతం దూసుకెళ్లి రూ. 6,044 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 2,933 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 15 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇక ఈ కాలంలో మొత్తం ఆదాయం రూ. 23,291 కోట్ల నుంచి రూ. 29,838 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 20,425 కోట్ల నుంచి రూ. 23,770 కోట్లకు పెరిగాయి.

ఉత్పత్తి అప్

క్యూ2లో కోల్ ఇండియా బొగ్గు ఉత్పత్తి 125.84 మిలియన్ టన్నుల నుంచి 139.23 ఎంటీకి పుంజుకుంది. విక్రయాలు 147.43 ఎంటీ నుంచి 154.53 ఎంటీకి వృద్ధి చూపాయి. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిలో 80% గల ఈ మహారత్న కంపెనీ ఈ ఏడాది 70 కోట్ల టన్నుల ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా.. కంపెనీ 2025–26కల్లా 100 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అందుకోగలదని సంబంధిత శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఇప్పటికే పేర్కొనడం గమనార్హం!

ఫలితాల నేపథ్యంలో కోల్ ఇండియా షేరు 1.4 శాతం పుంజుకుని రూ. 250 వద్ద ముగిసింది.

పేటీఎమ్ నష్టాలు పెరిగాయ్

క్యూ2లో రూ. 594 కోట్లు



బెంగళూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో డిజిటల్ చెల్లింపుల దేశీ కంపెనీ వన్ 97 కమ్యూనికేషన్స్(పేటీఎమ్) ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నష్టాలు పెరిగి రూ. 594 కోట్లను తాకాయి. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 481 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం 76 శాతం జంప్‌చేసి రూ. 1,914 కోట్లను తాకింది. గత క్యూ2లో కేవలం రూ. 1,086 కోట్ల టర్నోవర్ సాధించింది. ఆదాయంలో 18% వాటాను ఆక్రమిస్తున్న ఫైనాన్షియల్ సర్వీసులు, ఇతర బిజినెస్‌ల నుంచి 293 శాతం అధికంగా రూ. 349 కోట్లు సమకూరినట్లు కంపెనీ తెలియజేసింది. రుణదాత భాగస్వాముల ద్వారా మొత్తం రూ. 7,313 కోట్ల రుణాలందించినట్లు వెల్లడించింది. ఇది 482 శాతం వృద్ధిగా తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో పేటీఎమ్ షేరు స్వల్పంగా లాభపడి రూ. 652 వద్ద ముగిసింది.

మోల్డ్‌టెక్ మెరుగైన ఫలితాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ కంపెనీ మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ సెప్టెంబర్ త్రైమాసికం స్టాండలోన్ ఫలితాల్లో నికరలాభం 10.4 శాతం వృద్ధితో రూ.19.4 కోట్లు సాధించింది. ఎబిటా 6.15 శాతం ఎగసి రూ.34.24 కోట్లుగా ఉంది. టర్నోవర్ 14.4 శాతం అధికమై రూ.182.5 కోట్లు పొందింది. 2022–23లో కొత్త యూనిట్లు, ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు రూ.50 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.75 కోట్లు వ్యయం చేయనున్నట్టు సంస్థ సీఎండీ జె.లక్ష్మణ రావు తెలిపారు. 'ఆదిత్య బిర్లా గ్రూప్ కోసం రూ.30 కోట్లతో హరియాణాలో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నాం. దామన్‌లో రెండవ ప్లాంటు స్థాపనకై స్థలం సేకరించాం' అని చెప్పారు.

దివీస్ లాభం 18 శాతం డౌన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ కంపెనీ దివీస్ ల్యాబొరేటరీస్ సెప్టెంబర్ క్వార్టర్‌లో నికర లాభం 18.6 శాతం తగ్గి రూ.493 కోట్లు దక్కించుకుంది. ఈపీఎస్ 18.56 శాతం తగ్గి రూ.18.6 నమోదైంది. టర్నోవర్ 3.6 శాతం పెరిగి రూ.1,934 కోట్లకు చేరుకుంది. ఏప్రిల్–సెప్టెంబర్‌లో టర్నోవర్ 7 శాతం పెరిగి రూ.4,277 కోట్లు, నికరలాభం 2.75 శాతం అధికమై రూ.1,195 కోట్లు దక్కించుకుంది. క్రితం ముగింపుతో పోలిస్తే దివీస్ షేరు ధర బీఎస్ఈలో సోమవారం 8.85 శాతం తగ్గి రూ.3,413.70 వద్ద స్థిరపడింది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐబీపీఎస్ ప్రభుత్వ బ్యాంకుల్లో 710 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్)..వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్(సీఆర్‌పీఎస్‌పీఎల్-XII)ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంబంధిత డిగ్రీ, పీజీ అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. మూడు దశల్లో ఎంపిక విధానం ఉంటుంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 710

» **పోస్టుల వివరాలు:** ఐటీ ఆఫీసర్(స్కేల్–1)–44, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్–1)–516, రాజ్‌భాష అధికారి(స్కేల్–1)–25, లా ఆఫీసర్(స్కేల్–1)–10,హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్–1)–15,మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్–1)–100.

» **వయసు:** 01.11.2022 నాటికి 20 నుంచి 30ఏళ్ల మధ్య ఉండాలి. » **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూ

» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** చీరాల, చిత్తూరు,గుంటూరు,కడప,కాకినాడ,కర్నూలు,నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి,విజయవాడ,విశాఖపట్నం,విజయనగరం,హైదరాబాద్,కరీంనగర్,ఖమ్మం,వరంగల్.

ముఖ్యమైన సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.11.2022
» అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్(ప్రిలిమినరీ పరీక్ష): డిసెంబర్ 2022
» ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేది: 24.12.2022, 31.12.2022.
» ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష తేది: 29.01.2023.
» వెబ్‌సైట్: www.ibps.in

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో 256 పోస్టులు

చండీగఢ్(పంజాబ్)లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్-రీసెర్చ్(పీజీఐఎంఈఆర్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన గ్రూప్ ఏ,బీ,సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 256

» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–01, నర్సింగ్ ఆఫీసర్–195, స్టోర్ కీపర్–01,జూనియర్ ల్యాబ్ టెక్నీషియన్–10, జూనియర్ టెక్నీషియన్(ఎక్స్–రే)–02, జూనియర్ స్పీచ్ థెరపిస్ట్–01, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్–02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్(ఎల్‌డీసీ)–37,సీఎస్ఆర్ అసిస్టెంట్ గ్రేడ్2–02,ల్యాబొరేటరీ అటెండెంట్ గ్రేడ్ 2–02, మానిఫోల్డ్ టెక్నీషియన్ గ్రేడ్4–02.

» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, 12వ తరగతి, ఎంబీబీఎస్, డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

» **వయసు:** ఏఏవో పోస్టులకు 18–40ఏళ్లు,నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు 18–35 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 18–30ఏళ్ల మధ్య ఉండాలి. » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.11.2022
» **వెబ్‌సైట్:** https://pgimer.edu.in

ఆర్మీలో మెటీరియల్ అసిస్టెంట్

జాబ్స్ ట్రీ

దేశ రక్షణ రంగానికి తమ సేవలను అందించాలనుకునే పట్టభద్రులకు చక్కటి అవకాశం! సికింద్రాబాద్‌లోని రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ రిక్రూట్‌మెంట్ సెల్, ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్.. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రీజియన్లలో మెటీరియల్ అసిస్టెంట్ ఖాళీల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేయాలి.

» **పోస్టులు:** మెటీరియల్ అసిస్టెంట్–419

» **అర్హతలు:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ లేదా డిప్లొమా ఇంజనీరింగ్/డిప్లొమా (మెటీరియల్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 18–27 ఏళ్ల మధ్య ఉండాలి. నిబంధనలను అనుసరించి రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

శారీరక దారుఢ్యం/స్కిల్‌టెస్ట్, రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుంది. ఎంపికైన వారిని ఆల్ ఇండియా సర్వీస్ ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

రాత పరీక్ష ఇలా

ఈ పరీక్ష మొత్తం 150 ప్రశ్నలకు–150 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు, న్యూమరిక్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–25 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌ల నుంచి 50మార్కులకు–50 ప్రశ్నల చొప్పున ఉంటాయి.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరి తేదీ: 12.11.2022
» వెబ్‌సైట్: www.aocrecruitment.gov.in

అంతర్జాతీయ అవకాశాలకు.. ఇంగ్లిష్!

ఇంగ్లిష్ లాంగ్వేజ్.. ఇంగ్లిష్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్! ఇప్పుడు.. జాబ్ మార్కెట్.. పోటీ పరీక్షలు.. స్టడీ అబ్రాడ్.. ఇలా ఎక్కడ చూసినా.. ఆంగ్ల భాష నైపుణ్యం కీలకంగా మారుతోంది. ముఖ్యంగా ఉద్యోగ నైపుణ్యాల్లో.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంస్థలు పెద్దపీట వేస్తున్నాయి! ఈ భాషలో ప్రావీణ్యం ఉంటే.. పోటీ ప్రపంచంలో ముందంజలో నిలిచే అవకాశం లభిస్తోంది! మొత్తంగా చూస్తే..ఇంగ్లిష్‌పై పట్టు లేనికారణంగా అవకాశాలు చేజార్చుకుంటున్న వారెందరో!! ఈ నేపథ్యంలో.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రాధాన్యం, ఆ భాషపై పట్టు సాధించేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..



» జాబ్ మార్కెట్‌లో కీలకంగా ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్
» సేల్స్ ఎగ్జిక్యూటివ్ నుంచి సీఈఓ వరకు ఇంగ్లిష్‌తో రాణింపు
» పోటీ పరీక్షల్లోనూ విజయానికి దోహదపడుతున్న ఆంగ్లం
» రిటెన్, స్పోకెన్ ఇంగ్లిష్ స్కిల్ పెంచుకోవాలంటున్న నిపుణులు

మన విద్యార్థుల్లో అకడమిక్ నాలెడ్జ్ ఉన్నప్పటికీ.. ఇంగ్లిష్‌లో కమ్యూనికేషన్ నైపుణ్యం లేనికారణంగా ఎంతో మంది విలువైన అవకాశాలను కోల్పోతున్నారు.ఇలాంటి విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే.. జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలవొచ్చు అంటున్నారు నిపుణులు. జాబ్ మార్కెట్‌తో పాటు పోటీ పరీక్షల్లో రాణించేందుకు, స్వయం ఉపాధికి, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌లో విజయావకాశాలకు సైతం ఇంగ్లిష్ నైపుణ్యం దోహదపడుతోంది.

25 శాతం మందిలోనే జాబ్ రెడీ స్కిల్స్

ప్రస్తుత కార్పొరేట్ రంగం, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ కోణంలో పరిశీలిస్తే.. 20 నుంచి 25 శాతం మందిలోనే జాబ్ రెడీ నైపుణ్యాలు ఉంటున్నాయని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్ కీలకంగా ఉంది. ఇంగ్లిష్ నైపుణ్యం సొంతం చేసుకుంటే.. దేశవిదేశాల్లో మెరుగైన అవకాశాలు లభిస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాఫ్ట్ స్కిల్స్, పీపుల్ స్కిల్స్, బిజినెస్ స్కిల్స్‌లో రాణించాలంటే..ఇంగ్లిష్ నైపుణ్యం తప్పనిసరి.

సేల్స్ టు సీఈఓ

ప్రస్తుత పరిస్థితుల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ వరకూ.. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం తప్పనిసరిగా మారింది. ముఖ్యంగా ఎంఎన్‌సీ సంస్థల్లో ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్.. క్లయింట్‌కు, సంస్థకు మధ్య ప్రధాన వారధిగా నిలుస్తోంది. దీంతో సేల్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, బీపీఓ,కాల్ సెంటర్ ఉద్యోగులకు ఇంగ్లిష్ నైపుణ్యం ఆవశ్యకంగా మారింది. ఉన్నత స్థాయిలో ఉన్న వారికి ఇంగ్లిష్ స్కిల్స్ మరింత కీలకం.

ఆ నాలుగు ప్రధానంగా

ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యంలో నాలుగు విభాగాలు కీలకంగా నిలుస్తున్నాయి. అవి...

- **స్పీకింగ్:**నచ్చిన అంశాన్ని ఎంచుకుని మాట్లాడటం.తొలిదశలో ఈ ప్రయోగం ఎంతో అవసరం.
- **రీడింగ్:** ఒక అంశాన్ని క్షుణ్నంగా చదవడం. దాని సారాంశాన్ని, అందులోని పద ప్రయోగాలను గుర్తించడం.
- **లిజనింగ్:** ఎదుటి వాళ్లు చెప్పేది లేదా ప్రసార మాధ్యమాల్లోని చర్చలను ఏకాగ్రతతో వినాలి. ఫలితంగా వారు ఏ అంశానికి సంబంధించి మాట్లాడుతున్నారో తెలుస్తుంది.
- **రైటింగ్:**చివరి దశగా చదివిన,విన్న విషయాలను సొంతంగా రాయడం అలవాటు చేసుకోవాలి.

పరీక్షలు కూడా ఈ విభాగాల్లోనే

ప్రస్తుతం అంతర్జాతీయంగా అమెరికా,బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో ప్రవేశాలకు ఇంగ్లిష్ ప్రావీణ్యం తప్పనిసరి. అందుకోసం విద్యార్థుల ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్‌ను గుర్తించే క్రమంలో టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, పీటీఈ, కేంబ్రిడ్జ్ ఇంగ్లిష్ అసెస్‌మెంట్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షలు..రిటెన్, స్పోకెన్, లిజనింగ్, రైటింగ్ విభాగాల్లోనే ఉంటున్నాయి. వీటిల్లో ప్రతిభ చూపితేనే అంతర్జాతీయంగా టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం లభిస్తుంది.

రాత పరీక్షల్లో ఇంగ్లిష్

ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షల్లో విజయం సాధించేందుకు రిటెన్ ఇంగ్లిష్ నైపుణ్యం అత్యంత కీలకంగా మారింది. దాదాపు అన్ని పోటీ పరీక్షల్లో ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అనే విభాగం ఉంటోంది. రిటెన్ ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే ఆయా పరీక్షల్లో ఎదురయ్యే రీడింగ్ కాంప్రహెన్షన్, వెర్బల్ ఎబిలిటీ వంటి అంశాల్లో మంచి మార్కులు సాధించే అవకాశముంది.

స్పోకెన్ స్కిల్

చాలా మంది ఇంగ్లిష్ రైటింగ్ లో పట్టున్నా.. స్పీకింగ్ విషయానికొచ్చే సరికి తడబడుతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రైటింగ్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్ కూడా ముఖ్యమే. కొద్దిపాటి చిట్కాలతో స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. అందుకోసం ముందుగా ఏదైనా ఒక టాపిక్‌ను ఎంచుకోవాలి. సదరు టాపిక్‌కు సంబంధించి అప్పటికే ప్రచురితమైన వ్యాసాలు, వార్తలు చదవాలి. అందులో వినియోగించిన పదజాలం, వాక్య నిర్మాణం పరిశీలించాలి. స్థూలంగా దాని సారాంశం తెలుసుకోవాలి. ఈ నాలుగు అంచెలు పూర్తయిన తర్వాత సదరు టాపిక్‌ను తమకు అనువైన రీతిలో పాయింట్ల రూపంలో రాసుకోవాలి. వీటిని ముందుగా స్నేహితులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడాలి. స్పోకెన్ ఇంగ్లిష్‌లో.. విషయాన్ని ఎదుటి వారికి సరిగా కమ్యూనికేట్ చేయగలుగుతున్నామా? లేదా? అనేదే ప్రధానమని గుర్తించాలి.

గ్రూప్ డిస్కషన్స్

స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకునేందుకు గ్రూప్ డిస్కషన్స్ చక్కటి సాధనంగా ఉపయోగపడుతుందని చెప్పొచ్చు. తొలి దశలో ఈ గ్రూప్ డిస్కషన్స్‌ను స్నేహితులతో ప్రారంభించాలి. ఫలితంగా సదరు డిస్కషన్‌లో మీకంటే బాగా మాట్లాడిన వాళ్లు ఎలా కమ్యూనికేట్ చేస్తున్నారో తెలుస్తుంది. వీటితోపాటు డిబేట్స్(చర్చలు)లో పాల్గొనడం కూడా మేలు చేస్తుంది. డిబేట్స్‌లో పాల్గొనడం ద్వారా పబ్లిక్ స్పీకింగ్ ఫోబియా సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుంది.

డిక్షనరీ ఆదరవుగా

ప్రారంభంలో ఇంగ్లిష్ నేర్చుకునేందుకు అత్యంత ఉపయోగకర సాధనాలు నిఘంటువు(డిక్షనరీ)లు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి డిక్షనరీల్లో ఒక పదానికి అర్థం తెలియజేయడంతోపాటు.. సదరు పదాన్ని ఏ సందర్భంలో వాడతారు? ఎలా మాట్లాడొచ్చు? అనే విషయాలు ఉంటాయి. అంతేకాకుండా.. సదరు పదాలకు సమానార్థాలు, వ్యతిరేకార్థాలు కూడా కనిపిస్తాయి.

వొకాబ్యులరీ.. వెరీ ఇంపార్టెంట్

స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యం కోణంలో వొకాబ్యులరీపై పట్టు సాధించడం ఎంతో అవసరం. ప్రతి రోజు కనీసం పది కొత్త పదాలు – వాటి అర్థాలు తెలుసుకోవడం తోపాటు వాటిని ఏఏ సందర్భాల్లో వాడొచ్చో గమనించాలి.

బేసిక్ గ్రామర్

ఇంగ్లిష్‌పై పట్టు సాధించే క్రమంలో.. బేసిక్ గ్రామర్(వ్యాకరణం)పై అవగాహన కీలకంగా నిలుస్తుంది. ప్రధానంగా టెన్సెస్, డైరెక్ట్–ఇండైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్–ప్యాసివ్ వాయిస్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఫలితంగా ఒక విషయాన్ని కమ్యూనికేట్ చేసే క్రమంలో చక్కటి నైపుణ్యం లభిస్తుంది.

స్కిల్స్ పెంచుకునేందుకు మార్గాలెన్నో

ప్రస్తుతం ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్య సాధనకు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. అకడమిక్ స్థాయిలోనే కాలేజీలు, యూనివర్సిటీల పరిధిలో ఫినిషింగ్ స్కూల్స్ పేరుతో, లేదా ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్లబ్‌ల పేరుతో ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పడుతున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వీటితోపాటు.. బ్రిటిష్ కౌన్సిల్, కేంబ్రిడ్జ్ ఇండియా వంటి ప్రముఖ సంస్థలు ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్‌కు సంబంధించి లెర్నర్ స్టేజ్ నుంచి దశల వారీగా శిక్షణనిస్తున్నాయి. వీటి ట్రైనింగ్ సదుపాయం ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. అంతేకాకుండా సదరు ట్రైనింగ్ వ్యవధి పూర్తయ్యాక నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్ కూడా ఇస్తున్నారు.

- వివరాలకు వెబ్‌సైట్స్:

https://www.britishcouncil.in/englis
https:/www.cambridgeenglish.org/in

ఇంగ్లిష్ స్కిల్.. ముఖ్యాంశాలు

- పలు నివేదికలు, సర్వేల ప్రకారం–నూటికి 60 శాతం మందిలో ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్ గ్యాప్ సమస్య ఉంది.
- సాఫ్ట్ స్కిల్స్‌లో రాణించేందుకు తొలి అడుగు ఇంగ్లిష్ నైపుణ్యం.
- ఇంగ్లిష్‌పై పట్టుతో మెరుగైన అవకాశాలు అందుకునేందుకు మార్గం.
- బ్రిటిష్ కౌన్సిల్ నివేదిక ప్రకారం–ఇంగ్లిష్ నైపుణ్యం ఉన్నవారికి ఇతరులతో పోల్చితే వేతనాలు ఎక్కువగా లభిస్తున్నాయి.
- సంస్థల్లో సెక్యూరిటీ విభాగం నుంచి సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ వరకు ఇంగ్లిష్ నైపుణ్యం తప్పనిసరి స్కిల్‌గా మారుతోంది.

బిడియం పోగొట్టుకోవాలి

ఇంగ్లిష్ విషయంలో చాలా మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య 'బిడియం', 'ఆత్మన్యూనత'. దీన్ని పోగొట్టుకునేందుకు కాలేజ్ స్థాయిలోనే కల్చరల్ క్లబ్స్, గ్రూప్ డిస్కషన్స్ వంటి వాటిలో చురుగ్గా పాల్గొనాలి. మొదట్లో పొరపాట్లు చేయడం సహజం. పొరపాట్లను విశ్లేషించుకుంటూ ముందుకు సాగితే.. ఇంగ్లిష్ నైపుణ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

– ప్రొ॥ ఎస్.జయరాజు, డీన్, ఫొనెటిక్స్ అండ్ స్పోకెన్ ఇంగ్లిష్, ఇఫ్లూ

క్లుప్తంగా

డిమాండ్ లేని కోర్సుల స్థానంలో కొత్త కోర్సులు

- ఎస్సీ గురుకులాల్లో ఎంఈసీ స్థానంలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు

సాక్షి, అమరావతి: ఎస్సీ గురుకులాల్లో విద్యార్థుల నుంచి డిమాండ్ లేని కోర్సుల స్థానంలో కొత్తవాటిని ప్రవేశపెట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎంఈసీ స్థానంలో ఎంపీసీ, బైపీసీ ప్రవేశపెట్టడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యకలాపాలపై రాష్ట్ర సచివాలయంలో సోమవారం మంత్రి మేరుగు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో మొత్తం 1.17 లక్షల సీట్లు ఉండగా వీటిలో ప్రస్తుతం 1.09 లక్షల సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. ఖాళీగా మిగిలిన సీట్లలో ఎక్కువగా ఇంటర్ సీట్లే ఉన్నాయన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీల్లోనే ఎక్కువమంది విద్యార్థులు చేరుతున్నారని తెలిపారు. దీంతో ఎంఈసీలో సీట్లు మిగిలిపోతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎంఈసీ స్థానంలో ఎంపీసీ, బైపీసీ సీట్లను ప్రవేశపెట్టాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే కొత్త కోర్సులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

11న స్పోర్ట్స్ కోటా ఉద్యోగ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య విభాగాల్లో క్రీడా కోటా కింద ఉద్యోగాల భర్తీకి సంబంధించి 11వ తేదీ ఉదయం 9గంటలకు స్పోర్ట్స్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఎంహెచ్‌వో ప్రకాశం, కృష్ణా, కర్నూలు, ఏపీవీపీ–అనంతపురం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ –పశ్చిమగోదావరి పరిధిలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఆయా జిల్లాల డీఎంహెచ్‌వో పంపిన జాబితాలోని అభ్యర్థుల సర్టిఫికెట్లను మాత్రమే పరిశీలిస్తామని తెలిపారు.

ఝాన్సీరాణికి నైటింగేల్ అవార్డు

- అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



సాక్షి, న్యూఢిల్లీ: నర్సింగ్ వృత్తి ద్వారా సమాజానికి విశేష సేవలందించిన విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రి స్టాఫ్ నర్సు మిరియాల ఝాన్సీ రాణి 2021 జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నర్సింగ్ ప్రొఫెషనల్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు. నర్సింగ్ వృత్తిలో ఝాన్సీ రాణి 25ఏళ్లుగా సేవలందిస్తున్నారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్, బ్లడ్ బ్యాంకింగ్, బేసిక్‌లైఫ్ సపోర్టు, అడ్వాన్స్ కార్డియాక్ లైఫ్ సపోర్టు, మెడికల్ ట్రాన్స్‌స్క్రిప్షన్ తదితర విభాగాల్లో సేవలందించడంతోపాటు నర్సింగ్ శిక్షణ కూడా ఇచ్చేవారు. కరోనా సమయంలోనూ రోగులకు విశేష సేవలందించారు.

10, 11 తేదీల్లో గాలులు, వానలు

- కొన్నిచోట్ల భారీవర్షాలకు అవకాశం



సాక్షి, విశాఖపట్నం: మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ వానలు మొదలుకానున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో బుధవారం (రేపు) అల్పపీడనం ఏర్పడిన తరువాత ఈ వర్షాలు మరింత ఊపందుకోనున్నాయి. ఈ అల్పపీడనం వాయవ్యదిశగా తమిళనాడు, పుదుచ్చేరిల వైపు పయనించనుంది. దీని ప్రభావంతో బుధవారం ఒకటిరెండు చోట్ల తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉందని, ఈనెల 10వ తేదీ నుంచి దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని, గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో వెల్లడించింది. 11వ తేదీ నుంచి కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడన ప్రభావంతో వీచే ఈదురుగాలులతో సముద్రం అలజడిగా మారుతుందని, అందువల్ల మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించింది. సోమవారం విజయనగరం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అల్లూరి సీతారామరాజు, అనంతపురం జిల్లాల్లో చిరుజల్లులు కురిశాయి.

చిరుధాన్యాలతోనే విరుగుడు



సంపూర్ణ ఆరోగ్యానికి వాటి వినియోగం తక్షణం పెంచాలి

వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా వాటిని ప్రోత్సహించాలి

సాక్షి, అమరావతి: ప్రజల సంపూర్ణారోగ్యానికి దేశంలో చిరుధాన్యాల వినియోగాన్ని తక్షణం పెంచాల్సిన ఆవశ్యకత ఉందని నాబార్డు అధ్యయన నివేదిక స్పష్టంచేసింది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా తృణధాన్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. చిరుధాన్యాలపై ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నప్పటికీ ఆ స్థాయిలో వినియోగం పెరగడంలేదని, సరఫరా చేయడం సాధ్యంకావడంలేదని నివేదిక తెలిపింది. ఇటీవల రాయచూర్‌లోని వ్యవసాయ శాస్త్రాల విశ్వవిద్యాలయం, నాబార్డు సంయుక్తంగా మిల్లెట్ సదస్సును నిర్వహించాయి. ఇందులో మిల్లెట్స్–సవాళ్లు స్టార్టప్‌ల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా అటల్ ఇన్నోవేషన్ మిషన్, రాయచూర్ వ్యవసాయ శాస్త్రాల విశ్వవిద్యాలయం చిరుధాన్యాలను ప్రోత్సహించేందుకు కొన్ని సిఫార్సులు చేశాయి. 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా జరుపుకోవాలని ప్రపంచమంతా సిద్ధమవుతున్న తరుణంలో భారత్ కూడా వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా తృణధాన్యాలను ప్రోత్సహించేందుకు సిద్ధపడుతోందని నివేదిక పేర్కొంది.

చిరుధాన్యాలతోనే పోషకాహార లోపం నివారణ

దేశంలో 59 శాతం మంది మహిళలు, పిల్లలు రక్తహీనతతో సతమతమవుతున్నారని, అలాంటి వారికి చిరుధాన్యాలను ఆహారంగా అందించాల్సి ఉందని నివేదిక తెలిపింది. చిరుధాన్యాల్లో 7–12 శాతం ప్రొటీన్లు, 2–5 శాతం కొవ్వు, 65–75 శాతం కార్బోహైడ్రేట్లు, 15–20 శాతం ఫైబర్, ఐరన్, జింక్, కాల్షియం ఉన్నాయని వివరించింది. ఊబకాయం, మధుమేహం, జీవనశైలి జబ్బులు, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యల పరిష్కారానికి చిరుధాన్యాల వినియోగమే పరిష్కారమని తేల్చింది. మరోవైపు.. 1970 నుంచి దేశంలో చిరుధాన్యాల ఉత్పత్తి, సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోందని.. ఇందుకు ప్రధాన కారణం బియ్యం, గోధుమల ఉత్పత్తి, సాగు విస్తీర్ణం పెంచడమేనని నివేదిక స్పష్టం చేసింది. 1962లో చిరుధాన్యాల తలసరి వినియోగం 32.9 కిలోలుండగా ఇప్పుడది 4.2 కిలోలకు తగ్గిపోయిందని నివేదిక వివరించింది.

రైతులకు లాభసాటిగా చేయాలి

చిరుధాన్యాల సాగుతో రైతులకు పెద్దగా లాభసాటి కావడం లేదని, మరోవైపు.. వరి, గోధుమల సాగుకు లాభాలు ఎక్కువగా వస్తున్నాయని నివేదిక తెలిపింది. చిరుధాన్యాలకే ఎక్కువ మద్దతు ధర ఉన్నప్పటికీ ఉత్పాదకత, రాబడి తక్కువగా ఉండటంతో రైతులు వరి, గోధుమల సాగుపైనే ఎక్కువ దృష్టిసారించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో.. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు నగదు రూపంలో రాయితీలు ఇవ్వడంతో పాటు ఉత్పాదకత పెంచడానికి ప్రభుత్వాలు తగిన చర్యలను తీసుకోవాలని నాబార్డు నివేదిక సూచించింది.

విజయనగరంలో మిల్లెట్స్ ఉత్పత్తి కంపెనీ

ఇక ఆంధ్రప్రదేశ్‌లో మిల్లెట్స్ ఉత్పత్తుల ద్వారా డబ్బు సంపాదించవచ్చునని నిరూపించిన విజయగాథలున్నాయని నివేదిక పేర్కొంది. విజయనగరం జిల్లాలో 35 గ్రామాలకు చెందిన 300 మంది మహిళా సభ్యులు ఆరోగ్య మిల్లెట్స్ ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్‌ను 2019–20లో స్థాపించినట్లు తెలిపింది. మహిళా రైతులకు ఆహార భద్రత, పోషకాహారం, జీవవైవిధ్యంతో పాటు భూసారాన్ని పెంపొందించే లక్ష్యంగా ఎఫ్‌పీఓగా ఏర్పాటై ఆరోగ్య మిల్లెట్స్ అనే బ్రాండ్ పేరుతో చిరుధాన్యాల ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు విజయవంతంగా మార్కెటింగ్ చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. అలాగే, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎఫ్‌పీఓతో కలిసి మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేయాలని యోచిస్తోందని, రేగా గ్రామంలో రూ.4.1 కోట్లతో యూనిట్ ఏర్పాటుచేయడం ద్వారా 240 మందికి ఉపాధి కల్పించనుందని పేర్కొంది.

చిరుధాన్యాల ప్రోత్సాహానికి తీసుకోవాల్సిన చర్యలివే..

- సెలబ్రిటీలతో పాటు ఇతరుల ద్వారా చిరుధాన్యాల వినియోగంపై అవగాహన ప్రచారాలు కల్పించాలి.
- ప్రతీ సోమవారం తృణధాన్యాల వినియోగం అలవాటు చేయాలి.
- విమానాలతో పాటు రైళ్లల్లో చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన కార్యక్రమాల్లో చిరుధాన్యాలను వినియోగించాలి.
- ప్రజా పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను చేర్చాలి. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రం అమలుచేస్తోంది.
- తయారుచేసి సిద్ధంగా ఉండే చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందుబాటులో ఉంచేందుకు అవసరమైన ప్రాసెసింగ్, విలువ జోడింపు, సాంకేతిక సౌకర్యాలను కల్పించాలి.
- పట్టణ వినియోగదారులే లక్ష్యంగా సోషల్ మీడియాను ఉపయోగించాలి.
- చిరుధాన్యాలను పండించే రైతులకు నగదు ప్రోత్సాహకాలను అందించాలి.
- సాంకేతికత సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకమైన మిల్లింగ్ పరికరాలను ఏర్పాటుచేయాలి.

గత ఐదేళ్లుగా వరి, గోధుమల కన్నా రాగి, జొన్న, సజ్జల మద్దతు ధర ఇలా.. (క్వింటాలు/రూపాయిలలో)

ఏడాది	జొన్నలు	సజ్జలు	రాగులు	వరి	గోధుమలు
2017-18	1,700	1,425	1,960	1,550	1,715
2018-19	2,430	1,950	2,897	1,750	1,840
2019-20	2,550	2,000	3,150	1,815	1,925
2020-21	2,620	2,150	3,295	1,868	1,975
2021-22	2,738	2,250	3,377	1,940	2,015

2021-22లో చిరుధాన్యాలు, వరి, గోధుమల ద్వారా హెక్టార్‌కు వచ్చే స్థూల రాబడి.. (రూపాయిల్లో)

జొన్న	రాగులు	సజ్జలు	వరి	గోధుమలు
7,896	6,784	7,571	20,973	40,749



రామోజీరావు స్టేలపై పుస్తకం రాస్తా

రామోజీపై ఎలాంటి కేసు పెట్టినా కోర్టు నుంచి స్టే తెచ్చుకోగలరు

- ఆయన డిపాజిట్లు ఎవరికి తిరిగి ఇచ్చారనేది ప్రశ్నార్థకం
- కోర్టుకు తప్పుడు పేర్లు ఇచ్చారు
- అద్వానీ, ఉపేంద్ర పేర్లు కూడా ఆ జాబితాలో ఉన్నాయి
- ప్రభుత్వం మార్గదర్శిపైనా దర్యాప్తు చేయాలి
- అమరావతి రాజధానిని మొదటగా వ్యతిరేకించింది నేనే
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



సాక్షి, రాజమహేంద్రవరం: ఈనాడు రామోజీరావుపై ఎలాంటి కేసులు పెట్టినా కోర్టు నుంచి స్టే తెచ్చుకోగలరని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆరోపించారు. రామోజీరావు కోర్టుల నుంచి తెచ్చుకున్న స్టేలపై తాను ఒక పుస్తకమే రాస్తానని, లా విద్యార్థులకైనా ఉపయోగపడుతుందని చెప్పారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్గదర్శిపై తాను కేసు వేసి 16 ఏళ్లయిందని చెప్పారు. ఆ కేసు ఎప్పుడు తేలుతుందో, అప్పటివరకు తాను ఉంటానో లేదోనని వ్యాఖ్యానించారు. అయినా తాను వదలబోనన్నారు. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) డిపాజిట్లు సేకరించడం చట్టవిరుద్ధమన్నారు. మార్గదర్శి అకౌంట్ బుక్స్ ఎవరూ చెక్ చేయకుండా కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారన్నారు. రామోజీకి, మార్గదర్శికి సంబంధం లేదని కోర్టులో చెప్పినప్పటికీ అన్ని సంస్థలకూ చైర్మన్ రామోజీ అనే సంతకం ఉందన్నారు. చిట్‌ఫండ్ కంపెనీ డబ్బును ఇతర వ్యాపారాలకు వాడకూడదన్న నిబంధనలనూ పట్టించుకోలేదని అన్నారు. మార్గదర్శి రూ.1,300 కోట్లు నష్టాల్లో ఉందని రంగాచారి కమిషన్ చెప్పిందన్నారు. 12 చానళ్ల అమ్మి నష్టాలు పూడ్చానని ఆయన అంటున్నారని, అది నిజమని తాము నమ్మడంలేదని చెప్పారు. డిపాజిట్లు తిరిగి ఇచ్చేసానంటున్న రామోజీ ఎవరికి ఇచ్చారనేది ప్రశ్నార్థకమన్నారు. ఆయన కోర్టుకు తప్పుడు పేర్లు సమర్పించారని, అందులో ఎల్‌కే అద్వానీ, ఉపేంద్ర అనే పేర్లు కూడా ఉన్నట్లు తాను చూశానన్నారు. రూ.1,125 కోట్ల నగదు ఈక్వలెంట్‌లో ఉందని కోర్టుకు చెప్పారన్నారు. సత్యం రామలింగరాజు నగదు ఈక్వలెంట్‌లో ఇలాంటి లెక్కలు చెప్పే జైలుకు వెళ్లారని తెలిపారు. మార్గదర్శికి డిపాజిట్లు ఎక్కడి నుంచి వచ్చాయన్న విషయంపై ఈడీ విచారణ చేపట్టాలని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ)కి లేఖ రాశానన్నారు. అయితే, 12 చానళ్ల విక్రయ లావాదేవీలపై సెబీ విచారణ జరపాలని, రామోజీ ఫిలిం సిటీ వయోలేషన్ ఆఫ్ ల్యాండ్ సీలింగ్‌పై స్పందించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమని ఆర్వోసీ తెలిపిందన్నారు. ప్రభుత్వం చిట్‌ఫండ్ కంపెనీలపై విచారణ జరుపుతున్నందున, మార్గదర్శిపైనా దర్యాప్తు జరపాలని, తన వద్ద ఉన్న ఆధారాలన్నీ ఇస్తానని అన్నారు. ప్రభుత్వం మార్గదర్శిపై ముందుగా కోర్టులో కేవియెట్ వేయాలని కోరారు. రామోజీ చట్టానికి అతీతుడు కాదని తేల్చాలని కోరారు. చిన్న కంపెనీలకు ఒక న్యాయం, పెద్ద వాటికి ఒక న్యాయం ఉండకూడదన్నారు. రాష్ట్ర విభజన, అమరావతి రాజధానిపై 'విభజన వ్యథ' అనే పుస్తకం రాస్తున్నానని ఉండవల్లి చెప్పారు. అమరావతి రాజధానిని మొదటగా వ్యతిరేకించిన వ్యక్తి తానేనని తెలిపారు. రాజధాని అక్కడ పెట్టడం సరైనది కాదని, అది భ్రమరావతి అని చెప్పిందీ తానేనన్నారు. మూడు రాజధానుల అంశాన్ని సుప్రీంకోర్టు తేలుస్తుందన్నారు. పవన్ కళ్యాణ్ అధికారంలోకి రాలేదు కాబట్టి ఆయన్ని తాను విమర్శించబోనని అన్నారు.

ఆ జీవో చెల్లదు

- టీడీపీ హయాంలో ఇచ్చిన జీవోను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ఏఎఫ్‌ఆర్సీ సిఫార్సులు లేకుండా ఫీజులు పెంచకూడదు
- అదనంగా వసూలు చేసిన ఫీజులు విద్యార్థులకు తిరిగివ్వాలని ఆదేశం
- నారాయణ మెడికల్ కాలేజీ కేసులో స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (ఏఎఫ్‌ఆర్సీ) సిఫార్సులు లేకుండానే సూపర్ స్పెషాలిటీ కోర్సు ఫీజులు పెంచుతూ టీడీపీ హయాంలో ఇచ్చిన జీవోను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏపీ హైకోర్టు 2019లో ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ నారాయణ మెడికల్ కాలేజీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సుధాంశు ధూలియాలతోకూడిన ధర్మాసనం సోమవారం తీర్పు చెప్పింది. ఏఎఫ్‌ఆర్సీ సిఫార్సులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ కోర్సుల ఫీజులు పెంచడం సరికాదన్న హైకోర్టు తీర్పును సమర్థించింది. ఏఎఫ్‌ఆర్సీ సిఫార్సుల మేరకే ఫీజులు వసూలు చేయాలని, అంతకన్నా ఎక్కువగా వసూలు చేసిన సొమ్మును విద్యార్థులకు వెనక్కి ఇవ్వాలని ఆదేశించింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం, నారాయణ మెడికల్ కాలేజీ చెరో రూ.2.5 లక్షలు ఆరు వారాల్లో సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి జమ చేయాలని, ఆ మొత్తాన్ని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా), సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీలకు బదిలీ చేయాలని తీర్పులో పేర్కొంది.

జరిగిందిదీ..

ఏఎఫ్‌ఆర్సీ 2011లో సూపర్ స్పెషాలిటీ వైద్య సీట్ల రుసుములు నిర్ణయించింది. మూడేళ్లకోసారి ఈ ఫీజులు సవరిస్తూ ఉంటుంది. 2017 వచ్చినప్పటికీ ఏఎఫ్‌ఆర్సీ సిఫార్సులు చేయలేదు. ఏఎఫ్‌ఆర్సీ తగిన సమయంలో సిఫార్సులు చేయకపోవడంతో 2017 జూన్ 9న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఫీజులు పెంచుతూ జీవో జారీ చేసింది. ఈ జీవోను కొంతమంది విద్యార్థులు హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు 2019లో జీవో చెల్లదని ఆదేశాలు ఇచ్చింది. ఏఎఫ్‌ఆర్సీ సిఫార్సుల మేరకే ప్రభుత్వం జీవో ఇవ్వాలని స్పష్టం చేసింది. దీన్ని నారాయణ మెడికల్ కాలేజ్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

విభిన్న ప్రతిభావంతులకు 1,750 మోటార్ వాహనాలు

నిబంధనలు సరళతరం చేసి పెద్ద మనసు చాటుకున్న సీఎం జగన్

- మరింత ఎక్కువ మందికి లబ్ధి
- ఈ నెల 15 వరకు దరఖాస్తుల గడువు
- ఇప్పటి వరకు 5,743 దరఖాస్తులు
- ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల రోజైన డిసెంబర్ 3న పంపిణీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం 1,750 మూడు చక్రాల మోటారు వాహనాలను ఉచితంగా (పూర్తి సబ్సిడీతో) అందించనుంది. అసెంబ్లీ నియోజకవర్గానికి పది చొప్పున వాహనాలను కేటాయించారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల రోజైన డిసెంబర్ 3న వీటి పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిబంధనలను సరళతరం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం రెండు విడతలుగా 1,532 వాహనాలను మాత్రమే పంపిణీ చేయగా, వైఎస్ జగన్ ప్రభుత్వం ఒకే విడతలో అంతకు మించిన సంఖ్యలో వాహనాలను అందిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం 80 శాతం వైకల్యం ఉంటేనే వాహనాన్ని ఇవ్వగా, జగన్ ప్రభుత్వం దానిని 70 శాతానికి తగ్గించింది. వయోపరిమితిలో కూడా సడలింపులు ఇచ్చారు. తద్వారా మరింతమందికి లబ్ధి చేకూరనుంది. వాహనాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఇప్పటివరకు 5,743 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేయడానికి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీలను నియమించారు. ఈ కమిటీలో విభిన్న ప్రతిభావంతుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసర్, ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ, రవాణా శాఖల జిల్లా అధికారులు, ఎముకల వైద్య నిపుణులు (సర్జన్), ఇతర అధికారులు ఉంటారు.

ఇవీ నిబంధనలు

- వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉండాలి
- లబ్ధిదారుల ఎంపికకు రెండు నెలల ముందు డ్రైవింగ్ లైసెన్సు పొంది ఉండాలి
- గతంలో ఎప్పుడూ ఇటువంటి వాహనాలు తీసుకుని ఉండకూడదు
- గతంలో దరఖాస్తు చేసినప్పటికీ వాహనాలు మంజూరుకాకపోతే కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు
- జిల్లా మెడికల్ బోర్డు ఇచ్చిన సదరం ధ్రువపత్రం, ఆధార్ కార్డు, వృత్తిదారులు అయితే ఎస్ఎస్‌సీ ధ్రువపత్రం, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ విద్యార్హతల పత్రాలు ఉండాలి
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజులో పూర్తి ఫొటో
- వీటన్నిటిని ఆన్‌లైన్‌లో దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాలి.

వైకల్యం శాతం తగ్గింపు.. వయోపరిమితి పెంపు

- ఎంఏ కుమార్ రాజా, ఎండీ, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలుస్తున్నారు. వైకల్యం శాతం తగ్గింపు, వయో పరిమితి పెంపు వంటి అవకాశాలతో విభిన్న ప్రతిభావంతులకు మేలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్ద మనస్సును చాటుకుంటున్నారు. గతంలో 80 శాతం పైగా వైకల్యం ఉన్న వారే అర్హులు కాగా, ఇప్పుడు 70 శాతానికి తగ్గించాం. గతంలో 18 నుంచి 40 ఏళ్ల వయో పరిమితి నిబంధన ఉంటే ఇప్పుడు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులుగా అవకాశం ఇచ్చారు. అర్హులకు ఒక్కొక్కరికి సుమారు రూ.92 వేల ఖరీదైన మోటారు వాహనం ఉచితంగా అందిస్తాం.

నిందితులు సహకరించకపోతే ముందస్తు బెయిలు రద్దు కోరవచ్చు

- రాజధాని మాస్టర్‌ప్లాన్ కేసులో సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: రాజధాని మాస్టర్ ప్లాన్ రూపకల్పన, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌పై జరుపుతున్న విచారణలో నిందితులు సహకరించకపోతే వారి ముందస్తు బెయిలు రద్దు చేయాలని దర్యాప్తు సంస్థ హైకోర్టును కోరవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. మాజీ మంత్రి నారాయణ, లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, కేపీవీ అంజనీకుమార్‌లకు హైకోర్టు ముందస్తు బెయిలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హరీన్ రావెల్ వాదనలు వినిపిస్తూ.. నిందితులకు హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేయడంతో దర్యాప్తు సంస్థకు వారు సహకరించడంలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టులో విచారణ సాగుతున్నప్పటికీ దర్యాప్తుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని తెలిపింది. నిందితులు సహకరించకపోతే ముందస్తు బెయిలు రద్దు చేయాలని హైకోర్టును కోరవచ్చని స్పష్టం చేసింది. పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు తెలిపింది.

ఏపీ ప్రభుత్వ ఆతిథ్యం చాలా బాగుంది

- వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత సునీత కృష్ణన్
- తన సంతోషాన్ని సోషల్ మీడియాలో పంచుకున్న ప్రముఖ సంఘ సేవకురాలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ అవార్డులను ప్రదానం చేసిన తీరుపై ప్రముఖ సంఘ సేవకురాలు డాక్టర్ సునీత కృష్ణన్ ప్రశంసల జల్లు కురిపించారు. ప్రజ్వల ఫౌండేషన్ ద్వారా మహిళలు, పిల్లల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆమె సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తన అనుభవాన్ని ప్రజలతో పంచుకున్నారు. ఆమె తన ఫేస్‌బుక్ వాల్‌పై ఇలా రాశారు.

అపూర్వం.. ఆ గౌరవం

పదిహేడేళ్లలో నేను అనేక అవార్డు ఫంక్షన్లకు హాజరయ్యాను. అక్కడ గౌరవానికి బదులు అగౌరవంగా భావించే సందర్భాలు అనేకం ఎదురయ్యాయి. అవార్డు గ్రహీతలు లైన్లలో నిలబడి అవార్డును తీసుకోవడానికి పరుగెత్తుతుంటే.. దానిని ఇచ్చేందుకు నిర్వాహకులు తొందరపడుతున్నట్టు వ్యవహరించిన ఘటనలు చూశాను. చెప్పిన సమయానికి కార్యక్రమాన్ని మొదలు పెట్టకుండా గంటల తరబడి వేచి ఉండేలా చేసిన చేదు అనుభవాలు ఉన్నాయి. కానీ.. ఏపీలో ప్రభుత్వం నిర్వహించిన ఫంక్షన్‌లో అవార్డు స్వీకరణకు వెళ్లడం గొప్ప అనుభూతి మిగిల్చింది. ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన తీరు, కార్యక్రమానికి చేసిన ఏర్పాట్లు, నిర్వహించిన తీరు నేను జీవితంలో ఈ స్థాయికి రావడానికి చేసిన పోరాటం విలువైనదేనని అనిపించేలా ఉన్నాయి. వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అనే రెండు విభాగాల్లో 30 మంది అవార్డు గ్రహీతలు ఉన్నప్పటికీ అందరికీ సమాన గౌరవం, సమయం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండు గంటలపాటు అక్కడే ఉండి, స్వయంగా అవార్డు గ్రహీతలను పేరుపేరునా గవర్నర్‌కు, ఆయన తల్లికి పరిచయం చేశారు. ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్ వంటి వారు అవార్డు గ్రహీతల వద్దకు వచ్చి ఆప్యాయంగా పలకరించారు. విజయవాడలో దిగినప్పటి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లే వరకూ అత్యంత గౌరవనీయ అతిథిలా మర్యాదలు చేశారు. ఇంత అందమైన కార్యక్రమాన్ని ప్రణాళిక ప్రకారం అమలు చేసిన నాయకత్వానికి, రాష్ట్ర అధికారులకు కృతజ్ఞతలు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.